అంతా ఆమె దయే



డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వరరావు

అంతా ఆమె దయే



రచయిత

డాక్టర్ పొత్తూరి వేంకటేశ్వరరావు

ప్రచురణ

శ్రీ విశ్వజననీ పరిషత్, జిల్లెళ్ళమూడి -522 113.

బాపట్ల మండలం, గుంటూరుజిల్లా

ముద్రణ : తొలిముద్రణ 2010
అమ్మ జన్మదినోత్సవము 26-3-2010

కాపీలు : 1000

కృతజ్ఞతలు

శ్రీచక్కా గోవర్ధనరావు, లక్ష్మీకాంతమ్మ ఛారిటబుల్ ట్రస్ట్
తరఫున
ఛైర్మన్ శ్రీచక్కా శ్రీమన్నారాయణగారు
శ్రీనాదెండ్ల లక్ష్మణరావుగార్లకు
ఈ గ్రంథ ముద్రణకు తోడ్పడి నందుకు మా ధన్యవాదములు

- శ్రీ విశ్వజననీ పరిషత్

ప్రాప్తి స్థానము : **శ్రీ విశ్వజననీ పరిషత్,**
జిల్లెళ్ళమూడి - 522 113
బాపట్ల మండలం,
గుంటూరుజిల్లా.

వెల : రూ. 30/-

ముద్రణ : **లక్ష్మీగణపతి ఆర్ట్ ప్రింటర్స్**
2/4, బ్రాడీపేట, గుంటూరు- 522 002
ఫోన్ : 2235036

విషయ సూచిక

అన్ని రకాల ప్రజలకూ ఉపయోగపడే గ్రంథం ఇది



డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వరరావుగారు లోకంలో పేరు పొందిన ఈనాడు ఆంధ్రప్రభ వంటి దిన వారపత్రికలకు, సంపాదకులుగా చేసిన సుప్రసిద్ధ జంటిల్‌మన్ జర్నలిష్టు. ప్రెస్‌అకాడమీ ఛైర్మన్‌గా ఒక మంత్రిహోదాను అనుభవించినవారు. న్యాయమూర్తిగా అంతకు మించిన గౌరవాన్ని పొందినవారు. అన్నిటికన్నా ఏమీ ఆశించకుండా తిరుమల తిరుపతి దేవస్థానంలో, జిల్లెళ్ళమూడి అందరింటిలో సేవచేస్తున్నవారు.

పుంఖానుపుంఖంగా ఎన్నో సంపాదకీయాలు, వ్యాసాలు వ్రాసారు. సంపాదకీయాలకు సాహిత్య వాసన తెచ్చిన సంస్కార సంపన్నులు. శ్రీ వెంకటేశ్వరరావు గారు అయిదు దశాబ్దాలుగా అమ్మ వద్దకు వస్తున్నారు. మితభాషి హితభాషి, సౌమ్యభాషి అయిన వారు తమ రచనలలో సైతం క్లుప్తతను, పొదుపును పాటిస్తారు. ఏ పదాన్నైనా అర్థవంతంగా వాడతారు. చిన్ననాటినుండి దేనినీ గుడ్డిగా నమ్మరు. హేతువాద దృష్టి. అంతమాత్రాన నిరీశ్వరవాది కాదు. వేదాన్ని నమ్ముతారు, హోమాలు చేస్తారు. ధ్యానయోగి.

అమ్మదేవత అని ఆయన ఒప్పుకోరు. నిజానికి అమ్మ కూడా తాను దేవతనని ఎక్కడా ఎప్పుడూ చెప్పలేదు. చెప్పలేదా ? అని గట్టిగా అడిగితే, మాటల సందర్భంలో ఒప్పుకొన్న సందర్భాలు కూడా లేకపోలేదు. అతిమానుష శక్తులు అమ్మ ప్రదర్శించలేదు. ఒక వేళ జరిగినా వాటితో తనకు సంబంధం లేదన్నది. అమ్మ మహిమాన్విత. "అమ్మ ఎక్కడ ఏమి జరుగుతున్నదో తను తలచుకుంటే చూడగలదు. సుదూర ప్రాంతాలలో మనం మాట్లాడుకున్న మాటల్ని వినగలదు. అమ్మకు భూత భవిష్యత్ వర్తమానాలనే తేడాలు లేవు. అన్ని కాలాలూ ఆమెకు వర్తమానమే. నాకు సైతం స్వంత అనుభవాలు కొన్ని ఉన్నాయి" అని కొద్ది పదార్థాన్ని మరింతగా చేసిన సంఘటనలను ఆయన ఉదహరించారు కూడా. అందుకే "అనుభవాలు అసత్యమని అనుకో లేను" అన్నారు. "కానీ, మహత్తులను మించిన అమ్మ యొక్క మహోన్నత మానవీయ లక్షణాలకే నేను ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తాను అంటారు".

అమ్మది విశ్వకుటుంబం. అమ్మ విశ్వజనని. సమాజానికి మేలుచేసే దేన్నినైనా ఆయన ఇష్టపడతారు. అటువంటిదే మంచి విశ్వాసం అంటారు. అమ్మలోని మానవీయ లక్షణాలు వారిని ప్రభావితం చేశాయి; అమ్మ ఏదైనా అనుభవించిందే చెప్పేది కనుక అమ్మ మాటలు మహావాక్యాలుగా ఆయన దర్శించారు. మనకు తెలియకుండానే మనలో అమ్మ తెచ్చిన మార్పును అమ్మ చేసిన ప్రశాంత విప్లవ మహోద్యమంగా గ్రహించగలిగారు, మానవ ప్రయత్నం వల్ల గర్వభంగం చెందటమే తప్ప అంతా నిర్ణయం ప్రకారమే జరుగుతుందనేది స్పష్టంగా అర్థమయింది. అమ్మ మాట వృధా కాదు. అమ్మది తోలు కోరు కాదు తాలు మాట రావటానికి. 1957లో అమ్మ ఏడవ మైలువద్ద సింహద్వారం వస్తుందని చెప్పింది. ఇరవై ఆరు సంవత్సరాలు తర్వాత 1983 లో ఆ నిర్మాణం జరిగింది. అమ్మ ఏంచెప్పింది ఏం చేసింది అనే విషయం ఆయన ఆలోచించి అందరూ కలసి బ్రతకటాన్ని, తనకున్న దానిలో ఇతరుల కింత పెట్టటాన్ని ప్రోత్సహించినట్లు కనిపిస్తుంది అన్నారు.

అమ్మ దేవాలయాలు దర్శించింది. దేవాలయాలు నిర్మించింది. అయితే ఈ విశ్వమంతా దేవాలయమేనని. దానికి ప్రతీకయే ఈ దేవాలయాలనీ, అమ్మ బాపట్ల దేవాలయంలో చేసిన విచికిత్స దానికి తార్కాణమనీ వారి విశ్వాసం. అంతేకాక అమ్మదేవాలయాలు జిల్లెళ్ళమూడి, మన్నవలలోనే కాక చాలా ప్రదేశాలలో వస్తాయనీ, అమ్మను నమ్మినవారికి అవి పుణ్యక్షేత్రాలు ఆరాధనాస్థలాలు అవుతాయని వారు చెప్పారు. విగ్రహారాధన కూడా ఒక ఆధ్యాత్మిక సాధన అని, సాధకులకు దైవం పట్ల భక్తిని శ్రద్ధను పెంపొందిస్తుందనీ, విశ్వాసాన్ని గట్టి పరుస్తుందని వారన్నారు. విగ్రహారాధన నచ్చనివారు తమదైన మార్గంలో సాధన చేసుకోవచ్చున్నారు.

అమ్మది అక్షరాలా లౌకికవాదం అంటూ సాంఘిక సమానత్వం ఆచరణలో ఏలా అమ్మ చేసిచూపించిందో చెప్పారు. సర్వసమ్మతమైనదే నా మతం అన్న అమ్మ ఎలా అన్ని మతాలవారినీ చేరదీసింది ప్రేమించిందీ చూపారు. అయితే అమ్మ "లౌకికము ఆధ్యాత్మికము అంటూ రెండు లేవు నాన్నా! ఉన్నది ఒకటే రెండుగా కనిపిస్తుంది" అన్న దానిని ఈ గ్రంథరచయిత కూడా అంగీకరిస్తారు.

"అమ్మ విశ్వకుటుంబిని. అపార కరుణామయి. ప్రేమస్వరూపిణి. ప్రేమ వాత్సల్యాలు మాటలలో కాక అమ్మ చేతలలో నిరంతరం వ్యక్తమౌతూనే ఉన్నాయి" ఇది ఆయన అమ్మలో గమనించింది" మీరు నాలో మానవత్వాన్ని చూస్తారు, నేను

మీలో దైవత్వాన్ని చూస్తాను" అన్నది అమ్మ. అసలు అమ్మ "సృష్టే దైవం" అన్నది మనం సృష్టిలో భాగమే కదా ! అంటారు వేంకటేశ్వరరావు గారు.

వెంకటేశ్వరరావు గారు బ్రహ్మసూత్రాలు చదివారు, ఉపనిషత్తులు చదివారు, పురాణాలు చదివారు, లౌకిక అలౌకిక గ్రంథాలెన్నో చదివారు. చదివింది ఏదైనా సునిశితంగా చదివారు. ఎంత చదవకపోతే **ఆధ్యాత్మిక పదకోశం** (ఇప్పటికి ఎవ్వరూ వ్రాయనిది) వ్రాయగలరు. జర్నలిజాన్ని గూర్చి వారు వ్రాసినగ్రంథాలు జర్నలిజం కళాశాలలో పాఠ్యగ్రంథాలు.

'అంతా ఆమె దయే' అని ఈ గ్రంథానికి పేరు పెట్టడం కూడా ఔచిత్య సుందరమే. ఎందుకంటే అమ్మనుగూర్చి ఆయన విశ్వాసమది. "ఎవరి మార్గంలో వారు ఏదో చేయాలనుకుంటున్నారు. చేస్తున్నారు. ఒక్కొక్కసారి చేయలేకపోవటం కూడా ఉంటుంది. ఈ చేయటానికి చేయలేకపోవటానికి, అంతా ఆమె సంకల్పం ప్రకారమే జరుగుతున్నదనిపిస్తున్నది. ఇది నాకు అనుభవం నుంచి జనించిన విశ్వాసం" అంటారు వెంకటేశ్వరరావుగారు.

నాకు వెంకటేశ్వరరావుగారు ఇష్టమే - వారి రచనలూ ఇష్టమే. అయితే నాకు ఇష్టమైనంత మాత్రాన ఈ గ్రంథం వెలుగు చూడటం లేదు. ఇందులోని విషయం జిల్లెళ్ళమూడి వచ్చే సోదరీ సోదరులలో చాలా మందికి ఇష్టమైనది. అంతే కాదు హేతువాదులకు, సామ్యవాదులకు, ఆస్తికవాదులకు, నిరీశ్వరవాదులకు కూడా ఉపయోగపడే రీతిలో ఉన్నది. ఆస్తికుడికి నాస్తికుడికి తేడా చెపుతూ అంతా పైవాడిదేనని ఆస్తికుడు, నాదేనని నాస్తికుడు అంటాడు; దానిపై నిశ్చలంగా ఉంటే ఏదైనా ఒకటే అంటుంది అమ్మ.

ఈ రచనలన్నీ వివిధ దిన, వార పత్రికలలో మాతృశ్రీ, విశ్వజననిలలో ప్రచురితమైనవి సేకరించాను. కొన్ని వ్యాసాలు కొన్ని గ్రంథాలకు వారు వ్రాసిన ముందుమాటల నుండి గ్రహించినవి. ఏది ఏమైనా అన్ని రకాల ప్రజలకు ఉపయోగపడే ఒక గ్రంథం వెలుగు చూస్తున్నందుకు సంతోషిస్తున్నాను.

సంపాదకుడు
పురుషోత్తమపుత్రభార్గవ
పి.యస్.ఆర్.ఆంజనేయప్రసాద్



కేరింత

మనందరి అమ్మ నిర్మించిన అద్భుత సమాజంలో ఎవరిలో ఏ ప్రతిభ ఎప్పుడు వికసిస్తుందో, ఎప్పుడు రాణిస్తుందో ఊహాకు అందదు. సోదరుడు పి.యస్.ఆర్.ఆంజనేయప్రసాద్ అమ్మ తీర్చిదిద్దిన ఒక విలక్షణ వ్యక్తి. యాభై సంవత్సరాలు దాటిన మా ఆత్మీయతానుబంధంలో అతడొక మంచి సంపాదకుడు కాగలడని పదేళ్ల క్రిందటి వరకు నేను అనుకోలేదు. సంపాదకుడనే పదానికి ఎడిటర్ అనే ఇంగ్లీషు మాటను ఉపయోగించి అర్థంచెప్పుకోవాలసి వస్తున్నది. ఎందుకంటే సంపాదకుడు అంటే సంపాదించేవాడని మాత్రమే సామాన్యార్థం. ఎడిటర్ అనే పదానికి సమానార్థకంగా తెలుగునాట ఆ పదం ఒకప్పుడు లేదు. మహారాష్ట్ర నుంచి, ఇతర ఉత్తరాది రాష్ట్రాల నుండి వచ్చి మన ప్రాంతంలో అది స్థిరపడింది. ఎడిటర్‌కు కావలసిన యోగ్యతలలో ఒకటి విషయ సేకరణ సామర్థ్యం. ఎవరైనా వ్రాసి ఇచ్చిన దాన్ని ప్రచురణ యోగ్యంగా మలచి పాఠకులకు అందించడం.

శ్రీ పి.యస్.ఆర్., నేను అప్పుడప్పుడు, అక్కడక్కడ అమ్మను గురించి వ్రాసిన రచనలను భద్రంగా సేకరించి, ఇంగ్లీషులో గిలికిన వ్యాసాలను సైతం సమర్థులచే అనువాదం చేయించి ముద్రణకు అనుగుణంగా కూర్పు చేయించి, ప్రతిని నాకు చూపించినప్పుడు మనస్సు కేరింత కొట్టింది. నేను ఇన్ని వ్రాశానా? పియస్ఆర్ గారు వ్రాసి నా పేరు పెట్టారా ! అనీ అనుమానం గూడా కలిగింది చెప్పొద్దూ ! అలా కాదని అయిన నాకు నమ్మకం కలిగించారు.

"కేరింత" అనే పదం వాడాను. అది పసిపిల్లలు చేసే ధ్వని. డెబ్బది ఆఱు సంవత్సరాల వాడను, కేరింత ఏమిటి ? ఆ పదాన్ని నేను ఉద్దేశపూర్వకంగానే వాడాను.

చాలా కాలం క్రిందటి మాట. అమ్మ చుట్టూ శ్రీ పాద గోపాలకృష్ణమూర్తి గారి వంటి ఉద్దండులు కూర్చొని శాస్త్ర చర్చ చేస్తున్నారు. నాకేమో అమ్మ దగ్గర కూర్చోని పిచ్చాపాటి మాట్లాటమే ఎక్కువ ఇష్టం. నేను అయిష్టంగానే అక్కడ కూర్చోవడం గమనించిన అమ్మ, వాళ్ళంతా వెళ్లాక నాకు ఏవో ముచ్చట్లు చెప్పింది. పెద్దవాళ్ల సంభాషణను ప్రస్తావించినప్పుడు "అవన్నీ నాకు పెద్దగా ఆసక్తి కలిగించవు అమ్మా!" అన్నట్లు గుర్తు. (మాటలు ఇవే కాకపోవచ్చు భావం ఇదే) అమ్మ అప్పుడు "నీవు అడ్డాళ్లలో బిడ్డవురా!" అన్నది. ఇవి అక్షరాలా అమ్మ మాటలు. అంటే అమ్మ దగ్గర నా పరిస్థితి అంతే. మహా మేధావులైన కొందరు అక్కయ్యలు, అన్నయ్యల మధ్య గూర్చునప్పుడు సైతం నా స్థితి అంతే. నిజానికి నాకు అలా ఉండటమే ఇష్టం. అడ్డాళ్లలో బిడ్డను అమ్మ కూడా మిగతా పిల్లలకంటే ఎక్కువ జాగ్రత్తగా, ఎక్కువ శ్రద్ధగా చూస్తుంది గదా!

ఈ పుస్తకంలోని వ్యాసాలు వివిధ సమయాలలో వ్రాసినవి. వ్రాసిన కాలాన్ని పరిగణనలోకి తీసుకొనకుండా, విషయం మీద దృష్టి పెట్టితే అవి మీకు ఆసక్తికరంగానే తోచవచ్చు. సోదరుడు శ్రీ పి.యస్.ఆర్. కృషి వల్ల వస్తున్న ఈ పుస్తకం అమ్మ నిర్మించిన అద్భుత సమాజంలో కొందరికైనా సంతృప్తి కలిగిస్తుందని ఆశిస్తున్నాను.

పొత్తూరి వెంకటేశ్వరరావు

ఉదారచరితానాం తు వసుధైవ కుటుంబకమ్

'పందొమ్మిది వందల ఆరవయ్యో సంవత్సరమో, ఆ మరుసటి యేడాదో సరిగా గుర్తులేదు. హైదరాబాదుకు చెందిన కొందరు సోదరులు, గుంటూరు వాస్తవ్యులైన మరి కొందరితో కలసి పెదనందిపాడు చేరి, అక్కడ బాపట్ల వెళ్ళే బస్సులో ఎక్కడానికి తంటాలు పడుతున్నారు. బస్సు ప్రవేశద్వారం వద్ద జనం త్రోసుకుంటున్నారు. సోదర బృందం గుంపు వెనకే నిలబడి బస్సు ఎక్కే అవకాశం కోసం, ఎదురు చూస్తున్నారు. ఒక పెద్ద మనిషి వారిని "ఎక్కడికి వెళ్ళాలి ?" అని పలకరించాడు.

ఒక సోదరుడు "జిల్లెళ్ళమూడి" అని జవాబు ఇచ్చాడు. "దేనికి ? అమ్మగారిని చూడటానికా ?" మళ్ళీ ప్రశ్న. "అవునండి" అని సోదరుని సమాధానం. పెద్దమనిషి నొసలు చిట్లించి 'బాగా చదువుకొన్న వాళ్ళ లాగా కనిపిస్తున్నారు ... ఇదేమిటి మీరు ఆమెను చూడటానికి వెడుతున్నారా ?" సరిగా ఇవేమాటల్లో కాకపోయినా పెద్దమనిషి ఈ అర్థం వచ్చే వ్యాఖ్యాన పూర్వక ప్రశ్నవేశాడు. సోదరులలో ఒకరు శ్రీ తంగిరాల కేశవశర్మ గారు. ఆయన చిరునవ్వుతో పెద్ద మనిషి వంక తిరిగి "చదువుకొన్న వాళ్ళము గనుకనే వెళుతున్నాం అనుకోండి" అన్నారు. పెద్దమనిషి మొహం మాడ్చుకున్నాడు.

జిల్లెళ్ళమూడి అమ్మ వద్దకు వెళ్లటం అంటే తాయెత్తు కట్టించుకొనడానికో, మంత్రం పెట్టించుకొనడానికో, అనుకొనే చాలామంది ఆ రోజుల్లోనూ అటు తరువాత కూడా ఉండేవారు. జిల్లెళ్ళమూడి వెళ్ళకుండా అభిప్రాయాలు ఏర్పరచుకొనేవారే- ఎక్కువమంది అలాంటి వ్యాఖ్యానాలు చేస్తుండేవారు.కొంతకాలం తరువాత అక్కడ దొంగనోట్లు ముద్రిస్తున్నారనీ, అమ్మను పోలీసులు పట్టుకుపోయారనీ కూడా వదంతులు పుట్టాయి. మరింత ఆశ్చర్యమేమిటంటే అక్కడ బోలెడంత డబ్బు మూలుగుతున్నదనీ, వెండి, బంగారం పుష్కలంగా ఉన్నాయనీ భ్రమించి విప్లవవర్గంగా ప్రకటించుకొన్న కొందరు జిల్లెళ్ళమూడి అమ్మ ఉంటున్న ఇంటిపై ఒక రాత్రి దాడిచేశారు.

ఇలా ఎందరో ఎన్నోవిధాలుగా అనుకొన్నప్పటికి జిల్లెళ్ళమూడి అమ్మను ఒకసారి దర్శించుకొన్నవారు మళ్ళీ మళ్ళీ దర్శించుకొంటూనే వచ్చారు. అలా

అమ్మపట్ల భక్తి, ప్రేమ, గౌరవాలు పెంచుకొన్నవారిలో కేశవశర్మగారు చెప్పిన చదువుకొన్నవారూ ఉన్నారు, చదువులేని వారూ ఉన్నారు. కోటీశ్వరులెవరూ లేరేమో గాని, అంతో ఇంతో ఉన్న మధ్యతరగతి వారూ ఉన్నారు. పేదలూ, నిరుపేదలు ఉన్నారు. అన్ని వర్గాలవారు ఉన్నారు. అక్కడ వివక్షత కనిపించదు. "ఇది నాది, వీరు నావారు అది నీది, అతను పరాయివాడు" అనే భావనను తొలగించుకొని ఉదారభావంతో మనందరం విశ్వకుటుంబం అనే భావనను అమ్మ ఆచరణకు ప్రబోధిస్తున్నదని మా మిత్రబృందం కాదు సోదర బృందం అనుకొన్నాము. "ఉదార చరితానాంతు వసుధైవ కుటుంబకమ్" అన్నమాట. అక్కడ అమ్మ సమక్షంలో గుర్తించాము.

సమాజానికి మేలు చేసేదే మంచి విశ్వాసం

అమ్మను గూర్చి తమ అనుభవాలను లోకానికి వెల్లడిచేయని వారెందరో ఉన్నారు. కాగితం మీద పెట్టడం అంతమంచిది కాదనిపించే కొన్ని అనుభవాలు ఉన్నాయి కొందరికి. అవి వెల్లడి కావడం కొందరికి కష్టం కలిగించవచ్చు. అవి ఎప్పటికైనా గ్రంథస్తమౌతాయో లేదో చెప్పలేము. అమ్మ బాల్యంలో ఎందరికో చిత్రవిచిత్రమైన సంఘటనలు అనుభవమైనాయి. తొలుదొలుత అవి ఏవో యాదృచ్ఛిక సంఘటనలను కొన్నారు కొందరు. గాలి చేష్టలు కావచ్చునను కొన్నారు మరికొందరు. రోజులు తరబడి ఏమి తినకపోయినా, అందరి వలె తిన్నట్లుగానే అమ్మ ఉంటే అది ఏదో ఒక వింత జబ్బు అనుకొన్నారు ఆమె సన్నిహిత బంధువులు. అమ్మ ఉన్న పూరి ఇంట్లో ఉన్నట్టుండి అద్భుతవాసనలు వస్తుంటే 'దేవతా సర్పాలు తిరుగుతుంటే అలాంటి వాసనలు వస్తాయట" అని గ్రామస్తులు అనుకున్నారు. హైమకు ఒకసారి అలాంటి వాసనలు అనుభవం కలిగింది. అమ్మ తన పూరియింట వెనుక రోటివద్ద ఏదో పనిచేసుకొంటూ కూర్చున్నది. వింత వాసనలను గురించి అంతా చెప్పుకొంటున్న రోజులవి. అమ్మా ! నాకు కూడా ఏదైనా వాసన చేసిపెట్టవూ! అని హైమ అడిగింది. హైమకు అప్పటికి పదేళ్ళు కూడా ఉండి ఉండవు. అమ్మ హైమవంక చూసి నవ్వి తనపని తను చేసుకొంటూనే

రుబ్బురోలును చేతితో అవతలకి తోసి "దీనితో ఆడుకో" అన్నది. రుబ్బురోలు ఆరోజు నుంచి కొన్నిరోజులపాటు సువాసనలు వెదజల్లిందట. హైమ నాకు స్వయంగా చెప్పిన సంఘటన ఇది. ఇంకా ఇలాంటివి ఎన్నో ఆలయగర్భంలోకి హైమ తనతో తీసుకొని వెళ్ళింది. తను ఇప్పుడు "దేవత". అప్పటి లాగా మనతో మాట్లాడుతుందా !

హైమ "దేవత" కావడమేమిటి ? రవి (బ్రహ్మాండం రవీంద్రరావు) చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు రవిని, హైమని దగ్గర కూర్చున్న బెట్టుకొని నేను ఎన్నిసార్లు కబుర్లాడలేదు ? అలాంటి హైమను "దేవత" అని ఎలా అనుకోవడం? కాని, హైమ మనందరి మధ్య ఉన్నప్పుడు నా నోటితోనే "దేవత" అనే మాటను అమ్మ పలికించిన సందర్భమొకటి నాకు జ్ఞాపకం ఉంది.

అమ్మ ఆలయం పునాదుల వరకు మాత్రమే నిర్మాణం జరిగిన ఒకప్పటి మాట. అది వెన్నెలరాత్రి. వేసవిలో అని జ్ఞాపకం. సుమారు పదిగంటలవేళ. అమ్మ పునాదుల మధ్య మంచం మీద కూర్చుని ఉంది. నేనూ, మరెవరో ఒకరిద్దరు అమ్మ మంచం దగ్గర కూర్చుని ఉన్నాము. హైమమందిరం ఇప్పుడు ఉన్నచోటు అప్పుడు ఖాళీస్థలం. అటునుంచి హైమ నడిచి వస్తున్నది. హైమకు గజ్జెల పట్టాలు ఉండేవి. తెల్లని పరికిణీ, వోణీవేసుకొని, మృదువుగా నడిచి వస్తున్నట్లు కనిపిస్తే అప్రయత్నంగా నేను అమ్మతో అన్నాను "దేవతలు ఎలా ఉంటారో నాకు తెలియదు. ఇప్పుడు హైమను చూస్తే అలా ఉంటారేమో అనిపిస్తుంది" అని. అక్కడున్న సోదరులు "అవును" అన్నట్టు హైమపట్ల ఆప్యాయతతో తలలూపారు. హైమ దగ్గరకు వచ్చాక అమ్మ తనతో అన్నది. "అన్నయ్య నిన్ను దేవత అంటున్నాడు" అని. హైమ మా మధ్యనే కూర్చున్నది. మా సంభాషణలో గొంతు కలిపింది. అది ఏదో లోకాభిరామాయణం. సుడిగాలిలో సొక్కి సోలె .... నీ ఒడిలో వ్రాలి..." అని అప్పుడు తను "రాజు" పాటను పాడినట్లు జ్ఞాపకం.

అమ్మను మొదటిసారి చూసినప్పటికి నాకు దేవుడిలో గాని, మనుషుల దివ్యత్వంలో గాని విశ్వాసం లేదు. ఇప్పుడు ఉన్నదా అంటే ఏమని సమాధానం చెప్పాలో తెలియదు. ప్రసాదరాయకులపతి, మరి కొందరు మిత్రులతో కలసి

తొలిసారి అమ్మ దర్శనం చేసుకొన్నప్పుడు అమ్మను గురించి నాకు కుతూహలం మాత్రమే ఉండేది. ఎవరో కన్నబిడ్డలను ఆమె తన బిడ్డల వలెనే చూడటం ఆశ్చర్యం కలిగించింది. మన ఆలోచనలను మనం చెప్పకుండానే అమ్మ గ్రహించగలదన్నది నాకు మొదట కలిగిన అనుభవం. కాని, అలా తెలుసుకోవడానికి "దైవత్వం" అవసరం లేదు. మనుష్యులను అర్థం చేసుకొనే ప్రతిభ ఉంటే చాలు, అని నాకు నేను అప్పట్లో సమాధానం చెప్పుకున్నాను. "నాకు ఇలాంటి నమ్మకాలు లేవు" అని నిర్మొగమాటంగా అమ్మకు చెప్పినట్లు కూడా గుర్తు. "ప్రేమ, వాత్సల్యం, మనుష్యుల మధ్య అనుబంధాలు – ఇవన్నీ నీకు "ఇష్టమైనవే కదా!" అని కాబోలు అన్నది అమ్మ. అమ్మ మాట్లాడే తెలుగు చాలా బాగుంటుంది. అప్పటికి కొంతకాలంగా పత్రికలో పనిచేస్తున్న నాకు అమ్మ భాష ఎంతో అద్భుతంగా ఉందనిపించేది. అమ్మ మాట్లాడుతుంటే ఇంకా ఇంకా వినాలనిపించేది. అమ్మ చాలా తార్కికంగా, హేతుబద్ధంగా మాట్లాడేది కూడా. అలా మాట్లాడితే నాకు ఇష్టమని కూడా అమ్మ మొదటే గ్రహించినట్లుంది. గంటలు, రోజులు, వారాలు తనతో ఏకాంతంగా మాట్లాడే అవకాశాన్ని అమ్మ నాకు కలిగించింది. తాత్త్విక విషయాలలో నాకున్నది పరిమితజ్ఞానం. కాని, దానితోనే అమ్మతో మొగమాటం లేకుండా, సంకోచం లేకుండా మాట్లాడాను. నేను ఇంగ్లీషు పదాలు వాడితే అమ్మ అభ్యంతరం పెట్టలేదు. (నాకు ఇంగ్లీషు వచ్చునని కాదు, అమ్మ సరళమైన తెలుగులో సమాధానాలు చెప్పింది. అలా మాట్లాడగా, వినగా చాలా కాలానికి సమస్త విశ్వాన్ని నిండిన శక్తి ఏదో ఒకటి ఉన్నదనే అభిప్రాయం నాలో ఏర్పడి, బలపడింది. అది అమ్మ చలవ, అతీంద్రియ శక్తులు తనకు ఉన్నాయని అమ్మ ఎప్పుడూ చెప్పలేదు. "మీరు కానిది నేను ఏదీ కాను" అని పదే పదే స్పష్టం చేస్తుండేది. కాని ఒక మహనీయుడు అద్భుతశక్తులు ప్రదర్శించడం గురించి ప్రస్తావన వచ్చినప్పుడు నేను విమర్శిస్తే "నీకు సాధ్యం కానిది ఇతరులకు కూడా సాధ్యం కాదనుకోవడం సరికాదు" అనే అభిప్రాయాన్ని అమ్మ నాకు కలిగించింది. అద్భుతాలు అనిపించే సంఘటనలు జరిగినా వాటిని పట్టించుకోవటం మానేశాను. డాక్టర్ శ్రీ పాదగోపాలకృష్ణమూర్తిగారికి

తన అనుభవాలను బట్టి అమ్మ పట్ల గౌరవం, అభిమానం అమితంగా కలిగాయి. తరువాత అది విశ్వాసంగా స్థిరపడింది. "మీరు సైంటిస్టులు కదా, మీకు ఎలా నమ్మకం కలిగింది?" అని ఒకసారి ఆయనను ప్రశ్నించాను. "సైంటిస్టు తన అబ్జర్వేషన్లను బట్టే తార్కికంగా ఆలోచించి నిర్ణయాలకు వస్తాడు గదా! నేను అలాగే చేశాను" అన్నారాయన.

అమ్మతో సంభాషణలలో ఒకసారి "పురుషప్రయత్నం – విధి" ప్రసక్తి వచ్చింది. "మానవ ప్రయత్నంలో లోపం లేకపోతే కార్యసిద్ధి తప్పక కలుగుతుంది. మనిషే తనను తాను తీర్చిదిద్దుకొనగలడు. ఇందులో విధి ప్రమేయం లేదు" అని నా వాదన. మరైతే కొందరే ఎందుకు విజయం సాధిస్తారు ? కొందరు మంచి పనులు కొందరు చెడ్డపనులు ఎందుకు చేస్తారు ? అనే ప్రశ్నలు నా మనస్సులో ఒకమూల ఉన్నాయి. మనో విజ్ఞానశాస్త్రంలోని కొన్ని మౌలికాంశాలను గురించి, ముఖ్యంగా ఆలోచనలు కలిగే క్రమం గురించి కూడా నాకు ప్రశ్నలు ఉన్నాయి. ఏదైనా ఒక ఆలోచన మనస్సులో మెదలినదంటే దానికి కారణమైన పరిస్థితులు ఏవో ఉంటాయని అనుకునేవాణ్ణి. "నీ ఆలోచనలను నీవే గమనించు. నీవున్న పరిస్థితులతో ఏవిధంగా సంబంధంలేని, నిమిత్తం లేని ఆలోచనలు వస్తాయో రావో చూడు" అని అమ్మ సలహా ఇచ్చింది. చాలాకాలం అదే ప్రయత్నం చేశాను. అమ్మ అటు తరువాత నా ఆలోచన కోసం ఒక ప్రశ్న వేశారు. "ఆలోచనలు ఎక్కడి నుండి వస్తున్నాయి ? వాటి వెనుక ప్రేరణ ఏది ? తెలుసుకొనగలిగావా?" పురుషకారం, విధి మొదలైన అనేక విషయాలకు సంబంధించిన నా ప్రశ్నలకు సమాధానం దొరికినట్లయింది. ఏ విధమైన కారణం గాని, ప్రేరణగాని లేకుండా కొన్ని ఆలోచనలు వస్తాయని నాకు అనుభవమైంది. సమస్తమూ, అక్షరాలా సమస్తమూ, మంచీ, చెడూ, ఈ రెండు కానిదీ కూడా విధి నిర్ణయం ప్రకారమే జరుగుతుందనీ, అంటే సమస్తమూ విధేనని అమ్మ చెప్పింది. నేను అమ్మతో వాదించలేదు. అమ్మ చెప్పినది యదార్థమే అనిపించింది. కాని, అదెలా అని కూడా అప్పుడప్పుడు అనిపిస్తుంది. పోతన అంతటి వాడికి 'కలడు, కలండనెడు వాడు కలడో లేడో?' అనిపించలేదా ? అంతే ! సడలే విశ్వాసాలను

ఎప్పటికప్పుడు గట్టి పరచుకోవడమే ఎవరైనా చేయవలసింది.

లోకంలో ధృడమైన విశ్వాసాలు కలిగిన వారు అనుభవించే హాయిని, తృప్తిని ఇతరులు అనుభవించలేరు. కనుక ఏదో ఒక విశ్వాసం ఉండవలసిందే. క్రైస్తవులైనా, మహమ్మదీయులైనా, బౌద్ధమతస్థులైనా, వైదిక మతస్థులైనా విశ్వాసాన్ని బలంగా ఉంచుకోవడం తమకే శ్రేయస్కరం.

ఇంతకూ విశ్వాసాలు అంటే ఏమిటి ? అందులో మంచివి, చెడ్డవి ఉంటాయి, మూఢమైనవి, కానివి అంటూ విభజించవచ్చునా ? ఇవన్నీ కొన్నాళ్ళకు నాలో కలిగిన ఆలోచనలు, మనస్సులో మెదలిన ప్రశ్నలు.

విశ్వాసాలు వేరు, మూఢవిశ్వాసాలు వేరు. ఇతరులకు గాని, తనకు గాని హాని కలిగించేది మూఢవిశ్వాసం. సమాజానికి చెరుపు చేసేది మూఢవిశ్వావం. మనిషికీ, సమాజానికి ఏదో ఒక విధంగా మేలు చేసేది విశ్వాసం అనిపించింది.

దైవంపట్ల, దైవశక్తి పట్ల ప్రేమ కరుణ కలిగి సమాజశ్రేయస్సును త్రికరణశుద్ధిగా కోరే, ప్రబోధించే ఆధ్యాత్మిక బోధనల పట్ల విశ్వాసం ఉండవలసిందే. విశ్వాసాన్ని పెంపొందించే ప్రయత్నంలో ఉన్న సాధకుల పట్ల సైతం సదవగాహన, సానుభూతి ఉండవలసిందే.

అమ్మ మహిమాన్విత - మహోన్నత మానవీయ

అమ్మ అపార కరుణామయి. ప్రేమస్వరూపిణి. కీర్తిశేషుడు బ్రహ్మాండం సుబ్బారావు అన్నట్లు అమ్మ "మమతల గర్భగుడి". ప్రేమ, వాత్సల్యాలు మాటలలో గాక, బాల్యం నుంచి సిద్ధిపొందేవరకు అమ్మ చేతలలో వ్యక్తమవుతూనే ఉన్నాయి.

అమ్మ ఎక్కడ ఏమి జరుగుతున్నదో తను తలచుకొంటే చూడగలదు. సుదూర ప్రాంతాలలో మనం మాట్లాడుకొన్న మాటల్ని వినగలదు.

అమ్మకు భూత, భవిష్యత్, వర్తమానాలనే తేడాలు లేవు. అన్నీకాలాలూ ఆమెకు వర్తమానమే. ఇవన్నీ ఒక క్రమపరిణామంలో నాకు కలిగిన భావనలు.

అందరింటి అన్నపూర్ణాలయం నిర్వహణ కోసం తన నగలను మరో ఆలోచన లేకుండా తీసి ఇచ్చిన అమ్మ. తను కావాలనుకొంటే, సంభారాలను

వెతుక్కుంటూ వచ్చేలా చేయగలదు. పదార్థాలను సృష్టించనూ గలదు. ఇది ఎందరికో అనుభవం.

ఏ మందులూ లేకుండా కొందరికి వ్యాధి నయం చేసిన సంఘటనలూ, అకాలమరణం నుంచి కొందరిని కాపాడిన సంఘటనలూ ఉన్నాయి. మరణాన్ని కొద్దికాలం తప్పించిన ఉదంతాలు కూడా ఉన్నాయి. (కాని, కడుపున పుట్టిన బిడ్డల మరణాన్ని, భర్తమరణాన్ని అమ్మ నివారించలేదు. తాను సిద్ధిపొందడాన్ని వాయిదా వేసుకొనను కూడా లేదు.)

నాకు సైతం సొంత అనుభవాలు కొన్ని ఉన్నాయి. హైదరాబాద్ పర్యటన సమయంలో అమ్మ కొన్ని పేదలవాడలను దర్శించింది. ఎక్కడకు వెళ్ళినా పులిహోర లాంటి పదార్థాలను వెంట తీసుకొని వెళ్ళి పంచే ఏర్పాట్లను చేసింది. ఒక చోట నేను పులిహోరపంచుతున్నాను. గరిటెతో వడ్డన చేస్తున్నాను. చిన్న దొప్పలలో ప్రసాదం అందిస్తున్నాను. పదార్థం యాభైకంటె ఎక్కువమందికి సరిపోదనిపించింది. అక్కడ జనం రెండువందల మందికి పైనే ఉంటారు. సరిపోకపోతే ఎలాగని మనస్సులో ఒకింత ఆందోళన కలిగింది. ఇంతలో అమ్మ నన్ను పిలిచింది. "పులిహోర ఎంతెంత పెడుతున్నావు నాన్నా" అని అడిగింది. నేను గరిట చూపించి "దీనితో రెండు మూడు గరిటెలు" అనికాబోలు చెప్పాను. సరిగా గుర్తులేదు. పరిస్థితి అర్థం చేసుకొని అమ్మ అందరికీ సర్దిపెట్టమని చెబుతుందనుకొన్నాను. కాని, అమ్మ "అదేమి సరిపోతుంది, బాగా పెట్టు" అన్నారు. నేను తిరిగి వెళ్ళి ఏమవుతుందో చూద్దామని పట్టుదలగా అంతకు ముందు పెట్టిన దానికంటె రెండింతలు, మూడింతలు ఎక్కువ పెట్టాను. చిన్నవాళ్ళకైతే అది భోజన సమానం అనుకొన్నాను. ఎంతమందికి పెట్టానో గుర్తులేదు, నేను అలసిపోయాక మరొక సోదరుడు అందుకొని పెట్టాడు. పులిహోర గంగాళంలో తగ్గుతున్నట్లే ఉందిగాని, పూర్తిగా అయిపోవడం లేదు. మేము పేదలవాడ నుంచి తిరిగి వెళ్ళేటప్పటికి ఇంకా అందులో కనీసం పదిహేను మందికి సరిపడే పదార్థం ఉంది. ఇది నా కళ్ళెదుటే జరిగిన సంఘటన. ఇది మహత్తు అనుకోవడానికి మనస్సు అంగీకరించలేదు. కానీ, వాస్తవంగా జరిగింది. ఉన్నపదార్థాన్ని గురించి నా అంచనా తప్పేమో లెమ్మనుకొన్నాను.

తరువాత అమ్మ అడిగింది. "నాన్నా ! పులిహోర సరిపోయిందా, ఇంకా మిగుల్చుకొచ్చినట్లున్నావే!" అని. తరువాత సోదరులు చెప్పారు తమకు ఇలాంటి సంఘటనలు చాలా జరిగాయని. "పదార్థాన్ని ఇలా సృష్టించగలిగే మహనీయుల లోకంలో ఆకలి బాధలు లేకుండా ఎందుకు చేయరు?" అనే ప్రశ్న అప్పటికి ఇప్పటికి నా మనస్సులో నుంచి తొలిగిపోలేదు. అనుభవాలను అసత్యమని అనుకొననూలేను.

దైవంలో గాని, మహనీయులలో గాని విశ్వాసం బలంగా ఉంటే, మనిషికి మేలు చేస్తుందని నా జీవితానుభవం నాకు బోధించింది. పవిత్ర మతగ్రంథాల పఠనం, మహనీయుల చరిత్ర పఠనం విశ్వాసాన్ని బలపరుస్తుంది. మనస్సుకు హాయిని కలిగిస్తుంది. జీవితంలో కష్టాలను తట్టుకొనే మానసికధైర్యం స్థైర్యం ఏర్పడతాయి. ఫలసిద్ధి అందరికీ ఒకే విధంగా ఉండకపోవచ్చు. అందరి విశ్వాసాలు ఒకేస్థాయిలో ఉండవు మరి.

మహత్తులతో సంబంధం లేకుండా, కేవలం ప్రేమ, వాత్సల్యం మమతలాంటి అత్యున్నత మానవీయ విలువల ఆధారంగా మహనీయుల పట్ల అభిమానాన్ని, గౌరవాన్ని, విశ్వాసాన్ని పెంపొందించుకొనగలిగితే మంచిదే. అలాగాక, మహత్తుల వల్లనే సాధారణ వ్యక్తులు మహనీయులవుతారనే భావం ఉంటే అప్పుడు ఈ అనుభవాలు తప్పకవిశ్వాసం ఏర్పరచుకోవడానికి, బలపరచుకోవడానికి దోహదం చేస్తాయి.

నా మటుకు నాకు అమ్మ మహిమాన్విత అనే విశ్వాసం చాలా కాలానికి కలిగింది. కాని మహత్తులను మించి అమ్మ యొక్క మహోన్నత మానవీయ లక్షణాలకే నేను ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తాను. నాటివల్లనే నాకు అమ్మ ఆరాధ్య అయింది. అమ్మ అంటుండేది - "మీరు నాలో మానవత్వాన్ని చూస్తారు, నేను మీలో దైవత్వాన్ని చూస్తాను" అని మనలో దైవత్వం ఏమిటి ? అమ్మ "సృష్టేదైవం" అన్నది. మనం సృష్టిలో భాగమే కదా !



అనుభవం లేకపోతే మహావాక్యాలు మన వాక్యాలే

వేదాంత గ్రంథాలు అందించిన మహావాక్యాలు - **అహం బ్రహ్మాస్మి, ప్రజ్ఞానం బ్రహ్మ, తత్త్వమసి, అయమాత్మాబ్రహ్మ** - తత్త్వశాస్త్ర జిజ్ఞాస కలిగిన వారందరికీ తెలిసినవే. వాటిపై అనేకానకే వ్యాఖ్యానాలు, వివరణ గ్రంథాలూ వెలువడ్డాయి. మహావాక్యాలు తెలుగులో కూడా ఉంటాయా ? ఉంటాయని ఖండితంగా ప్రకటించి, తద్వారా అమ్మ మాటలను శాస్త్రపరంగా వివరించడానికి ప్రయత్నించినవారు అనేకులున్నారు.

పతంజలి యోగసూత్రాలు, వేదాంత పంచదశి, భగవద్గీత, ఉపనిషత్తులు, శ్రీమద్భాగవతాది పురాణ గ్రంథాలు, కావ్యకంఠ వాసిష్టగణపతిముని రచనలు ఇంకా ఎన్నో గ్రంథాలు చదివిన డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి గారు, వీరమాచనేని ప్రసాదరావుగారు, రాయప్రోలు భద్రాద్రి రామశాస్త్రిగారు, డాక్టర్ పన్నాల రాధాకృష్ణ శర్మగారు, కృష్ణభిక్షుగారు, బి.యల్. సత్యానారాయణశాస్త్రిగారు మొదలైన మేధావులు, విద్వాంసులు అమ్మ నోటివెంట వెలువడిన అద్భుతవాక్యాలకు తమదైన పద్ధతిలో వ్యాఖ్యానాలు పలికారు. (కృష్ణభిక్షుగారు రమణమహర్షి అంతేవాసి, అరుణాచల స్వామి వద్ద చాలా కాలం ఉన్నవారు)

వేదాంత గ్రంథాలు చెప్పినవి నాలుగు మహావాక్యాలైతే అమ్మ వాటన్నింటి సారాన్ని ఒకే వాక్యంలో చెప్పింది. **"నేను నేనైన నేను"** అని.

సంస్కృతసాహిత్యంలో, ప్రత్యేకించి వైదికసాహిత్యంలో సూత్రీకరణ ఒక మహాద్భుత ప్రక్రియ. అవి బ్రహ్మసూత్రాలు కావచ్చు. పాతంజల యోగసూత్రాలు కావచ్చు. తరచి చూచిన కొలది వాటిలో కొత్త అర్థాలు స్ఫురిస్తాయి. కొత్త ఆలోచనలు కలిగిస్తాయి. మహావాక్యాలు సూత్రాలకంటె ఘనమైనవి.

అమ్మ ప్రసంగవశాత్తు పలికిన కొన్ని లఘువాక్యాలను ఆ రోజుల్లో అమ్మ దగ్గరికి వస్తూ ఉండిన కొందరు సోదరులు మహావాక్యాలు అనేవారు. ఉదాహరణకు అమ్మ చెప్పిన "ఇష్టం లేనిది కష్టం", "ధ్యాసే ధ్యానం", "తృప్తే

ముక్తి" "ముముక్షుత్వమే మోక్షం" "అనుకున్నది జరగదు, తనకున్నది తప్పదు" - ఇవన్నీ ఒక విధంగా నిర్వచనాలు, మరొక విధంగా సూత్రాలు కూడా. త్రవ్విన కొద్దీ భావం వ్యక్తమవుతుంది.

"నాకేమీ తెలియదు", "మీరు కానిది నేనేమీ కాను", నేను మీలో దైవత్వాన్ని చూస్తున్నాను", "నా సాధన పిల్లల్ని కనడమే" - ఇలాంటి మాటలు చెప్పే అమ్మలో ఆకర్షణ ఏమిటి ? చదువు కొన్నవాళ్ళూ చదువులేని వాళ్లూ కుల, వర్ణ, వర్గ భేదం లేకుండా ఎందుకు ఆమెను చూడటానికి వెళుతున్నారు ? ఎందుకంటే ఎవరి అనుభవాలు వారికి ఉన్నాయి గనుక. అనుభవాలు విశ్వాసానికి పునాదులైనాయి. అనుభవాలంటే అద్భుతాలా (మిరకిల్సా) ? కావచ్చు. కాకపోవచ్చు. అమ్మ మిరకిల్స్ చేస్తుందా ? ఆమె మిరకిల్స్ చేశాననిగాని, చేస్తానని గాని చెప్పలేదు. మిరకిల్స్ గురించి అమ్మ ఇలా అన్నా రొకసారి. "మిరకిల్, మిరకిల్ అంటారు. మిరకిల్ ఏమిటి ? ఈ కనిపిస్తున్న దంతా మిరకిల్ కాదూ ? ఇంతకంటే మిరకిలేమి కావాలి ?"

మహాత్యాలు ఉన్నాయా లేవా అనే విషయంలో అమ్మ ఎవరికి కావలసిన పద్ధతిలో వారు అర్థం చేసుకొనే సమాధానం చెప్పింది. ఒకానొక సందర్భంలో "నీకు సాధ్యంకానిది ఇతరులకుకూడా సాధ్యంకాదని ఎందుకు అనుకొంటున్నావు?" అని ప్రశ్నించింది. "మహాతత్త్వానికి మహాత్యాలతో పనిలేదు" అని ఇంకొక సందర్భంలో అన్నది.

ఇలా ఎటూ తెగని సమాధానాలు చెబితే ఎలా ? అని ఎవరిమనస్సులో నయినా ప్రశ్న తలెత్తవచ్చు. అందుకు కూడా అమ్మ చెప్పిన సమాధానం ఉంది. "నా సమాధానాలు వాళ్ళ వాళ్ళ స్థితికి తగినట్లుగా ఉంటాయి. అడిగే విధానంలోనే పరిస్థితి తెలుస్తుంది. దానికి తగినట్లే సమాధానం...."

"అవినాభావసంబంధం" అనే అభివ్యక్తిని చాలామందిమి చాలా సందర్భాలలో విని ఉంటాము. అది కూడా ఒక గొప్ప సూత్రమే. అమ్మ "అవి నా భావ సంబంధం" అన్నారు.

వ్యక్తులకు వ్యక్తి సంబంధమైతే దైవానికి దైవ సంబంధం ! "అవి - నా - భావ సంబంధం" అర్థం కావడానికి అమ్మ చేసి చూపించిన ఒక ప్రయోగాన్ని

ఇక్కడ జ్ఞాపకం చేసుకొందాము. (1970 డిసెంబరు, "మాతృశ్రీ" సంచిక 26వ పేజీలో ఈ సంఘటన సమాచారం ఉంది.)

"వసుంధర చాలా ఆదుర్దాగా బీరువాలు, అలమరలు గాలించేస్తోంది. అయినా అమ్మ ఉంగరం కనిపించలేదు. ఒకటికి రెండుసార్లు అమ్మ దగ్గరికి వెళ్ళి ఆ వస్తువును దొరికేట్టు చేయమని బ్రతిమలాడింది. అమ్మ తన పాదాన్ని ముందుకు జాపారు - వసుంధర అదేమీ గమనించకుండా మళ్ళీ వెళ్ళి వెతకసాగింది. అమ్మ కాలి వ్రేలికే వున్న వస్తువు మరెక్కడో ఎందుకు దొరుకుతుంది ? మూడోసారి తన దగ్గరకు బిక్కముఖం పెట్టుకొని వచ్చిన వసుంధరను చూచి అమ్మ నవ్వుతూ - "అట్లా ఉంటుంది వసుంధరా ! అవినాభావ సంబంధం అంటే ఇదే. నేను చూపించినా నీ భావాన్ని బట్టి నీకు కనిపించలేదు. ఏదైనా మన భావాన్ననుసరించే... దానికి కారణాలు మన భావాలే."

అవినాభావసంబంధానికి అమ్మ వేసిన తాత్త్విక వివరణ చూడండి.

"రజ్జువును సర్పంగా చూచింది నా భావం, భయపడ్డది నా భావం, దీపం తెచ్చింది నా భావం, మళ్లీ ఇది తాడు కదా అనుకొన్నది నా భావం, సర్వం నా భావం, అంటే అంతా అభావంలోనిదే. అ భావమే భావానికి ఆధారమయింది. భావాభావ సహితమే యీ ప్రభావమంతా. దీనికి రహితం లేదు. అంతా సహితమే. అందుకే అవినాభావ సంబంధమంటే - అవి అంటే కనబడేవి. నా భావం అంటే కనబడే వాటిని ఊహించేది. ఊహనుబట్టి సంబంధం. ఏదయినా చూసేదాన్ని బట్టి కనబడుతుంది."

అమ్మ మాటల్లోని మాధుర్యాన్నేగాక అంతరార్థాలను కూడా అనుభవించకలిగిన అదృష్ట శాలులెందరో !

బ్రహ్మసూత్రాలపై చాలా భాష్యాలు వెలువడ్డాయి. నాకు తెలసినంత వరకు మొత్తం 555 బ్రహ్మసూత్రాలు ఉన్నాయి. కాని అమ్మ బోధనలన్నింటి సారాంశాన్ని ఒకే సూత్రం "నేను నేనైన నేను" వైదిక వాఙ్మయంలోని మహావాక్యాల, బ్రహ్మసూత్రాల సరసన నిలచే అమ్మ సూత్రం. ఈ మన అనుభవాలన్నీ అమ్మ మాటలను అర్థం చేసుకోవటానికి ఉపకరించేవే. అమ్మ మాటల్లోనే చెప్పాలంటే "అనుభవం లేకపోతే మహావాక్యాలు మన వాక్యాలే!.

తెలియటమే కాని తెలుసుకోవటం కాదు !

తెలియబడటమే గాని తెలుసుకోవడమన్నది లేదన్నది అమ్మ. ఎవరు అమ్మ అంటే ? మీకూ నాకు అమ్మ. ఆమె మన జిల్లెళ్ళమూడి అమ్మ. అందరి అమ్మ. తెలియబడటం కోసం ఒక మాధ్యమం, ఒక సాధనం అవసరం. తెలియబడవలసింది బ్రహ్మజ్ఞానం. మనం 'అమ్మ' జ్ఞానం అనుకొందాం. అమ్మే మాధ్యమం. ఆమె పలికిన ప్రతి పలుకు ప్రతి సూక్తి సాధనం. సూక్తి అంటే ? తాను నడిచి చెప్పినది సూక్తి అన్నది అమ్మ. జీవితమనే నడకలో ఈ పుడమితల్లిపై ఆ తల్లి వేసిన ప్రతి అడుగు ఒక సూక్తిని అందించింది. అనుభవం శాస్త్రాన్నిస్తుంది గాని, శాస్త్రం అనుభవాన్నివ్వదన్నది అమ్మ. ఆమె జీవితం అనుభవాల గని, బహుశాస్త్ర సంహిత, జ్ఞానసంపద. అందులో నుండి ఎన్నో సూక్తులు ఉద్భవించినాయి. మనతల్లి సూక్తుల కల్పవల్లి.

'అందరికీ సుగతే' అని అభయమిచ్చిన అవతారమూర్తులు, మహనీయులు మరెవరైనా ఉన్నారా? అమ్మగాక. తల్లికి తప్పే కనిపించదన్న కారుణ్యమూర్తి ఇంకెవరైనా ఉన్నారా ? మన అమ్మగాక.

జీవించి ఉన్నప్పుడు ఉపయోగపడే బ్రహ్మజ్ఞానమే బ్రహ్మజ్ఞానం. ప్రస్తావనవశాత్తు అమ్మ పలికిన ప్రతి సూక్తి బ్రహ్మజ్ఞానాన్ని ప్రసాదిస్తున్నది. ప్రతిసూక్తి ఒక మహావాక్యం. అమ్మ సూక్తులు బ్రహ్మసూత్రాలు. తరచి తరచిన కొద్దీ అందులో నుంచి జ్ఞానామృతం ప్రవహిస్తున్నది. ఎవరిపాత్ర కొద్దీ వారెంత తోడుకున్నా తరగని మహార్ణవం ఆమె సూక్తి నిధి. ఆమె సూక్తి సుధార్ణవం. ఎంత తేలిక మాటల్లో ఎంత అర్థాన్ని నిక్షిప్తం చేసింది!

అమ్మ కవులకు కవి, రచయితలకు రచయిత. ప్రతిసూక్తి ఒక జ్ఞాన కణిక. ఒక దివ్యజ్యోతి, జీవితానంతరం గాక జీవితం ఉన్నపుడే అవి అక్కరకు వస్తాయి.

మీరూ ప్రయత్నించి చూడండి. ప్రతి ఒక్కరి జీవితంలోనూ తీపి అనుభవాలుంటాయి. చేదు అనుభవాలూ ఉంటాయి. నాలుగు వీధుల కూడలిలో నిలచి ఎటుపోవాలో పాలుపోక తికమక పడే సందర్భాలూ, సన్నివేశాలూ

ఎవరికైనా ఎదురవుతాయి. మీకూ అవి తటస్థపడవచ్చు. అప్పుడు మీరు అమ్మ ప్రవచించిన అమ్మ వెలిగించిన జ్ఞాన కణికలను స్పర్శించండి. మీకు కావలసిన సందర్భోచిత, సమయోచిత సందేశం అంది తీరుతుంది. తెలుసుకోబడటమే గాని తెలుసుకోవటమన్నది లేదని గదా అమ్మ అన్నది. తెలుసుకోబడటం అప్పుడు మీకు అనుభవమౌతుంది. ఏ జీవికైనా ఇంతకు మించిన ప్రయోజనం ఇంకేమైనా ఉంటుందా ? చెప్పండి.

అమ్మ చేసిన ప్రశాంత విప్లవ మహోద్యమం

మనిషికీ మనిషికీ మధ్య అంతరాల అగాధాలు పెరిగి, మనసుకు మనసుకు మధ్య అనంతమైన అడ్డుగోడలు వెలుస్తున్న ఇరవయ్యో శతాబ్దంలో సాక్షాత్తు దేవుడే దివినుండి భువికి దిగివస్తే ఏం చేస్తాడు? అవతారమెత్తితే ఏం సాధిస్తాడు ?

అంతరాల అగాధాలను అంతంచేసి అడ్డుగోడల అవరోధాలను తొలగిస్తాడు. అంతేగదా ! కాదంటారా? కాకపోతే ఆ దేవుడు దేవుడే కాదు. ఆ అవతారం అవతాతరమే కాదు. అంతేనంటారా ? అలా ఐతే అమ్మ చేస్తున్నదీ, సాధిస్తున్నదీ అక్షరాల అదే.

అమ్మ అవతారమూర్తి అనో సాక్షాత్తూ దైవమనో చెప్పడం నా అభిమతం కాదు. ఔనేమో నాకు తెలియదు. కాదనీ నేను అనడం లేదు. నూత్నయుగారంభ సూచకమైన శుభపరిణామ ప్రత్యూష మాతృశ్రీమందిరంలో (అందరింట్లో) దృగ్గోచరమౌతున్నది. ఆ ప్రత్యూష రోచిస్సులు అమ్మ నుండి ఆవిర్భవిస్తున్నాయి. అంతమటుకే నా భావన పరిమితం.

నాశం కాలస్వభావం. అది సృష్టివైశిష్ట్యమే కావచ్చు. సమాజం కుళ్ళి కృశిస్తే ఏ మహానుభావుడో మహాత్ముడో మరల జీవం పోసి లోకోద్ధరణ చేయడం సృష్టి పరిణామగాథ. అనంతకాల ప్రవాహంలో శుభాశుభ పరిణామాల ఆయుఃప్రమాణం అల్పాతి అల్పం. కాని అవి ఒకదాని వెంటమరొకటి వస్తూనే ఉంటాయి.

మరైతే ఇంతకీ ఇప్పుడు అమ్మ చేసినదేమిటి ? అందులో కొత్త ఏమిటి? వెనుక ఎప్పుడూ ఎవరూ సాధించని ఘనకార్యమేమిటి ? మహానుభావులెందరో

మానవాళిని సముద్ధరించలేదా ? మానవతను, మంచి తనాన్ని పెంపొందించలేదా? లేదని కాదని నేను అనడం లేదు. పురాణేతిహాసాల దృష్టితో చూస్తే మహర్షులు, యోగులు తమ తపస్సును, ఆధ్యాత్మిక శక్తిని అందుకోసం ధారపోశారు. ధర్మసంస్థాపనకు యుద్ధాలు జరిగాయి. భగవంతుడు స్వయంగా ఒకసారి కాదు, రెండుసార్లు కాదు పదిసార్లు అవతారాలను దాల్చాడు. ప్రవక్తలు వచ్చారు. పోయారు. చారిత్రకదృష్టితో చూస్తే సంస్కర్తలు సమాజోద్ధరణకు జీవితాలను అంకితం చేశారు. మహత్తర త్యాగాలు చేశారు.

మరి అమ్మ ఏమి చేశారన్న ప్రశ్నకు ఒక్క ముక్కలో సమాధానం చెప్పవలసి వస్తే ఆమె ఒక ప్రశాంత విప్లవోద్యమాన్ని నిర్మిస్తున్నారు. ఆమాటను ఆమె చెప్పటం లేదు. కాని చేస్తున్నారు. చేసి చూపిస్తున్నారు. ఆ మహోద్యమంలో అనేక శ్రేణులున్నాయి. అనేకానేక రంగాలున్నాయి. సవర్ణులు, అవర్ణులు, ధనికులు – పేదలు, పాలకులు – పాలితులు, ఆస్తికులు – నాస్తికులు, తిరిగి ఆస్తికులలో అనేక మతస్తులు, ప్రతిమతంలో అనేక కులాలు, ఇలా విభిన్న వర్గాల మధ్య వైషమ్యాలు, వైరుధ్యాలతో సమాజం ఛిన్నాభిన్నమైన స్థితిలో ఉన్నది. ఒక్క తెలుగునాట పరిస్థితినే పరిశీలిద్దాము. కులవ్యవస్థ వెర్రితలలు వేయడం ఇంచుమించు అందరికి అనుభవమైన విషయమే. ఒకానొక సంధర్భంలో ఒక కులానిది పై చేయి కావచ్చు. కాని అదే కులం వారు ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒక చోట, ఏదో ఒక సందర్భంలో ప్రతీకారానికి గురికాక తప్పడం లేదు. కారణాలు – ప్రేరణలు జోలికి మనం పోనవసరం లేదు. పోవద్దు. ఒక కులం పేరు చెపితేనే మరొక కులానికి అకారణ ద్వేషం కలిగేటంతగా సమాజం కుళ్ళిపోయిన పరిస్థితి మట్టుకు యధార్థం. కళ్ళకు కనబడి, అనుభవానికి వస్తున్న విషయం కనుక ఇది నిర్వివాదాంశం కూడా. కులాల పరిస్థితే ఇలా ఉన్నప్పుడు ఇతర తారతమ్యాల మాటేమిటి ? అవి చెప్పవలసిన పనిలేదు. విభిన్నజాతులు వర్గాల మధ్య నెలకొన్న విద్వేషాల దాకా పోనవసరం లేదు. ఏకగర్భసంజాతుల మధ్య కూడా ఎన్నో తగాదాలను చూస్తున్నాము. ఏకకుటుంబంలో ఎన్ని కలతలను కంటున్నాము ? ఎందుకిలా

మనిషికి మనిషి దూరమవుతున్నాడు ? మనసూ మనసూ ఎందుకు వికర్షించు కొంటున్నాయి ? దిగజారి దిగజారి తుదకు సమాజం ఏ దుర్గతికి వచ్చింది?

"మాతృశ్రీ జీవిత మహోదధి తరంగాల"లో అమ్మ జీవిత చరిత్రలోని ఘట్టాలను చదువుతుంటేనేమి జిల్లెళ్ళమూడిలోని మాతృశ్రీ మందిరం ఆవరణ చూస్తుంటేనేమి, సమాజానికి పట్టిన కుళ్ళును 'అమ్మ ఎంత చాకచక్యంగా క్షాళనం చేస్తున్నది !' అనిపిస్తున్నది. ఆవరణలో ఎవరిది ఏ కులమని అడగటం నేను వినలేదు. ఒకవేళ తెలిసినా పాటించడం నేను చూడలేదు. అగ్రకులజులుగా పరిగణించబడేవాడు, అన్యకులస్థులకు సేవచేసి ఆ సేవలో ఆనందం, సంతృప్తి పొందటం నాకు తెలుసు. కాలు కదల్చకుండా కారులో వచ్చిన ఒక ధనిక కుటుంబాన్ని ఎంతగా ఆదరించారో, ఆ కారును నడిపిన డ్రైవరును కూడా అమ్మ అంతగానే ఆదరించడం నేను చూశాను. అమ్మ ఆదరించడమనేకాదు, అక్కడ విధానమే అంత. పద్ధతే అది. అది ఒకరు చెప్పనవసరం లేదు. దానంతట అది జరుగుతుంది.

వందల కొలది జనం బందులు తీరి భోజనాలకు కూర్చుంటే కుల, మత, వర్గ భేదాలను గాని, అంతరాలు అంతస్తులను గాని పట్టించుకొనరు వడ్డిస్తున్నవారు ఎవరని సైతం ఆలోచించరు. మాతృశ్రీ మందిరాదరణ – అనుభవం పొందిన చాలమందిని చూశాక నాకు అనిపించినది – ఈ భావం జిల్లెళ్ళమూడిలో ఉండగా ఉండి, పొలిమేరలు దాటాక పోయేది కాదని, అంతరాంతరాలలో అది నాటుకపోతుంది. వినూత్నమైన సంస్కారం కలుగుతుంది. నిజమైన సోదరభావం పెంపొందుతుంది. జిల్లెళ్ళమూడిలో పరిచయమై మళ్ళీ మరెక్కడైనా కలుసుకున్న సోదరీ సోదరులను అడగండి. ఆత్మబంధువులను చూచిన ఆనందం కలిగిందని చెబుతారో లేదో చూడండి. ఆత్మబంధువులా ? అమ్మ బంధువులా ? రెండూ ఒకటి కాకపోతే గదా ఈ ప్రశ్న.

అక్కడికి వెళ్ళి వచ్చి వారందరూ మాతృశ్రీ ప్రేరితమైన మమతానురాగ బంధితులు. ఆమె సృజించిన వాత్సల్య స్రవంతి అందరి హృదయాలను ప్లావితం చేసి అంతర్లీనంగా ప్రవహిస్తున్నది. ఆమె వెలిగించిన ప్రేమజ్యోతులు అఖండదీపాలై దిశాంతరాలకు వెలుగులను విరజిమ్ముతున్నాయి.

మాతృశ్రీ మందిరం (అందరిల్లు) అమ్మ నిర్మించుకొన్న ఒక మహాప్రయోగ శాల. అక్కడ జరుగుతున్నవి ప్రాయోగిక సంస్కరణలు. ఒక్కొక్క ప్రయోగం ఫలించి ప్రశాంత విప్లవ మహోద్యంలోని ఒక్కొక్క రంగంలో విజయ దుందుభులు మ్రోగుతుండగా నవయుగారంభమౌతున్నది. మనసులలో మమతలు కలిగి, నుషులలో సమతలు వెలిగి వర్గాలు లేని స్వర్గం నిర్మాణ మౌతున్నది. 'వర్గాలు లేనిది స్వర్గం' అన్నది అమ్మమాట.

ప్రయోగ ఫలితాల వల్ల మానవాళి కంతటికీ మహోపయోగం జరగ గలదా ? నవసమాజం ప్రపంచపరీవ్యాప్తం కాగలదా ? ఏమో ! అదిమానవాళి అదృష్టం.

అమ్మ చేస్తున్న అద్భుతం

ఇది అమ్మను గురించి కాదు. మనతో చెప్పీ చెప్పకుండా అమ్మ చేస్తున్న ఒక పనిని గురించిన ముచ్చట.

చెప్పీ చెప్పకుండా అని ఎందుకు అంటున్నానంటే అమ్మ తను చేసే ప్రతి పనిని గురించి చెప్పదు మనలో చాలామంది వలెనే. చిత్రకారుడు బొమ్మ మొదలు పెట్టినప్పుడు కాన్వాసుపై గీచే గీతలూ, కుంచె విదిలింపులూ మనకు ఏమిటోగా కనిపిస్తాయి. బొమ్మ పూర్తయినప్పుడు చూస్తేనే దాని అందం మనకు సాక్షాత్కరిస్తుంది.

అప్పుడప్పుడు అమ్మ హరిదాసుగారిని, కృష్ణవేణమ్మగారిని జిల్లెళ్ళమూడిలోనే ఉండి పొమ్మన్నప్పుడు ఆ దంపతులకు జిల్లెళ్ళమూడిలో తామూ ఉండిపోతున్నట్టు మాత్రమే తెలుసును గాని, అక్కడ రానున్న పరిణామాలు వారి ఊహకు అంది ఉండవు. అమ్మ ఆ ఊళ్ళో గడపగడపకూ తిరిగి ఆలయ నిర్మాణానికీ, ఆర్తులను ఆదుకోవటానికి పిడికడేసి గింజలను సేకరించినపుడు ఆ గింజల నుంచి ఒక మహాసంస్థ ఉద్భవించబోతున్నదని గ్రామస్థులు అనుకొని ఉండరు.

యార్లగడ్డ భాస్కరరావుగారు గుల్లవేసి, పొలానికి నీరు తోడినప్పుడూ, అధరాపురపు శేషగిరిరావుగారు కోరి జిల్లెళ్ళమూడిలో ఒక పాక వేయించు

కొన్నప్పుడు, ఎందరో సోదరీ సోదరులు "అందరిల్లు" నిర్మాణానికి రాళ్ళను మోసినప్పుడూ, శేషయ్యగారు గాడిపొయ్యి మీద మొదటిసారి పెద్ద గుండిగలను ఎక్కించినప్పుడూ జిల్లెళ్ళమూడిలో ఒక విలక్షణమైన సమష్టి జీవన విధానం రూపొందుతున్నట్టు వారిలో ఒకరూ గమనించి ఉండరు.

ఇరవై, పాతికేళ్ళల్లో ఎంతమార్పు !

అందరిల్లు ఏర్పడిన తర్వాత జిల్లెళ్ళమూడి రూపమే మారిపోయింది. గ్రామస్వరూపమే కాదు అక్కడి జీవన విధానమే మారిపోతున్నది.

బాపట్ల - పెదనందిపాడు గతుకుల రోడ్డు కాస్తబాగుపడింది. నల్లమడగట్టున నాలుగడుగులు సాగి కాలువనుంచీ క్రమంగా ఎడమవుతున్న డొంకన ఓ క్రోసెడు దూరం నడిస్తే అమ్మ ఉన్న ఆ చిన్న గ్రామం దర్శనమిచ్చేది. మధ్యలో రెండు వరవ (కాలువ)లు పట్నంవాళ్ళను కాస్త భయపెడుతుండేవి. రెండు మూడు గంటలకు ఒక (బాపట్ల పెదనందిపాడు మధ్య) బస్సు తిరుగుతుండేది ఆరోజుల్లో. ఏడవమైలు రాయి దగ్గర దిగితే "జిల్లెళ్ళమూడి ఎటు?" అని అడగడానికైనా ఒక్కోసారి వెంటనే ఎవరూ కనిపించేవారు కారు.

ఇప్పుడు బస్సుల సంఖ్య పెరిగింది. బాపట్ల పెదనందిపాడు రోడ్డూ కాస్త బాగుపడింది. జిల్లెళ్ళమూడి గ్రామంలోకి నేరుగా కారులో వెళ్ళడానికి డొంకస్థానే తారు రోడ్డు ఏర్పడింది.

అందరిల్లు అంతస్తులు పెంచుకుంది. గ్రామానికి కుళాయి నీటిసౌకర్యం ఏర్పడింది. కాలేజీ ఉంది, కాన్వెంటూ ఉంది. ఫోను ఉంది. బ్యాంకు ఉంది.

మార్పు కొత్తవి ఏర్పడటంలోనే కాదు. ఉన్నవి లేకుండా పోవడంలోనూ ఉంది.

ఏళ్ళతరబడి ఓపికగా అమ్మకు చెరువు నుంచి పీపాలో నీళ్ళు తెచ్చిన ఎఱ్ఱ ఎద్దు లేదిప్పుడు. దాని పని అది చేసుకు వెళ్ళిపోయింది. అమ్మకు అదంటే తగని జాలి.

అమ్మను నమ్ముకొన్న కొందరు పుణ్యమూర్తులూ కాలంజేశారు. వాళ్ళ జ్ఞాపకాలే ఇప్పుడు మిగిలి ఉన్నాయి.

దేవతలు ఉంటే ఇలా ఉంటారు కాబోలు అనిపించే అమ్మ బిడ్డ హైమ మనందరి మధ్య తిరుగుతూ కనిపించదిప్పుడు.

అందరిని ఆప్యాయంగా పలకరించే నాన్నగారు ఆలయంలో ప్రతిష్ఠితులైనారు.

కాని, దేనికోసమూ ఏదీ ఆగలేదు. ఎవరికోసమూ ఏదీ వేచి ఉండలేదు.

అమ్మ సంకల్పించిన కొత్త సమాజనిర్మాణం మాత్రం సాగుతూనే ఉంది. పాతికేళ్ళనాడు అమ్మ ఉన్నదేదో వండి వచ్చినవాళ్ళందరికీ స్వహస్తాలతో వడ్డన చేసేది. అన్నార్తులు ఉన్న చోటికి అమ్మే వెళ్ళి అన్నం పెట్టిన సందర్భాలూ ఉన్నాయి.

ఎవడు ఏ బుద్ధితో వచ్చినా, ఎవడు అమ్మను ఏ దృష్టితో చూసినా, అమ్మ వాడి ఆకలినే చూసింది. వాడి పొట్ట నింపడానికి ప్రయత్నించింది. మంత్రాయి మాలతనం గాని, మరొకడి అగ్రకులత్వం గాని అమ్మకు అవరోధము కాలేదు, ఆకర్షణా కాలేదు. కుబేరుడికైనా, కుచేలుడికైనా అమ్మ అక్కడ చేసిన పని ఇంత తిండి పెట్టడం మాత్రమే, అన్నం పెట్టడమే అమ్మ ఫిలాసఫీ యేమో అనిపించేటంతగా అమ్మ అన్నం ప్రస్తావన చేస్తుంది. పూజచేస్తామన్న వారితోటి, శాస్త్రచర్చకు వచ్చే వారితోటి "ముందు అన్నం తినిరాండి నాన్నా' అంటుంది.

అందరిల్లు అమ్మ జన్మదిన స్వర్ణోత్సవం నాడు లక్షమందికి ఒకేసారి అన్నం పెట్టింది. రోజూ లక్షమంది అక్కడ భోజనం చేయడం లేకపోవచ్చు గాని, వందల, వేలసంఖ్యలో వచ్చే వారందరికి అక్కడ నిత్య సంతర్పణ జరుగుతూనే ఉంది. ఒకప్పుడు ఆవరణలోని ఇళ్ళల్లో వేర్వేరు పొయ్యిలు ఉండేవి. అవన్నీ క్రమంగా కనుమరుగు అయ్యాయి.

"అందరిల్లు" లోని వారందరికి ఒకటే గాడిపొయ్యి, ఉన్నదేదో అందరూ కలసి తినవలసిందే. ఉప్పో, పప్పో సమంగా అనుభవించవలసిందే.



గర్వభంగం

ఆరోజు రాత్రి అనసూయావ్రతం.

హైమాలయం వద్ద అప్పుడే సంధ్యావందనం ముగిసింది. మూడవ అంతస్తులో అమ్మ గది ముందు వరండాలో వ్రతానికి ఏర్పాట్లు జరిగాయి. ఒకటి రెండు రోజులు నుంచి ముసురుపట్టి, ఆ పూటగూడా అప్పుడప్పుడు సన్నని జల్లులు పడుతున్నాయి. అమ్మ ఆసీనురాలైన కుర్చీచుట్టూ పూజాద్రవ్యాల పళ్ళేరాలున్నాయి. వరండాలో దీపంచుట్టూ పురుగులు ముసురుతున్నాయి. వ్రతం చేసుకొంటున్న కుటుంబం అమ్మకు ఎదురుగా కూర్చుని ఉన్నారు. ఒక ప్రక్కన దీపారాధన సెమ్మె వద్ద కూర్చుని సోదరులు రామకృష్ణ వ్రతకలాపాన్ని నిర్వహిస్తున్నాడు.

అమ్మకు దగ్గరగా ఉండే అవకాశం కల్పించడం కోసం ఇచ్చిన విసనకర్ర అందుకొని అమ్మ కుర్చీకి మరొ ప్రక్క కూర్చున్నాను. అమ్మ మీద దీపపు పురుగులు వ్రాలకుండా విసిరేటందుకు.

వ్రతభాగమైన సహస్రనామపూజ మొదలైనది. కూర్చుని విసనకర్రతో నెమ్మదిగా విసురుతున్నాను.

సోదరులు రామకృష్ణ సహస్రనామాలు చదువుతుంటే ఇతర సోదరీ సోదరులు "ఓం, ఐం, క్లీం, హ్రీం, శ్రీం, ఓం" అని బీజాక్షరాల ఉచ్చారణ చేస్తున్నారు.

వరండాలో పైన దీపం చుట్టూ చేరిన చిన్న పురుగులు ఒకటి రెండు అమ్మ మీద పడినవి. విసనకర్రగాలి వాటిని ఆపలేకపోయింది. ఇలా లాభం లేదనుకొని లేచి నుంచుని విసరడం ప్రారంభించాను.

సహస్రనామపూజ సాగుతూనే ఉన్నది. వరండా వెలుపల సన్నగా చినుకులు పడుతున్నవి. పడమటిగాలి హోరున వీస్తున్నది.

మరికొన్ని పురుగులు, ఒకటి రెండు మిడతలు అమ్మ మీద వ్రాలనే వ్రాలాయి. హోరుగాలి గాని, విసనకర్రగాని వాటిని ఆపలేకపోయాయి.

ఇంకా ఎక్కువ బలంగా విసరితే గాని పురుగులు వ్రాలడం తగ్గదనుకొన్నాను.

ఒక వంక హోరున గాలివీస్తుంటే ఈ విసనకర్ర వ్యవహారేమమిటని అక్కడున్న వారెవరైనా అనుకొని పోతారేమోనని లోపల శంక పీడిస్తున్నది.

""ఓం, ఐం, క్లీం, హ్రీం, శ్రీం, ఓం" బీజాక్షరాలు వినిపిస్తూనే ఉన్నవి.

అమ్మ మీద మరికొన్ని మిడతలు పడ్డాయి. అందులో ఒకటి ఎడమచేతి వ్రేలిమీద వ్రాలింది. మరొకటి మెడమీద, ఇంకొకటి పమిటమీద, ఇంతలో మరొకటి తలపైన .... ఇలా వ్రాలుతున్నాయి.

ఎంతగట్టిగా విసురుతున్నా ఇలా వ్రాలుతున్నాయేమిటి? - అనుకొన్నాను.

ఒక చేత్తో విసరుతూ మరొకచేత్తో వంగి అమ్మపైని వ్రాలిన మిడతలను తీసి వేస్తున్నాను. నేను ఒక వంక తీసివేస్తుంటే అవి మరో వంక వ్రాలుతూనే ఉన్నాయి. విసనకర్రను గట్టిగా పట్టుకొని ఇంకా బలంగా విసురుతున్నాను.

పదార్థాలమీద కూడా పురుగులు వ్రాలడం లేదు గదా. అని ఆలోచన వచ్చింది. చూశాను. వాటిమీద కూడా వ్రాలాయి. అప్పటికి సహస్రనామాలు పూర్తయినవి.

టెంకాయకొట్టి, ఒక పళ్ళేరంలో పదార్థాలను నైవేద్యం పెట్టారు. వ్రతకలాపంలో కథా శ్రవణభాగంగా "మాతృశ్రీ జీవితహోదధిలో తరంగాల" నుంచి అధ్యాయాల పఠనం ప్రారంభమయింది.

పురుగులు వ్రాలడం ఇంకా ఎక్కువైనది.

అమ్మ మీద పురుగులను వ్రాలనివ్వరాదనే నా పట్టుదల గూడా ఎక్కువైనది. విసనకర్రను మధ్యన పట్టుకొని ఓపికకొద్దీ విసురుతున్నాను. అలా విసురుతున్న పద్ధతి నాకే బాగా అనిపించలేదు.. ఎవరైనా ఏమైనా అనుకొంటున్నారేమోనని నలుగురి వంకా చూశాను. అందరూ నేను విసనకర్ర పట్టుకున్న విధానాన్నే గమనిస్తున్నారేమో ననిపించింది. ఐనా పట్టుదల వదలక విసురుతునే ఉన్నాను. మరో ప్రక్కన వాన గాలి వీస్తునే ఉన్నది.

ఉన్నట్టుండి ఒక మిడత అమ్మ చేతిపై తటాలున వ్రాలింది. మాతృశ్రీ జీవితగాథను చదువుతున్న సోదరులు ఆ చప్పుడుకు తలెత్తి చూసి ఒక చేత్తో ఆ మిడతను తీసి వేశారు.

పురుగులు వ్రాలుతున్నా మిడతలు పడుతున్నా అమ్మ ఏమీ పట్టించుకోవడం లేదు. అలవోకగా ఒక్కసారి చూసి, పోనీలెమ్మను కొన్నట్టు ఊరుకున్నారు.

తన మీద పడుతున్న వాటిని లెక్కచేయక పోయినా అమ్మ మీద పడుతున్న మిడతలు పఠిత దృష్టిని పుస్తకం మీది నుంచి మళ్ళిస్తున్నాయి.

నాకు పట్టుదల మరీ ఎక్కువైంది. నా పట్టుదల కంటె ఎక్కువగా పురుగులు, మిడతలు సంఖ్య పెరిగిపోతున్నది. దీపం ఉన్న గోడంతా పురుగులతో నిండిపోయింది. దీపాన్ని పురుగులు మబ్బువలె కమ్మివేశాయి.

అమ్మ ఒకసారి తల పైకెత్తి వాటి వంక చూసి చిరునవ్వు నవ్వారు. నా వంక చూసి "డాక్టరు గారు వాటిని ఫోటో తీస్తారేమో కనుక్కోరా" అన్నారు.

ప్రచండంగా విసనకర్ర విసరడం కొంచెంసేపు ఆపి అక్కడే ఉన్న డాక్టరు గారి దగ్గరకు వెళ్ళి అమ్మచెప్పిన మాటలు చెప్పాను. డాక్టరు గారు అమ్మ దగ్గరకు వచ్చి మాట్లాడారు. అవన్నీ అమ్మ చుట్టూ చేరి ఉండగా తీయవచ్చుగాని, వట్టిగా వాటిని మటుకు ఫోటో తీయడం ఎందుకు అని భావించారు డాక్టరు గారు.

పురుగులు, మిడతల బాధ మరీ ఎక్కువైనది. పెద్ద లైటును తీసివేయించి, కొంచెం ఇబ్బంది అయినా సరేననుకొని, దీపారాధన వెలుగులో గ్రంథపఠనం కొనసాగించారు.

ఇప్పుడు పురుగులు, మిడతల దృష్టి దీపపు సెమ్మెపైన, దానివద్ద కూర్చుని పుస్తకం చదువుతున్న సోదరునిపైన పడింది.

పదులు, వందలు, వేలసంఖ్యలో ఎక్కడి నుంచో పురుగులు వస్తున్నాయి. అక్కడి కక్కడే అవి సృష్టి జరిగినవేమో అనిపించేటంతగా వాటి సంఖ్య పెరగిపోయింది. పదార్థాల పళ్ళెముల నిండా మిడతలు వ్రాలాయి. పఠిత పుస్తకం మీద, పంచె మీద, వొంటి మీద సందు లేకుండా పరచినట్లు మిడతలు వ్రాలాయి.

విసనకర్ర బలంగా ఓపికకొద్ది విసరురుతుండటం వల్ల చేతులు నొప్పి పుడుతున్నాయి.

పురుగులను ఆపడం ఇక మనతరం కాదనిపించింది.

అమ్మ వంక చూశాను. చిరునవ్వుతో అమ్మ అలవోకగా చూస్తున్నారు. సోదరులు దీక్షగా కథాపఠనం కొనసాగిస్తున్నారు.

లోలోపలైనా ఓటమిని ఒప్పుకున్నానని కాబోలు అమ్మ మరో సోదరుని, దగ్గరకు పిలిచి విసనకర్రను అతని కిమ్మని నన్ను ఆదేశించారు.

పురుగులను గురించి అంతా కొంచెం సేపు మాట్లాడుకొన్నారు గాని, అంతకు మించి వేరే ఇబ్బంది కలగకుండా వ్రతం ముగిసింది.

బుద్ధుడు .... క్రీస్తు .... అమ్మ

భూమి గుండ్రంగా ఉన్నదని జాగ్రఫీ పుస్తకంలో చదివినప్పుడు, రోదసి కారునలుపని విన్నప్పుడు వ్యోమమండలంలో ప్రతిఫలించే సూర్యకాంతి రంగురంగులుగా కనిపిస్తుందని శాస్త్రజ్ఞులు చెప్పినపుడు, గగారిన్‌గాని, టిటోవ్‌గాని, మరో అంతరిక్ష యాత్రికుడు గాని అట్టే ఆశ్చర్యపడి ఉండరు. రోదసినౌకలో మహావేగంతో భూమి చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నపుడు స్వయంగా చూడగలిగిన సృష్టి దృశ్యం వారిలో ప్రతి ఒక్కరికి మహాద్భుత మనిపించింది.

మరి తాజ్‌మహల్ గురించి విన్నప్పటి కంటె దాని సౌందర్యాన్ని కళ్లారా చూడగలిగినపుడు కలిగే ఆనందం అనంతం. అలాగే ఫలానావ్యక్తి చాలా గొప్పవాడనో, ఎంతోమంచివాడనో ఎవరైనా చెపుతున్నప్పుడు కలిగే భావం వేరు. అతడి ఘనతనో, సుగుణాలనో స్వయంగా తెలుసుకోగలిగినపుడు కలిగే అభిప్రాయం వేరు.

పది సంవత్సరాల క్రితం బుద్ధుడి జీవితచరిత్ర చదువుతున్నప్పుడు ప్రతిఘట్టంలో కరుణరసం కనిపించింది. ఆయన ఎంతటి శాంతిమూర్తిగా కనిపించేవారో ! ఎలా ఊహించడం ? గతాన్ని తెలుసుకోగలమేమోగాని దాన్ని చూడలేం. అందుకని ఇరవై అయిదు శతాబ్దాల దూరం కాలవాహినలో సాగిపోయిన బుద్ధుని పవిత్రమూర్తిని హృదయంలో చిత్రించుకోవడానికి ప్రయత్నించాను. అయితే అది అతి సులభంగా తోచలేదు. ఆయన చిత్తరువులు కాని ప్రతిమలు కాని నాకు ఉపకరించలేదు.

మరి కొన్నాళ్ళకు బైబిలు పాఠాలు చదువుకోవడం జరిగింది. క్రీస్తు సహనం సాటిలేనిది. తోటి మానవుల కోసం ఎట్టి కష్టనష్టాలను భరించాడు ! ఎంతటి బాధలను ఓదార్చాడు. ఆయనను చూడగలిగిన నాటి మానవులు ఎంత అదృష్టవంతులు! ఆయన ఆకృతిని మనస్సులో ప్రతిష్ఠించుకొందాం అనుకున్నాను. మరి అదీ కష్టసాధ్యమేననిపించింది.

జయదేవుని గీతగోవిందంలో, పోతన భాగవతంలో, మీరాబాయి గీతాలలో నిక్షిప్తమైన శ్రీకృష్ణుని ప్రేమతత్వాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. కాగా దాని ఫలితమూ అంతంత మాత్రమే.

కృష్ణుని గాని, బుద్ధుని గాని, క్రీస్తుని గాని తదేకంగా మనస్సులో నిలుపుకోలేకపోవడానికి నా అశక్తత, అజ్ఞానం కారణాలు కావచ్చు. అయితే కొమ్ములు తిరిగిన తత్త్వవేత్తలయినా ఆ మహనీయుల్ని పూర్తిగా అర్థం చేసుకోలేరని పెద్దలు అంటారు. అది నిజమే అయివుంటుంది. అలా కానప్పుడు ఇన్ని భగవద్గీతా వ్యాఖ్యానాలు దేనికి ? బైబిలుపై ఇన్ని కామెంటరీలు దేనికి ? బుద్ధుడు భగవానుడని నమ్మించడానికో, మరెందుకో ఇన్ని జాతక కథలు దేనికి ?

ఏమైతేనేమి, నేనుమటుకు ఆలోచనలు విరమించుకోలేదు. సంవత్సరాల తరబడి జిజ్ఞాసతో యోచించాను. మిత్రులతో చర్చించాను. ఉపన్యాసాలు విన్నాను. పుస్తకాలు చదివాను. ఆలోచనలు, చర్చలు, చదువులు, నన్నొకదరికి చేర్చలేదు గాని, కొన్నేళ్ళక్రితం జరిగిన ఒక సంఘటన వలన గమ్యం చేరడానికి 'ఇదిగో ఇదే నా త్రోవ' అని తెలుసుకోగలిగాను. 'అమ్మ'ను చూడటమే ఆ సంఘటన.

'అమ్మ' జిల్లెళ్ళమూడిలో ఉంటుందని, జిల్లెళ్ళమూడి గ్రామం బాపట్ల-పెదనందిపాడు మార్గంలో ఏడవమైలురాయి సమీపంలో ఉన్నదని, నే నిక్కడ వ్రాయడమంటే అది అక్షరాలా అమాయకత్వమే. ఎందుకంటే యిప్పుడు 'అమ్మ' ను గురించి విననివారు కాని జిల్లెళ్ళమూడి ఎక్కడ వున్నదో తెలియనివారు కాని ఇలా తెలుగులో చదివేవారిలో ఉండరంటే అది అతిశయోక్తి కాదు. అమ్మ అంటే 'జిల్లెళ్ళమూడి' 'అమ్మ' అనడం నాకిష్టం

లేదు. కారణం ఆమె జిల్లెళ్ళమూడికే కాదు. యావత్ ప్రపంచానికి, సకల జీవకోటికి 'అమ్మ'. మాటలలో చేతలలో ఆమె 'అమ్మ'. అమ్మను మరపించే 'అమ్మ' ! (సౌలభ్యం కోసం ఇంతవరకు 'అమ్మ' అనే పదానికి కొటేషన్లు వాడాను ఇక అవి అనవసరం.)

ఎట్టకేలకు నా అన్వేషణ ఫలించినట్లయింది. నేను ఆరాధించిన బుద్ధుడిని, కృష్ణుడిని, క్రీస్తుని అమ్మలో చూడగలిగాను.

అమ్మ కరుణామయిగా, ప్రేమమూర్తిగా, సహనరూపిణిగా, నాకు కనిపించింది. అప్రయత్నంగా అమ్మ అనుకున్నాను. అలా అనుకోవడానికి నాలో తార్కికదృష్టి అడ్డు చెప్పింది. అది సులభంగా తోసివేసే అభ్యంతరం కాదు. లొంగి పోయాను. లొంగిపోయి రోజుల తరబడి అమ్మను గూర్చి ఆలోచించసాగాను. అమ్మ ప్రవర్తనను చర్చించుకున్నాను. అమ్మను గురించి ఇతరులు కన్నవీ, విన్నవీ తెలుసుకున్నాను. క్రమంగా అమ్మ అమ్మేనన్న భావం బలపడింది.

నేను, ఇలా అంటున్నంత మాత్రాన నాకు అమ్మను గురించి చాలా తెలుసునని అర్థం చేసుకోరాదు. అమ్మను అమ్మ అనుకోవడానికి నాకు తెలిసిన "తక్కువ" సరిపోయింది అంతే.

పరిణతిచెందిన మానవత్వమే దైవత్వమని నా విశ్వాసం. ప్రేమ, వాత్సల్యంం కరుణ, సహనం... ఇవన్నీ మానవులకు అసాధ్యమైన వేవీకావు. మరి అందరిలో అవి ఉన్నాయా ? అని అడిగితే తప్పకుండా ఉన్నాయంటాను. అయితే అవి ఎక్కువ, తక్కువ పాళ్ళల్లో కావచ్చు. మానవత్వం పరిణతి చెందిన వ్యక్తిలో అవి మూర్తీభవించి ఉండవచ్చు. అటువంటి వ్యక్తికి దైవత్వాన్ని ఆపాదిస్తే అందులో వింత ఏమీ లేదు.

మానవత్వం మానవులకే పరిమితమా ? కాదట. జ్ఞానికి, అజ్ఞానికి తేడా యిక్కడేనట. అమ్మ అంటుంది.

పశువులలో, పక్షులలో, హానికరమైన ప్రాణులలో సయితం మానవత్వాన్ని చూడటమే గాక, అమ్మ వాటికే మానవత్వాన్ని చూపించింది కూడా. ఆ విధంగా జ్ఞానులకు జ్ఞాని కాగలిగింది అమ్మ.

అమ్మలో ప్రేమ, వాత్సల్యం, కరుణ, సహనం ఉన్నట్లు కనిపించడమే కాక అనిపించిందని కూడా ఇంతకు ముందు పేర్కొన్నాను. ఆ విధంగా ఎలా అనిపించింది? అది తెలుసుకోవడం ఎలా సాధ్యమైనది ? నిజం చెప్పాలంటే అమ్మ విశిష్టతను ఆమె ద్వారా కంటె, అవి ప్రతి ఫలించడానికి అస్కారమైన వ్యక్తుల నుంచి మరింత సులభంగా గ్రహించగలిగాను. బలమైన అభిప్రాయాలు ఏర్పరచుకోగలిగాను. అమ్మ అక్షరాలా అమ్మే. సృష్టి తనదిగా భావిస్తుంది. జీవులందరనూ తన బిడ్డలనుకుంటుంది. తృప్తిగా సాకాలనుకుంటుంది. కలహించుకో వద్దని హితవు చెపుతుంది. హింస ("సహించ లేనిది") చేయవద్దంటుంది. మతాలు కట్టుకోవద్దంటుంది. వర్గాలు పోవాలంటుంది. వసుధైక కుటుంబాన్ని ప్రబోధిస్తుంది. శుక్ల శోణితాల కులమే తన కులమని చాటి చెప్పి విశ్వమానవిగా భాసిస్తుంది. అశక్తులైన, అంగవికలురైన బిడ్డలపట్ల మాతృ సహజమైన పక్షపాతం చూపిస్తుంది. వ్యాధిపీడితులకు బాధాగ్రస్తులకు జరగవలసినవి జరగకపోతే అల్లాడుతుంది. ఆమె అమ్మగాక మరెవరు ?

అమ్మ నా దృష్టిలో హేతువాది కూడా, ప్రతివస్తువుని విమర్శాత్మకంగా పరిశీలిస్తుంది. ప్రతి విషయాన్ని తార్కికంగా యోచిస్తుంది. పరిశీలించి యోచించి తెలుసుకుంటుంది. తెలుసుకొని తిరుగు లేని నిర్ణయాలకు వస్తుంది. ప్రజల భాషలో, పండితులకు కూడా ఆశ్చర్యం కలిగేటట్లు, అక్షర రూపమిస్తుంది. అమ్మ మాట్లాడుతుంటే దేవతలు పలికినట్లుంటుంది. తెలుగులో ఇంతటి తీయదనం ఉన్నదా? అనిపిస్తుంది.

అమ్మ మాట్లాడుతున్నప్పుడు పదాలతో ఆడుకుంటున్నదా అనిపిస్తుంది. భాష ఆమె అదుపు ఆజ్ఞల్లో ఉంటుంది. పదాలతో ఆడి, భాషలో పండితులను సైతం పల్టీలు కొట్టించి అమ్మ ఆఖరకు సూత్రీకరించి పలికే సూక్తిలో ఆమె చెప్పదలచుకున్న భావం కొట్టవచ్చినట్టు పదిలంగా ప్రత్యక్షమవుతుంది.

ఆమె నిర్వచనాలు మరికొన్ని :

"వర్గ రాహిత్యమే స్వర్గం"

"ముముక్షుత్వమే మోక్షం"

"వైకల్యం లేనిదే కైవల్యం" ఇలా ఎన్నెన్నో,

అమ్మలో ఎంత ఆధ్యాత్మికత కన్పిస్తుందో, అంత భౌతికవాద ధోరణి కూడా ఉన్నది. మూఢాచారాలు మూఢనమ్మకాలు పెట్టుకోవద్దంటుంది. మనస్సే మంత్రమంటుంది. ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగమంటుంది.

అమ్మ అమ్మే గనుక ఆడుకుంటామంటే ఆడుకోమంటుంది. పాడుకుంటా మంటే పాడుకోమంటుంది. పూజ చేసుకుంటామంటే చేసుకోమంటుంది. నీవే దైవమని స్తోత్రం చేసి కోర్కెల మెమొరాండాన్ని ఏకరువు పెట్టినప్పుడు "అనుకునదల్లా జరగదు. తనుకున్నదేదీ తప్పదు" అని సమాధానం చెప్పి పంపిస్తుంది.

అమ్మను కొందరు రాజరాజేశ్వరి అంటారు. మరి కొందరు మేరీమాత అంటారు. మరికొందరు మరో ఆరాధ్యదైవమని పిలుస్తారు. అయితే మౌలికంగా ముందు అమ్మ అని విశ్వసిస్తారు. ఆపైన మరెన్ని పేర్లు పెట్టుకుంటే నేమి?

కృష్ణుడు లీలలు ప్రదర్శించాడని చదువుకున్నాం. బుద్ధుడు, జీసస్ కూడా మహిమలు చూపినట్లు మతగ్రంథాలు చెబుతున్నవి. అలాగే అమ్మను గురించి కూడా వింటున్నాం. అమ్మ మటుకు అమ్మ తనకేమీ తెలియదంటుంది. ఏమైనా ఎవరి అనుభవాలు వారివి.

అంతా 'నిర్ణయం' ప్రకారమే జరుగుతుంది

అమ్మ చెప్పినట్లు అంతా నిర్ణయింపబడ్డ ప్రకారమే జరుగుతున్నది అన్నది. గత 25 సంవత్సరాల అమ్మ దర్శనం వల్ల ఏర్పడ్డ నా విశ్వాసం. మొదట డాక్టర్ ప్రసాదరాయకులపతి, కృష్ణభిక్షు, మిన్నికంటి గురునాధశర్మ వంటి వారితో కలసి జిల్లెళ్ళమూడి వెళ్ళేవాడిని. మన ఊహకు అందని అద్భుత ప్రేమతత్వం తన ఒడిలోకి మనల్ని ఆకర్షించింది. అమ్మ మాటలు వింటున్న కొద్దీ మొదట ఇంతేనా అనిపించిన విషయాలు కాలం గడచిన కొద్దీ అమ్మో ! అందులో ఇంత అర్థమున్నదే అనిపించింది.

శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారితో గంటల కొద్దీ రోజుల కొద్దీ జరిగిన చర్చలలో అమ్మ మాటలలోని అనంత సత్యాలను ఆవిష్కరించుకొంటుంటే

ఆశ్చర్యం కలుగుతూ వచ్చింది. అమ్మ మాటలు, అమ్మచరిత్ర, అధ్యయనం చేసినకొద్దీ నేర్చుకోవలసింది ఎంతో ఉన్నది అనిపించింది.

ఎవరికి వారు అమ్మ సూక్తులు మననం చేసుకోవడం ఒక పద్ధతి. సోదరీ సోదరులతో చర్చించి విషయం అవగాహన చేసుకొని సత్యాన్ని ఆవిష్కరించుకోవడం మరొక పద్ధతి. ఎవరి ఆలోచన వారిదే, జిల్లెళ్ళమూడి సందర్శిస్తే కలిగే ఆనందం అనుభవైకవేద్యం, మనస్సులో వచ్చే భావాలన్నీ చెప్పుకోలేం. కానీ సాన్నిహిత్యం వల్ల అనుబంధం, త్యాగభావన పెరగటమే కాక ఒకరి అభిప్రాయాలొకరికి తెలిసే అవకాశం ఉన్నది. ఆ విధంగా అధ్యయన పరిషత్తులకు ఎంతో మేలు కలుగుతుంది. అమ్మ వద్దకు వచ్చే వేల లక్షలు కుటుంబాలు కలిస్తే ఒక కుటుంబం నా కళ్ళముందు మెదలుతున్నది. ఒకరికొకరు ఆనందాన్ని కష్టాలను పంచుకోవడం పరిష్కరించుకోవడం నిజంగా గొప్ప విషయం. ఈ ఉమ్మడి కుటుంబం నేను ఊహించనంత పెద్దదిగా పెరిగింది. గ్రామ, తాలూకా, జిల్లా, రాష్ట్ర, దేశ పరిధులు దాటి పెరిగింది.

తర్కానికి అందని అనుభవాలేవో మనల్ని అమ్మవద్దకు చేరుస్తాయి. కేవలం సంకల్పమే కాదు. అమ్మను దర్శించుకోవడానికి ఒక్కొక్కరికి ఒక్కొక్క అనుభవం ప్రేరణ. అమ్మ ప్రారంభించిన అన్ని కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరగడంలో మనందరి పాత్ర ఉన్నది. ఎవరి వల్ల ఎలాంటి సేవజరగాలో అది కూడా నిర్ణయమయ్యే ఉంటుందని నా విశ్వాసం.

ఎవరో కన్నబిడ్డను అమ్మ తనబిడ్డగా చూడటం నాలో ఎంత మార్పు తెచ్చింది. సంస్కారంతో కూడిన కృషి ఉంటే తప్పక అభివృద్ధి కలుగుతుంది. అభివృద్ధి అంటే వైయక్తిక వికాసం అందరింటి పునాదులు నిర్మాణం జరిగేటప్పుడు నేను కూడా కాయకష్టం ఎందుకు చేయకూడదు అనిపించి తట్టలు మోసాను. నా అలసట, శ్రమచూచిన ఒక చెల్లెలు (సింగుపాలెం జానకి) అన్నయ్యా ! మీ శరీరం దీనికి అలవాటుపడ్డది కాదు, మేమున్నాం ఈ పనికి అని తట్ట తను అందుకొన్నది. అలాంటి సంస్కారవంతుల ప్రేమమూర్తుల మధ్య నేనున్నందుకు గర్వించేవాడిని.

ఎవరి మార్గంలో వారు ఏదో చేయాలనుకుంటున్నారు, చేస్తున్నారు. వారు అనుకోని చేస్తున్నారా ? అనుకోవడం వారివంతైతే వారు అలాగే ఎందుగు చేద్దామనుకొన్నారు ? అంతా ఆమె సంకల్పం ప్రకారమే జరుగుతున్న దనిపిస్తున్నది. ఇది నాకు అనుభవం నుంచి జనించిన విశ్వాసం.

జరిగి తీరుతుంది !

అసాధారణమైనవి, అద్భుతాలనిపించేవీ అనేక సంఘటనలు అమ్మ సమక్షంలో జరుగుతుంటాయి. యాదృచ్ఛికం అనో, అతిశయోక్తి అనో హేతువాదులు వ్యాఖ్యానించవచ్చు. నమ్మడం, నమ్మకపోవడం వారి వారి ఇష్టాయిష్టలను బట్టి ఉంటుంది. నమ్మిన వాళ్ళు నమ్మవచ్చు – వద్దనుకుంటే అది వారి ఇష్టం. ఖచ్చితంగా చెప్పాలంటే అది గూడా వారి ఇష్టం కాదేమో అలా అనిపిస్తుంది. అంటే అమ్మ ఎవరినీ నమ్మించడానికి ప్రయత్నించినట్టు తోచదు. ఎవరి అభిప్రాయాలను ఖండించలేదు. తన వద్ద మహిమలను ఉన్నాయని ఎప్పుడూ చెప్పలేదు. నిజానికి అమ్మ కూడా హేతువాదే. "దయ్యం లేదనలు. మన మనస్సే దయ్యం. మనస్సే దైవం" అన్నది అమ్మ. మూఢవిశ్వాసాలను ఇంతకంటే గొప్పగా ఎవరైనా ఖండించే అవకాశం ఉన్నదా ?

అమ్మ దగ్గరకు లక్షలమంది మరి ఎందుకు వస్తున్నట్లు ? ఏమి ఆశిస్తున్నట్లు? అమ్మే ఇందుకు సమాధానం చెప్పింది. "ఏడుస్తూ అనుభవించేవాడు నవ్వుతూ అనుభవించేవాడి దగ్గరకు సలహాకు వస్తాడు" అని. అమ్మ కూడా సాంసారిక మైన కష్టాలెన్నింటినో అనుభవించింది. అమ్మవాటిని దాచుకోలేదు. అలా అనుభవించానని పదే పదే చెప్పింది.

అమ్మను దైవంగా భావించి చాలా మంది అమ్మ మందిరం వద్ద కొబ్బరి కాయలు కొడతారు. కాని అమ్మ మాత్రం సంవత్సరంలో ఒకే ఒకరోజు కొబ్బరికాయలు కొడుతుంది. అది మేనెల 5వ తేదీన. 1954లో అమ్మ ఆవరణలో దేవాలయానికి శంకుస్థాపన చేసింది. ఆ రోజున కొబ్బరికాయలు కొట్టడంమొదలు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం మే 5న అమ్మ కొబ్బరికాయలు కొట్టేవారు.

అమ్మ ఎప్పుడైనా ఏదైనా అంటే అది వ్యర్థంగా పోదు. ఎప్పటికైనా జరిగి తీరుతుందన్నది జిల్లెళ్ళమూడి వెళ్లి వచ్చేవారి అనుభవం - 1957లో అమ్మ చెప్పిన మాట 26 సంవత్సరాల తర్వాత కార్యరూపం ధరించింది. జిల్లెళ్ళమూడి వచ్చే దారిలో ఏడవ మైలురాయి దగ్గర సింహద్వార (ముఖద్వారం) నిర్మాణానికి సంబంధించిన ప్రస్తావన 1957లో అమ్మ చెప్పినప్పుడు డైరీలలో వ్రాశారు. చాలామంది మరచిపోయారు. కాని 1983లో సింహద్వార నిర్మాణం జరిగినప్పుడు డైరీలు వ్రాసినవారు - అది తెలిసిన వారు ఆశ్చర్యపోయారు. అమ్మది తోలు నోరు కాదు కదా తాలు మాట రావటానికి !"

అమ్మను దర్శించినపుడు ముఖ్యంగా మొదటిసారి చూచినప్పుడు చాలామందికి ఏడుపు వస్తుంది. ఆపుకుందామన్నా ఆగదు. అది అక్కడ సర్వసాధారణం. అలా ఎందుకు జరుగుతుంది. అమ్మే ఇందుకు సమాధానం చెప్పింది. పుట్టిన వెంటనే పసికందు ఎందుకు ఏడుస్తుంది ? ఇదీ అంతేనట. అమ్మను తొలిసారి దర్శించటం జన్మ ఎత్తడం లాంటి అనుభవమే!

ఏం చెప్పింది, ఏం చేసింది ?

ఆమెను మమతల గర్భగుడి అన్నారు. సమతల పెద్దబడి అన్నారు. కన్నతల్లిగా ప్రేమించారు. కల్పవల్లిగా ఆరాధించారు. వాత్సల్యరూపిణిగా భావించారు. వరదాయినిగా కొలిచారు.

ఆమెకు తల్లిదండ్రులు పెట్టిన పేరు అనసూయ. కానీ ఆమెను అలా పిలిచిన వారెవరూ తటస్థపడరు. అందరినీ తన బిడ్డలు అంటుంది. దేశవిదేశాలలో అలాంటివారు లక్షలమంది. అమ్మ ! అని పిలవడమే వారందరికీ ఇష్టం. అలా పిలిపించుకోవడం ఆమెకు ఇష్టం. గుంటూరుజిల్లా బాపట్ల తాలూకాలో జిల్లెళ్ళమూడి అనే కుగ్రామాన్ని ప్రసిద్ధక్షేత్రం కావించిన మహిత చరిత అమ్మ. "దైవం అంతటా వ్యాపించి ఉండటం కాదు. అంతా అయిఉన్నది" అని ఆమె చెప్పింది. జగత్తే దైవమని ఆమె భావించింది.

ఆమె సన్యాసిని కాదు. ఆమె సంసారాన్ని త్యజించలేదు. సంసారం వదిలి సాధన చేస్తామనడం నేలవిడిచి సాము చేయడం లాంటిదని ఆమె

అభిప్రాయం. "నేను అమ్మను – మీరు బిడ్డలు" అని పదే పదే ప్రకటించిన అమ్మ బిడ్డలను "కనడమే" (చూడడం) తన సాధన అన్నది. ఎక్కడ ఎవరిని చూచినా తన బిడ్డే అనిపించడం సన్యాసి లక్షణం కానేరదు.

తాను గురువును కానని కూడ స్పష్టం చేసింది. శిశువులేకాని తనకు శిష్యులు లేరని చెప్పింది. "గురువులేడని నే నెప్పుడూ అనలేదు. గురువే అక్కర లేదంటాను" అన్నారామె. "మనస్సే గురువని, పరిస్థితులే గురువు –బంధువు" అనీ ఆమె చెప్పారు.

ఇవేమీ కానప్పుడు ఆమెను చూడటానికి లక్షల మంది ఎందుకు వస్తున్నట్లు? ఆమెలోని అసాధారణ ప్రేమతత్వమే. ఆమెలోని అనుపమాన వాత్సల్యమే అసంఖ్యాక ప్రజలను ఆకర్షించాయి. మరొక తల్లి కన్నబిడ్డలను తన బిడ్డలుగా చూచుకోవడం అసాధారణమే కదా!

కుళ్ళువాసన కొడుతున్న కులతత్వానికీ, మతమౌఢ్యానికీ, వర్గవైషమ్యాలకూ అతీతంగా మనుషులు ఉమ్మడి కుటుంబం వలె కలసిమెలిస జీవించడం ఆమె జిల్లెళ్ళమూడిలో సాధించిన ఒక మహాద్భుతం. ఆమె నెలకొల్పిన సంస్థను ఆశ్రమం అనరు. "అందరిల్లు" అంటారు. అంతా కలసి భోజనం చేసే మందిరాన్ని "అన్నపూర్ణాలయం" అంటారు. ముదుసళ్ళకు వైద్య చికిత్సలాంటి సౌకర్యాలు చేకూర్చి ప్రేమగా పట్టెడన్నం పెట్టే చోటును "ఆదరణాలయం" అంటారు. అది అమ్మ పెట్టిన పేరు. "వృద్ధులకు కావలసింది ఆదరణ నాన్నా!" అన్నారు అమ్మ. అందరిల్లు ఖర్చును చూచి ఒకరు "ఎన్ని కోట్లరూపాయలున్నా యింతమందికి అన్నంపెట్టి భరించడం సాధ్యం కాదు" అని ఆశ్చర్యం వ్యక్తపరిచారట. దానికి అమ్మ ఇక్కడ భరించటం అంటూ ఏమీ లేదు. ఎవరి అన్నం వారు తిని వెడుతున్నారు అని సమాధానమిచ్చారు.

ఆమె వాక్చాతుర్యం కూడా అసాధారణమైనది. సంక్లిష్టమైన అభిప్రాయాలను సూత్రీకరించి చెప్పటం ఆమె విశిష్టత. "ఇష్టం లేనిది కష్టం, వైకల్యం లేనిది కైవల్యం సహించ లేనిది హింస, వర్గం లేనిది స్వర్గం, చేతలు చేతుల్లో లేవు, సంకల్పమే సంసారం, తిథులు విధిని మార్చలేవు. అనుకున్నది జరుగదు తనకున్నది తప్పదు" మొదలైనవి అమ్మసూత్రాలుగా నిలుస్తాయి.

మహనీయుల జీవితాలు లోకానికి మహత్తర సందేశాలవుతాయంటారు విజ్ఞులు. అమ్మ ఏమి చెప్పారని గాక, ఏమి చేశారని చూస్తే కలసి బ్రతకటాన్ని, తనకున్న దానిలో ఇతరుల కింత పెట్టడాన్ని ప్రోత్సహించినట్లు కనిపిస్తుంది. వర్తమాన సమాజంలో ఇంతకు మించి కావలసింది మాత్రం ఏముంది ?

అన్నం బ్రహ్మ

"అన్నం బ్రహ్మ" అంటుంది వేదం. క్షుత్తును తీర్చే ఆహారానికి అంతట ఉత్కృష్టస్థానం కల్పించారు వేదర్షులు. తను భుజించేదే కాదు. ఒకరికి పెట్టేదీ అంతే పవిత్రమైనది. "అన్నం వృత్తి కరాణాం శ్రేష్ఠం" అని చరక సూత్రం. శరీరాన్ని పోషించే ద్రవ్యాలలో అన్నం శ్రేష్ఠమైనది. ఆహార ధాన్యాలను పుష్కలంగా పండించుకొని సుఖంగా ఉండవలసిందని వేదమంత్రాలు ఉద్బోధించాయి. "అన్నం బహుకుర్వీత!"

ఒకనాటి భారతీయ సమాజంలో తను తినడం ఎంత ముఖ్యమో, ఒకరికి పెట్టడమూ అంతే ముఖ్యం. భిక్షాటన వృత్తి చేసుకొని బ్రతుకు వెళ్ళదీసుకొనే సక్తుప్రస్థుడు తను తెచ్చిన కొద్దిపాటి పేలపిండిని కుటుంబసభ్యులు నలుగురికీ పంచి భుజింప బోతుండగా అన్నార్తుడొకడు వచ్చి ఆహారం అడుగుతాడు. సక్తుప్రస్తుడి కుటుంబం తాము పస్తుండి తమ ఆహారాన్ని ఆగంతుకుడికి ఇచ్చి వేస్తారు. తరువాత కథ ఫలశ్రుతికి సంబంధించినది కనుక అది అప్రస్తుతం.

యజ్ఞయాగాది క్రతువులలో అన్నదానం ఒక ముఖ్యఘట్టం. నేటికీ దైవకార్యాలలో అన్నదానం భాగంగా ఉంటున్నది. అన్నదాన మహాయజ్ఞాలకు దేవాలయాలు యజ్ఞవాటికలుగా ఉండేవి. శ్రీశైలక్షేత్రానికి సరైన బాట లేని రోజులలో యాత్రికుల కోసం అక్కడ అన్నసత్రాలు వెలిశాయి. పల్లె పల్లెకూ తిరిగి సేకరించిన నిధులతో సంవత్సరం పొడవునా అన్నసత్రాలు నిర్వహించిన కాలం వుంది.

మంగళగిరి నృసింహక్షేత్రంలో కైవారము బాలాంబగారి సత్రం ఒకప్పుడు లోక ప్రసిద్ధం. ఏ వేళ ఎంతమంది వచ్చినా ఆమె అన్నం పెడుతుండేదని

అభిప్రాయం. "నేను అమ్మను - మీరు బిడ్డలు" అని పదే పదే ప్రకటించిన అమ్మ బిడ్డలను "కనడమే" (చూడడం) తన సాధన అన్నది. ఎక్కడ ఎవరిని చూచినా తన బిడ్డే అనిపించడం సన్యాసి లక్షణం కానేరదు.

తాను గురువును కానని కూడ స్పష్టం చేసింది. శిశువులేకాని తనకు శిష్యులు లేరని చెప్పింది. "గురువులేడని నే నెప్పుడూ అనలేదు. గురువే అక్కర లేదంటాను" అన్నారామె. "మనస్సే గురువని, పరిస్థితులే గురువు -బంధువు" అనీ ఆమె చెప్పారు.

ఇవేమీ కానప్పుడు ఆమెను చూడటానికి లక్షల మంది ఎందుకు వస్తున్నట్లు? ఆమెలోని అసాధారణ ప్రేమతత్వమే. ఆమెలోని అనుపమాన వాత్సల్యమే అసంఖ్యాక ప్రజలను ఆకర్షించాయి. మరొక తల్లి కన్నబిడ్డలను తన బిడ్డలుగా చూచుకోవడం అసాధారణమే కదా!

కుళ్ళువాసన కొడుతున్న కులతత్వానికీ, మతమౌఢ్యానికీ, వర్గవైషమ్యాలకూ అతీతంగా మనుషులు ఉమ్మడి కుటుంబం వలె కలసిమెలిస జీవించడం ఆమె జిల్లెళ్ళమూడిలో సాధించిన ఒక మహాద్భుతం. ఆమె నెలకొల్పిన సంస్థను ఆశ్రమం అనరు. "అందరిల్లు" అంటారు. అంతా కలసి భోజనం చేసే మందిరాన్ని "అన్నపూర్ణాలయం" అంటారు. ముదుసళ్ళకు వైద్య చికిత్సలాంటి సౌకర్యాలు చేకూర్చి ప్రేమగా పట్టెడన్నం పెట్టే చోటును "ఆదరణాలయం" అంటారు. అది అమ్మ పెట్టిన పేరు. "వృద్ధులకు కావలసింది ఆదరణ నాన్నా!" అన్నారు అమ్మ. అందరిల్లు ఖర్చును చూచి ఒకరు "ఎన్ని కోట్లరూపాయలున్నా యింతమందికి అన్నంపెట్టి భరించడం సాధ్యం కాదు" అని ఆశ్చర్యం వ్యక్తపరిచారట. దానికి అమ్మ ఇక్కడ భరించటం అంటూ ఏమీ లేదు. ఎవరి అన్నం వారు తిని వెడుతున్నారు అని సమాధానమిచ్చారు.

ఆమె వాక్చాతుర్యం కూడా అసాధారణమైనది. సంక్లిష్టమైన అభిప్రాయాలను సూత్రీకరించి చెప్పటం ఆమె విశిష్టత. "ఇష్టం లేనిది కష్టం, వైకల్యం లేనిది కైవల్యం సహించ లేనిది హింస, వర్గం లేనిది స్వర్గం, చేతలు చేతుల్లో లేవు, సంకల్పమే సంసారం, తిథులు విధిని మార్చలేవు. అనుకున్నది జరుగదు తనకున్నది తప్పదు" మొదలైనవి అమ్మసూత్రాలుగా నిలుస్తాయి.

మహనీయుల జీవితాలు లోకానికి మహత్తర సందేశాలవుతాయంటారు విజ్ఞులు. అమ్మ ఏమి చెప్పారని గాక, ఏమి చేశారని చూస్తే కలసి బ్రతకటాన్ని, తనకున్న దానిలో ఇతరుల కింత పెట్టడాన్ని ప్రోత్సహించినట్లు కనిపిస్తుంది. వర్తమాన సమాజంలో ఇంతకు మించి కావలసింది మాత్రం ఏముంది ?

అన్నం బ్రహ్మ

"అన్నం బ్రహ్మ" అంటుంది వేదం. క్షుత్తును తీర్చే ఆహారానికి అంతట ఉత్కృష్టస్థానం కల్పించారు వేదర్షులు. తను భుజించేదే కాదు. ఒకరికి పెట్టేదీ అంతే పవిత్రమైనది. "అన్నం వృత్తి కరాణాం శ్రేష్ఠం" అని చరక సూత్రం. శరీరాన్ని పోషించే ద్రవ్యాలలో అన్నం శ్రేష్ఠమైనది. ఆహార ధాన్యాలను పుష్కలంగా పండించుకొని సుఖంగా ఉండవలసిందని వేదమంత్రాలు ఉద్భోధించాయి. "అన్నం బహుకుర్వీత!"

ఒకనాటి భారతీయ సమాజంలో తను తినడం ఎంత ముఖ్యమో, ఒకరికి పెట్టడమూ అంతే ముఖ్యం. భిక్షాటన వృత్తి చేసుకొని బ్రతుకు వెళ్ళదీసుకొనే సక్తుప్రస్థుడు తను తెచ్చిన కొద్దిపాటి పేలపిండిని కుటుంబసభ్యులు నలుగురికీ పంచి భుజింప బోతుండగా అన్నార్తుడొకడు వచ్చి ఆహారం అడుగుతాడు. సక్తుప్రస్తుడి కుటుంబం తాము పస్తుండి తమ ఆహారాన్ని ఆగంతుకుడికి ఇచ్చి వేస్తారు. తరువాత కథ ఫలశ్రుతికి సంబంధించినది కనుక అది అప్రస్తుతం.

యజ్ఞయాగాది క్రతువులలో అన్నదానం ఒక ముఖ్యఘట్టం. నేటికీ దైవకార్యాలలో అన్నదానం భాగంగా ఉంటున్నది. అన్నదాన మహాయజ్ఞాలకు దేవాలయాలు యజ్ఞవాటికలుగా ఉండేవి. శ్రీశైలక్షేత్రానికి సరైన బాట లేని రోజులలో యాత్రికుల కోసం అక్కడ అన్నసత్రాలు వెలిశాయి. పల్లె పల్లెకూ తిరిగి సేకరించిన నిధులతో సంవత్సరం పొడవునా అన్నసత్రాలు నిర్వహించిన కాలం వుంది.

మంగళగిరి నృసింహక్షేత్రంలో కైవారము బాలాంబగారి సత్రం ఒకప్పుడు లోక ప్రసిద్ధం. ఏ వేళ ఎంతమంది వచ్చినా ఆమె అన్నం పెడుతుండేదని

చెప్పుకొనేవారు. ఆమె నిర్వహించిన మహాయజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగడం గురించి ఎన్నో కథలు ప్రచారంలో వున్నాయి.

తూర్పుగోదావరి జిల్లా లంకలగన్నవరం గ్రామంలో నివసించిన డొక్కాసీతమ్మగారి వితరణ ఖండాంతరాలు వ్యాపించింది. జాతి మత విచక్షణ లేక ఎందరికైనా ఆమె ఆదరించి అన్నంపెట్టేవారని చెబుతారు. ఎడ్వర్డ్ చక్రవర్తి ఈమె దాతృత్వాన్ని గురించి విని 1903లో ప్రశంసాపత్రాన్ని పంపించారట. పట్టాభిషేక ఉత్సవసమయంలో ఆమె ఛాయాచిత్రాన్ని దర్బారు హాలులో ఉంచే ఏర్పాటు కూడా చేశారట.

తంజావూరు రామానాయుడుగారు, కొవ్వూరి బసివిరెడ్డిగారు కూడా నిరతాన్నదాతలుగా చరిత్ర ప్రసిద్ధి పొందారు.

అన్నం అమ్ముకోవడం మారిన యుగధర్మమని పెద్దల మాట. కాని, వర్తమాన పరిస్థితులను బట్టి హోటళ్ళు అన్న విక్రయం చేయక తప్పదు !

ప్రకాశం జిల్లలోని వేటపాలెంలో ప్రభుత్వ సహాయంలేని ఉచిత మధ్యాహ్నభోజన కార్యక్రమమొకటి చాలాకాలంగా అమలు జరుగుతున్నది. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి చదువుకోసం వేటపాలెం వచ్చే విద్యార్థులు మధ్యాహ్నం భోజనం కోసం బాధపడకుండా గొల్లపూడి రాధాకృష్ణయ్య శ్రేష్ఠి గారనే ప్రముఖుడు స్వాతంత్రోద్యమ కాలంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన కాలం చేసినప్పటికి ఆయన సంతతి ఇప్పటికీ కులవర్గ విచక్షణ లేకుండా అవసరంలో వున్న విద్యార్థులకు మధ్యాహ్నవేళ ఉచితంగా మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల అవసరాన్ని గమనించి ప్రభుత్వ నుంచి సహాయాన్ని ఆశించకుండా ఇంతటి సత్కార్యాన్ని తలపెట్టిన ఆ మహనీయుడి ఔదార్యం దొడ్డది.

ఇప్పుడు సుప్రసిద్ధ క్షేత్రంగా వేలాదిమంది దర్శిస్తున్న జిల్లెళ్ళమూడి (గుంటూరుజిల్లా, బాపట్ల సమీపం) నిరతాన్నదానానికి పేరొందింది. జిల్లెళ్ళమూడి అమ్మ గత మూడు దశాబ్దాలు పైగా తనను చూడటం కోసం ఆ గ్రామానికి వచ్చే వేలాదిమందికి అన్నం పెడుతున్నది. కులమత వర్గ విచక్షణ లేకుండా వందలాది మంది పంక్తులు తీరి అక్కడ భోజనాలు చేస్తారు. ఆ

విధంగా అన్నం పెట్టడాన్ని "దానం" అనడానికి "అమ్మ" ఇష్టపడదు. తను ఉన్న ఇంటికి ఆమె "అందరిల్లు" అంటుంది. ఎవరి అన్నం వారు తిని వెడుతున్నారే గాని ఒకరు దానం చేయడం, మరొకరు స్వీకరించడం అనే ప్రసక్తి లేదంటుందా తల్లి.

తిరుమల – తిరుపతి దేవస్థానం వారు కొండమీద యాత్రికుల కోసం ఎనభైలలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ప్రస్తుతానికి పరిమిత స్థాయిలోనే జరుగుతున్నప్పటికీ అడిగిన వారందరికీ అన్నం పెట్టే ఆలోచన దేవస్థానం వారికి ఉన్నట్టు వింటున్నాము. (ఇది రాస్తున్న కాలంలో – 20 వ శతాబ్దం చివరి దశకం ఇదే పరిస్థితి. దాని క్రమంగా అందరికీ ఉచితంగా అన్నం పెడుతున్నారు. పరిమితి లేదు. తిరుమలేశుడు ధనాకర్షణ, జనాకర్షణ కూడా కలవాడు. తిరుమల దర్శించే యాత్రికులలో అత్యంత ధనికులూ ఉన్నారు. లెక్కకు మించి పేదలూ ఉన్నారు. దైవదర్శనార్థం కొండ ఎక్కే యాత్రికులకు ఒకటి రెండు రోజులు అన్నం పెట్టడం దేవస్థానానికి నష్టం కాదు. టి.టి.డి. ప్రారంభించిన ఈ పథకం విస్తృతంగా కావాలని, శక్తికలిగిన ఇతర దేవస్థానాలు సైతం ఇలాంటి సత్కార్యాలకు పూనుకోగలవని ఆశిద్దాము.

అందరూ అమ్మలే!

"నన్ను అమితంగా ప్రభావితం చేసిన ఒక స్త్రీమూర్తిని గురించి చెప్పమంటే సమాధానం కష్టం కాని, నన్ను, నా జీవిత గమనాన్ని ప్రభావితం చేసిన ఒక స్త్రీ లక్షణాన్ని గురించి ఏమైనా చెప్పమంటే అది నాకు సులభం. అందుకు చాలా ఇష్టపడతాను కూడా. జీవితం పట్ల, సమాజం పట్ల, ముఖ్యంగా స్త్రీ పట్ల నా ఆలోచనలను, దృష్టిని తగినంతగా మార్చిన స్త్రీలలోని ఒక లక్షణం మాతృత్వం. అందులో నిక్షిప్తమై ఉన్న కారుణ్యం, మానవత – నేను ఆరాధించే గుణాలు.

ఇందుకు సంబంధించి నా మనస్సులోని భావాలను మీకు సరిగా తెలియపరచడానికి స్వానుభవాలను కొన్నింటిని చెప్పక తప్పదు.

నన్ను కన్న తండ్రి నా చిన్నతనంలోనే పోయారు. ఆయన తమ్ముడికి నన్ను దత్తత ఇవ్వాలనుకున్నారు. కాని సంవత్సరం వ్యవధిలో ఆయన,

అంటే నా పినతండ్రి కూడా పోయారు. కనుక తండ్రి వాత్సల్యం అంటే ఏమిటో నేను అనుభవించలేకపోయాను. ఆ కొరతను ముగ్గురమ్మలు తీర్చారు – నన్ను కన్నతల్లి, పెంచిన తల్లి, అందరి అమ్మ ! ఇక్కడ నమ్మశక్యం గాని కొన్ని విషయాలను మీకు చెప్పవలసి ఉంది. నన్ను కన్నతల్లికి నాకు తెలిసిగాని, నా అన్నకు, అక్కలకు తెలిసిగాని ఒక్కసారంటే ఒక్కసారి కూడా ఎవరిమీద కోపం రాలేదు. పిల్లలు, కుటుంబంలోని వారు, తెలిసిన వారు, తెలియనివారు అనేకాదు, పశుపక్ష్యాదుల మీద కూడా ఆమె చిరాకుపడటం కాని, కసురుకోవడం కాని ఎన్నడూ జరగలేదంటే, అక్షరాలా ఎప్పుడూ జరగలేదంటే మీరు నమ్మండి. ఆమె దుఃఖపడిన సందర్భాలు ఉన్నాయి గాని కోపగించిన సందర్భం లేనే లేదు !

నన్ను పెంచిన తల్లి నా సొంత తల్లి చెల్లెలే. ఆమె మరొక ఆశ్చర్యకర వ్యక్తి. స్వయంగా వండి ఇతరులకు కడుపు నిండా అన్నం పెట్టడం ఆమెకు ఇష్టం. ఆమెకు వేరే ఇష్టాలు గాని, వ్యాపకాలు గానీ ఉండేవి కావు. సంతానం లేరు. భర్త ఇచ్చిపోయిన పొలాన్ని, బంగారాన్ని ఆమె భోజనాలు పెట్టే కార్యక్రమానికి సంతోషంగా ఖర్చుపెట్టేవారు. మిగిలినదేమైనా ఉంటే నన్ను చదివించడానికి, పోషణకు వ్యయపరిచారు. తన చివరి రోజులలో చిరిగిన చీరలను కట్టుకోవడానికే ఇష్టపడ్డారు కాని నేను మంచివి కొనిపెట్టగలిగిన స్థితిలోకి ఎదిగినప్పటికీ బంగారం పట్లగాని, మంచి చీరలపట్లగాని ఆమె ఆసక్తి చూపించలేదు. అది లేదు ఇది లేదన్న చింత ఆమెను బాధించేది కాదు. అన్నం పెట్టడం చివరి వరకు ఆమె ఇష్టపడిన ఒక వ్యాపకం. మనుషుల విషయంలోనే కాదు జంతువుల పట్ల కూడా ఆమెకు ఇదే విధమైన వాత్సల్యం ఉండేది. తను తినే అన్నంలో కొంత, తను తాగే కాఫీలో కాసిని కుక్కలకు, పిల్లులకు మిగల్చడం మాకు ఆశ్చర్యం కలిగించేది.

మరొక అమ్మ శ్రీమతి అనసూయాదేవి. శ్రీ బ్రహ్మాండం నాగేశ్వరరావుగారి భార్య "అమ్మ"లూ, "బాబా"లూ అని కొందరు తేలికగా మాట్లాడుతుంటారే – అందులోని మొదటి పదం అమ్మను ఉద్దేశించినదే. అంతా ఆమెను "అమ్మా" అని పిలుస్తుండేవారు. నేను 1958లో మొదటిసారి

ఆమెను చూసాను. అప్పటికి నేను నాస్తికుడిని. చాలా మంది ఆమెను గురించి వింత వింత విశేషాలు చెపుతుంటే కుతూహలం కొలది ఏమిటో చూద్దామని కొందరు మిత్రుల వెంట వెళ్ళాను. కుల, మత వ్యత్యాసాలతో నిమిత్తం లేకుండా అంతస్తులను పాటించకుండా అందరికీ ఆమె ఒకే పంక్తిలో భోజనం పెడుతున్న తీరు నాకు నచ్చింది. అంతా ఒక కుటుంబంగా జీవించే ఒక వినూత్న ప్రయోగం జిల్లెళ్ళమూడి గ్రామం లోని అమ్మ నివాసంలో కనిపించింది. జిల్లెళ్ళమూడి గ్రామం గుంటూరుజిల్లా బాపట్ల పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో ఉంది. నాకు దేవుడి మీద గాని మహిమలు చూపిస్తామంటున్న మనుషులమీద గాని నమ్మకం లేదని ఆమెకు మా సంభాషణలలో చెప్పాను. నీ మనస్సుకు ఎలా తోస్తే అలాగే అన్నారామె.

మంచిని మించిన మహిమ ఏమి ఉంటుంది ?" అన్నారొకసారి. మనుషుల మధ్య సంబంధాలను గురించి ఆమె లోతుగా అర్థం చేసుకున్నారనిపించి. ఆ విషయం మీదనే ఆమెతో గంటల కొలది, రోజుల తరబడి మాట్లాడాను, మానవ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి అప్పటికే నేను చేస్తున్న ప్రయత్నంలో నాకు అమ్మతో సంభాషణలు కొంతవరకు ఉపయోగపడుతున్న సూచనలు కనిపించాయి.

అప్పటికి నా వయస్సు 24 సంవత్సరాలు. వివాహమైంది. నా మొదటి సంతానం ఒక ఆడపిల్ల పోయింది. డబ్బు ఉండి, తగిన చికిత్స చేయించి ఉంటే బిడ్డ బ్రతికేదేమోనన్న భావన అప్పటికీ ఇప్పటికీ నన్ను తొలుస్తూనే ఉంటుంది. అమ్మతో సంభాషణల వల్ల నాకు ఈ విషయంలో కొంత ఊరట కలిగింది. అమ్మ మాటల్లోని విజ్ఞత మీద నాకు నమ్మకం ఏర్పడింది.

కాలేజీలో చదువుకునే రోజుల్లో, తాలింఖానాలో వ్యాయామం చేసే రోజులలో నాకు రెండు బలహీనతలు ఉండేవి. మొదటిది చాలామంది యువకులలాగే ఆడపిల్లలను గురించి తేలికగా మాట్లాడటం. అన్ని విధాలైన పరిహాసోక్తులు పలకడం. రెండవది సిగరెట్లు కాల్చడం. వ్యాయామం చేసేవాళ్ళు సిగరెట్లు కాల్చడం మంచిది కాదు. అయినా ఆ అలవాటును నేను మానుకోలేకపోయేవాడిని. జర్నలిజం మీద అపరిమితమైన వ్యామోహం

వల్ల ఎంత మాత్రం చాలని జీతంతో సబ్ ఎడిటర్ ఉద్యోగం చేస్తున్న రోజులవి. ఆస్తి చాలా భాగం అప్పటికే కరిగిపోయింది. ఒకదాని మీద మరొకటిగా ఆర్థిక ఇబ్బందులు వస్తుండేవి. అమ్మను చూడటానికి వెళ్ళినపుడు ఉచితంగా పెట్టే భోజనం తినడం న్యాయం కాదనిపించి, ఆత్మ సంతృప్తి కోసం అక్కడ జరిగే నిర్మాణం పనులలో మట్టి, రాళ్ళు, ఇటుకలు మోయడం లాంటి పనులు చేస్తుండేవాడిని. అలా పనులు చేసేవాళ్ళలో ఆడా, మగా కూడా ఉండేవారు. "అన్నయ్యా", "అక్కయ్యా" అని పిలుచుకుంటూ కలసి మెలసి పనిచేస్తుండేవారు. నేను కొన్ని గంటలు పనిచేసిన తరువాత అలవాటు లేని పని కావడం వల్ల బడలిక అనిపించేది. ఒళ్ళంతా త్వరగా చెమటలు పట్టేది. అయినా ఒక రోజు అలా పట్టుదల కొద్దీ పనిచేస్తూనే ఉన్నాను. నాకంటే చిన్నదైన ఒక యువతి నా దగ్గరకు వచ్చి "అన్నయ్యా ! ఇంతసేపు నువ్వు చేసింది చాలు. నువ్వు వెళ్ళి స్నానం చేసి అమ్మదగ్గర కూర్చో" అంది. నేను "ఎందుకు ? ఆడపిల్లవు నువ్వు చేస్తుండగాలేంది నేను ఆ మాత్రం చెయ్యలేనా ?" అన్నాను. ఆమె నవ్వి "అన్నయ్యా ! నేను కాయకష్టానికి అలవాటుపడినదాన్ని. నువ్వు ఆఫీసులో కూర్చొని రాసుకోవడానికి అలవాటు పడినవాడివి. అందువల్ల వెళ్ళమన్నాను. నీ తృప్తి కోసం కొంతసేపు చేశావు. చాలు. వెళ్ళు అన్నయ్యా !" అంది బ్రతిమిలాడుతున్న ధోరణిలో. నా కళ్ళు చెమ్మగిల్లాయి. "ఇటువంటి ఆడపిల్లలను నేను ఎలాంటి దృష్టితో చూస్తున్నాను ? నేను అప్పటివరకు చదివిన చదువు నాకు నేర్పిన సంస్కారం ఏపాటిది" అనే ఆలోచనలు కలిగాయి.

నేనూ అందరిలాంటి యువకుడినే. ఆ వయస్సులో మేఘసందేశం లాంటి ప్రాచీన సాహిత్య గ్రంథాలతో పాటు ఇరవయ్యోవ శతాబ్ది ఐదవదశకంలో యువతీ యువకులను విశేషంగా ఆకర్షించిన కొవ్వలి, జంపన నవలలూ, చలం రచనలూ దొరికిన మేరకు చదివినవాడిని. వాటి ప్రభావం నా మీద పుష్కలంగా ఉండేది. నా అనుభవం కూడా చాలా మంది యువకుల అనుభవాల లాంటిదేనని, నా ఆలోచనలలో వైపరీత్యమేమీలేదని స్నేహితులం మాట్లాడుకొంటున్నప్పుడు అర్థమవుతుండేది. మట్టి తట్టలు మోస్తున్నప్పుడు

ఒక ఆడపిల్ల చెప్పిన మాటలు నాకు కలిగించిన ఆలోచనలను అమ్మతో మాట్లాడుతున్నప్పుడు చెప్పాను. ఆడపిల్లలను చూసేటప్పుడు అంగాంగ వీక్షణం చేసే నాలోని బలహీనతలను గురించి దాచుకోకుండా చెప్పాను. అబద్ధాలు చెప్పడం నాకు మొదటి నుంచి ఇష్టం ఉండేది గాదు. అలాగని అబద్ధం ఆడనని, సత్యసంధుడనని చెప్పడం లేదు. ఎప్పుడైనా తప్పనిసరై అబద్ధం ఆడినప్పుడు నామీద నాకే ఒక విధమైన చిరాకు, కోపం కలుగుతుంటాయి. ఇప్పటికీ అదే పరిస్థితి.

అమ్మ ఓపికగా విన్నది.అప్పుడేమి మాట్లాడలేదని జ్ఞాపకం. తరువాత ఎప్పుడో ఒకసారి పిల్లలకు తల్లి పాలివ్వడం గురించిన ప్రస్తావన వచ్చింది. అప్పుడు అమ్మ చెప్పింది పిల్లలకు పాలివ్వడంలో తల్లికి కలిగే ఆనందం, తృప్తి గురించి. నేను చిన్నప్పుడు నా తల్లి దగ్గర పాలు తాగిన రోజులను జ్ఞాపకం చేసింది. చాలామందికి అప్పటిరోజులు గుర్తు వుండకపోవచ్చు. కాని నాకు జ్ఞాపకం వున్నాయి. ఎందుకంటే మూడేళ్ళో నాలుగేళ్లో వచ్చినా నేను మా అమ్మను పాలకోసం వేధిస్తుంటే మా యింట్లోని మిగతా పెద్దవాళ్ళు పాలు మాననందుకు నన్నూ, మా అమ్మనూ కోప్పడుతుండేవాళ్ళు. తల్లి తరువాత తల్లి అనిపించిన మా వదినగారు నా చిన్నప్పటి అలవాటును జ్ఞాపకం చేసి బనాయిస్తుండేది. పిల్లలకు ప్రాణాధారమైన పాలు ఎక్కడి నుంచి వస్తున్నాయో అవి "అమృత కలశాలు" అని అమ్మ చెప్పి, "ఏమంటావు? నాన్నా!" అన్నది. దృష్టిని మార్చి చూస్తే అవి అమృతకలశాలు !

అమృత కలశం ! ఎంత చక్కని అభివ్యక్తి ! అప్పట్లో నాతో కలసి పనిచేస్తున్న మిత్రులు ఉషశ్రీతో స్తనద్వయం గురించి అమ్మ ప్రయోగించిన పదద్వయం చెప్పాను. ఆమె గురించి చెప్పాను. ఆ తరువాత ఉషశ్రీ తన పుస్తకం దేనికో "అమృతకలశం" అని పేరు పెట్టినట్లు జ్ఞాపకం. దూడలు పొదుగు గుడుస్తుంటే జోరీగలు ఒక వంక బాధపెడుతున్నా చెవులు, తోక తప్పించి మిగతా శరీరం కదలకుండా పాలిస్తుండే ఆవులను, గేదెలను చూచినప్పుడు, నాలుగైదు పిల్లలు మీదపడి కుమ్మి కుమ్మి పాలుత్రాగుతున్నా ఓపికగా పాలిచ్చే పిల్లులను, కుక్కలను చూచినప్పుడు అమ్మ మాటలు జ్ఞాపకం

వస్తుంటాయి. ఇప్పటికీ, చనిపోయిన దూడ చర్మంలో గడ్డిని దట్టించి దూడ ఆకృతిని కలిగించి చూపినప్పుడు పొదుగు చేపి క్షీరధారలను వర్షించే ఆవునో గేదెనో చూచినప్పుడు దాని మాతృత్వం హృదయతంత్రులను మీటుతుంది.

పాలకోసం ఏడుస్తున్న చంటిబిడ్డకు పదిమంది మధ్యలో సైతం పమిటి చెంగుమాటున నోరు తడిపే మాతృమూర్తులను చూస్తే మనస్సులోనే నమస్కరించాలనిపిస్తుంది. చాలీచాలని, చిరుగుల చీరతో నడుస్తూనే రెండు చేతులా ఈతాకుల చాపలల్లుతూ, భిక్షాటనం కావిస్తూ జోలెసంచిలోని పొత్తిళ్ళబిడ్డకు స్తన్యమిస్తున్న పేదరాలికి మనిషిలోని మనిషి ప్రణమిల్లకుండా ఎలా ఉండగలడు?

అలాంటి స్త్రీమూర్తులలో మాతృత్వానికి మారు మరేదైనా కనిపిస్తే విప్లవ గాయకుడు గద్దరు పాడినట్లు ఆ కళ్ళల్లో అవి ఎవరివైనా - జిల్లేళ్ళపాలు పొయ్యాలనిపించదూ !

నేను కల్మషం బొత్తిగా లేనివాడినని గాని, ఎప్పుడు ఎలాంటి దుశ్చింతను మనస్సులోకి రానివ్వని వాడనని గాని,ఎన్నడూ ఏ తప్పూ చేయని పరమ నీతిమంతుడనని గాని చెప్పుకోవడం లేదు. కాని, స్త్రీలలో మాతృత్వం నాకు నాటి నుండి ఎల్లెడలా సాక్షాత్కరిస్తున్నది. నా అనుభవాలే నాకు అలాంటి అదృష్టాన్ని కలిగించాయి. స్త్రీలలోని ఈ మాతృత్వ లక్షణం, వాళ్ళలో కనిపించే వాత్సల్యం, మమత, అనురాగం, కారుణ్యం సమాజం పట్ల నా దృక్పథాన్ని మార్చివేశాయి. అమ్మలందరికీ - అందుకు గాను - నేను సదా కృతజ్ఞుడనే.



అందరినీ కలిపి ఉంచుతున్న అమ్మ

మనందరి అమ్మ ఈ వేళ మనందరి మధ్య మనందరికీ కనిపిస్తూ ఉన్నట్లయితే సహస్రచంద్రదర్శన ఉత్సవాన్ని ఆనందోత్సాహాలతో ఎంత ఘనంగా జరుపుకొంటూ ఉండేవాళ్ళమో ! ఇప్పుడు అదే ఉత్సవాన్ని మరొక పేరుతో జరుపు కొంటున్నాము.

నమ్మకం ఉన్నవాళ్ళకు ఆమె మనల్ని ఇప్పుడూ చూస్తూనే ఉంది నమ్మకంతో నిమిత్తం లేకుండా. మనకు ఆమె భౌతికంగా కనిపించడం లేదు కాని, మన జిల్లెళ్ళమూడి సోదరీ సోదరులలో చాలా మంది అనుభూతి ఒకటి ఉంది. కళ్ళు మూసుకొని అమ్మతో ఒకప్పటి అనుభవాలను జ్ఞాపకం చేసుకొంటే మరోసారి అదే అనుభవాలను పొందినట్లు ఉంటుంది.

విశ్వజననీపరిషత్తు జిల్లెళ్ళమూడిలో అందరింటిని తీర్చిదిద్దుతున్న తీరును గమనిస్తే అమ్మ ఎప్పుడో చెప్పినట్లు ఒక మహాక్షేత్రం రూపొందుతున్నట్లు అనిపిస్తుంది. అది అమ్మ సంకల్పం, అది అమ్మ అనుగ్రహం.

అమ్మ నిర్మించిన అందరింటిలో ఒక నూతనత్వం సహజంగా వర్ధిల్లుతున్నది. ఇక్కడ కులం, మతం, ప్రాంతం, అంతస్తు అన్నీ అప్రధానమే. మనిషే ముఖ్యం. మనుషుల మధ్య పరస్పర ప్రేమలూ, అనురాగాలూ, మమతలూ, అభిమానాలూ - ఇవే ముఖ్యం. నిజానికి వీటన్నిటి కలయికే జీవితం. ఆహార, భయ, నిద్రాదులు ప్రాణులన్నింటికీ సమానమే. మనిషి అంతకంటె భిన్నమైతే, అది ఈ అనుబంధాలలోనే ఉంది. ప్రాణులన్నింటికీ సమానమైన సంగతులను గురించి మాట్లాడుకొంటున్నాము. నిజానికి, అమ్మకు ప్రాణులన్నీ సమానమే. అమ్మ బిడ్డలమైన మనం ఆ స్థితిని చేరుకొనడానికి ఎంతకాలం పడుతుందో తెలియదు. అసలు చేరుకొనగలమో లేదో కూడా తెలియదు.

అమ్మను మనం ఆరాధించడంలోనూ ఎవరి పద్ధతి వారిది. అమ్మ దేనికీ అభ్యంతరం చెప్పలేదు. కొందరు మల్లెలతో పూజిస్తే మరికొందరు మందారాలతో అర్చించారు. పుష్పాల విషయంలోనే కాదు. ఇంకా చాలా విషయాలలో తేడాలు ఉన్నాయి. ఉంటేనేమి, అందరినీ కలిపి ఉంచుతున్నది మన అమ్మ.

మన దృక్పథాలలో వైవిధ్యం ఉన్నది గనుకనే ఎన్నో కోణాల నుంచి, ఎన్నో విధాలుగా, చూస్తున్నాం అమ్మను. మనందరం ఎన్ని విధాలుగా చూచినా అమ్మ అమ్మే.

ఆలయంలో అమ్మ

అమ్మదేవతా ? ఒక మందిరం నిర్మించి అందులో విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తే అది దేవాలయమవుతుందా ?

అమ్మ దేవాలయాలను నిర్మిస్తున్నట్లు విన్న ఏ కొందరి మనస్సులలోనైనా ఇలాంటి ప్రశ్నలు తలెత్తవచ్చు. ప్రశ్నించడం, ప్రశ్నించుకొని సమాధానాలు వెతుక్కోవడం అత్యంత ఆరోగ్యకరమైన లక్షణం. ఎవరో ఏదో చెప్పినంత మాత్రాన వెంటనే నమ్మేయడం మంచి పద్ధతి కాదు. జిల్లెళ్ళమూడి అమ్మ జీవితం నేర్పుతున్న పాఠమిది. ఏది ఎంతవరకు సబబో, ఏ పని సమర్థనీయమో పరిశీలించి, తర్కించుకొని అభిప్రాయాలను ఏర్పరచుకోవాలని అమ్మ చరిత్ర చెపుతున్నది.

అమ్మ తన బాల్యంలోనే దైవమంటే ఏమిటని యోచించింది. విగ్రహాలను గురించి విచికిత్సకు సమాధానం సాధించింది. దేవుడంటే విగ్రహమా ? విగ్రహాలు దేవుళ్ళవుతాయా ? దేవుడు వేరూ, విగ్రహం వేరునా ? అమ్మ ఇలా తనకు తాను ప్రశ్నలు వేసుకొంది. వారినీ వీరినీ అడిగితే కలిగే ప్రయోజనం కన్నా తనకు తానే సాధన చేసి తెలుసుకోవడం మేలనుకొన్నది. అందుకోసం ఒక సాహసం కూడా చేసింది. పుట్టిన ఊరు మన్నవలోనూ, అక్కడికి దగ్గరలోని బాపట్ల పట్టణంలోనూ చిన్నప్పుడు అమ్మ దేవాలయాలకు వెడుతూండేది. తాను తరచు స్నేహితురాళ్లతో కలిసి వెళ్ళి వస్తుండే రాజ్యలక్ష్మి ఆలయానికి అలా వెళ్లిందొకసారి అమ్మ. అది ఆలయం మూసివేసే సమయం. సరాసరి గర్భగుడి లోకి ప్రవేశించింది. అర్చకస్వామి అమ్మను చూడలేదు. వేళకాగానే గుడి తలుపులు మూసి వెళ్ళిపోయాడు. గర్భగుడిలో అమ్మవారితో పాటు అమ్మకూడా ఉంటుందని అతడు అనుకొనే అవకాశం లేదు. పూజారి వెళ్లిపోయాక అక్కడ మిగిలింది అమ్మ, అమ్మవారూ... ఇద్దరే.

అమ్మవారి సంగతేమిటో తెలుసుకోవాలనుకొన్న అమ్మ అమ్మవారిని పిలిచింది. సమాధానం లేదు – సహజంగానే పిలిస్తే పలుకలేదు సరే. చేతితో తట్టింది. కదిలించాలని ప్రయత్నించింది. అమ్మవారిలో చలనం లేదు. ఉలుకు లేదు. పలుకు లేదు. కదిలిస్తే కదలడం లేదు. పట్టువదలని అమ్మ, అమ్మవారి కళ్లకు పెట్టి ఉన్న డిప్పలను ఊడదీసింది. అవి చూపులేని కళ్లు. అమ్మవారి ఒంటి మీద ఆభరణాలను తీసి చూస్తే ? అలా అనుకొని అమ్మ వాటిని ఒకటొకటిగా ఒలిచింది. విగ్రహానికి కట్టిన వస్త్రాలను తీసివేసింది. అప్పుడు రాయి మిగిలింది. రాతికి పూసి ఉన్న రంగు జిడ్డు చేతికి తగిలింది. ఇంతకు మించి మరేమీ కాలేదు. ఇంతకూ తేలినదేమిటి ? విగ్రహం ఊపిరిపీల్చడం లేదు. మాట్లాడటం లేదు. చూపు లేదు. అసలు కదలడమే లేదు. ఐతే ఈ అలంకారమేనా మనం అనుకొంటున్న దేవుడు ? అలా కావడానికి వీల్లేదు. సొమ్ములు దేవుడు కాకపోతే వాటిని చేసినవాడు దేవుడా ? ఈ రాయిని చెక్కినవాడు దేవుడా ? లేక, వీటన్నింటిని దేవుడనుకొంటున్నవాడే దేవుడా ? మరి ఈ పదార్థాలన్నీ ఇచ్చిన భూమి మాటేమిటి? భూమి దేవతా ? ఈ భూమిని ఎందుకు పూజ చేయకూడదు ? భూమి అన్నింటికి ఆధారం కాదా ? పైకి నిశ్చలంగా కనిపించే ఈభూమి ఎంత గొప్పది ? అమ్మ మనసులో ఇలా ఎన్నో ఆలోచనలు ముసురుకొన్నాయి. గుప్పెడు మట్టిని చేతిలో పట్టుకొని "సకల జీవకోటికి ఆహారం ఇచ్చి పోషిస్తున్నావు కదూ ! దున్నినా, తన్నినా భరిస్తున్నావు. నీకున్నంత సహనం ఇంకెవరికి ఉంది ?" అనుకొన్నది. అమ్మ మనస్సులో భూమి పట్ల ఆరాధన భావం కలిగింది. "నీవు సహన దేవతవు. జగత్తుకు మాతృమూర్తివి" అని నేలమీద సాగిలపడింది.

అలా అమ్మ దృష్టి విగ్రహం మీది నుంచి విశ్వం మీదకు మళ్లీ భూమి మీద కేంద్రీకృతమైన వేళ ఒక మహాముహూర్తమై ఉంటుంది. అనంతమైన ఈ మహావిశ్వంలో ఈ భూమి పరిమాణమెంత ? రేణు సమానం. ఐనా, ఈ భూమి ఒక విలక్షణ సృష్టి, రాజ్యలక్ష్మి ఆలయంలో విగ్రహాన్ని, విగ్రహంలోని దేవుడినీ పరశీలించడానికి వెళ్ళిన అమ్మ మనోనేత్రం ముందు ఒకానొక పరమసత్యం ఆవిష్కృతమైన శుభవేళ అది. విగ్రహం, దేవాలయం, ఆరాధన మొదలైన అనేకానేక విషయాలకు అర్థం తెలిపిన ఘడియ అది.

బాపట్లలో అమ్మ తాతగారైన చిదంబరరావుగారి ఇంటికీ, భావన్నారాయణ స్వామి గుడికీ అట్టే దూరం లేదు. అమ్మ చాలా సార్లు ఆ గుడికి వెళ్లింది. తరచు అమ్మ వెంట తన యీడు స్నేహితురాళ్లు ఉంటుండేవారు. మిగతా పిల్లలు కొబ్బరికాయలు తెచ్చి కొడుతుండేవారు. అమ్మ ఒక్కసారి కూడా కొబ్బరికాయ తేలేదు. కొట్టలేదు. అమ్మ పాదాలకు అంటిన మట్టిని చూపించి, స్నేహితురాళ్లు "కొబ్మరికాయ తీసుకొని రాకపోతేనేమి. ఇంత మట్టి తెచ్చింది" అని ఆట పట్టించిన సంఘటన ఒకటి ఉంది. కొబ్బరికాయలు తెచ్చిన వారి పాదాలకు మట్టి అంటదా? అనుకొని అమ్మ అందరినీ పరీక్షగా చూసింది. అందరికీ తనలాగే మట్టి అంటింది. అమ్మ ఇలా దేవాలయాలను గురించి ఆలయాలలలోని విగ్రహాలను గురించీ ఆలయాలకువెళ్లి విగ్రహాలకు మ్రొక్కే భక్తులను గురించి తుదకు ఆలయాలకు వెళ్లిన భక్తులకు అంటిన మట్టిని గురించి కూడా ఆలోచనలు చేసినట్లు "మాతృశ్రీ జీవిత మహోదధిలో తరంగాలు వెల్లడిస్తున్నది. అలా గుళ్లను గురించీ, గుళ్లలో పూజలు గురించి అంతగా చర్చ చేసిన అమ్మ ఎక్కడా పూజలు చేసినట్లు ఆధారాలు కనిపించవు. బాల్యంలోనే కాదు అటు తరువాత జీవితంలోనూ అమ్మ ఎక్కడ ఏ ఆలయంలోనూ పూజలు చేసిన, చేయించిన దాఖలాలు లేవు. కాని, అమ్మ ఎన్నో దేవాలయాలను చూశారు. చూసి ఆనందించారు. విగ్రహాలను స్పృశించారు. అలా తాకినపుడు విగ్రహానికి ఆధారమైన రాయిని గాక, అంతకు మించిన అలౌకిక విశేషమేదో అమ్మకు అనుభవమవుతున్నట్లు చూసేవారికి అనిపిస్తుండేది.

అమ్మ 1973 సెప్టెంబరు 7వ తేదీన నెల్లూరుకు వెళ్ళారు. అప్పుడు అక్కడి శ్రీ రంగనాథస్వామి ఆలయం నిర్వహణాధికారులు అమ్మను గుడికి ఆహ్వానించారు. "మాతృశ్రీ" గౌరవ సంపాదకులు శ్రీ కొండముది రామకృష్ణ మాటల్లో అప్పటి ఒక సన్నివేశం.

"అమ్మ ఆలయానికి వెళ్లింది. అర్చకులు ఆలయంలోనికి దారి చేశారు. ఆలయంలో వెళుతుండగానే గర్భగుడిలో తల్పశాయి అయిన రంగనాథుడు అమ్మకు కనిపించాడు.. ఇక చకచకా గర్భగుడి ప్రవేశించింది. రంగనాథుని సమీపించింది. ఆ హృదయంలో వాత్సల్యం పొంగులు వారటం ఆ ముఖంలో కన్నుల్లో ద్యోతకమవుతూనే వున్నది. అర్చకస్వామి ఏదో అంటున్నా అమ్మకు

వినిపించటంలేదేమో – అమ్మ ఆ విగ్రహాన్ని ప్రేమగా నిమరడం ప్రారంభించింది. అది రాయిగా కఠినంగా తగలలేదేమో, ఆ ప్రేమాన్విత స్పర్శలో అమ్మ పులకించి పోవటం ప్రక్కనున్నవారికి విదితమవుతూనే వున్నది. అమ్మ హృదయోద్భూత ఆనంద తరంగాలు వారిని తాకుతూనే ఉన్నాయి.

"అర్చకస్వామి అమ్మ చేతిలో పోసిన జలాన్ని అమ్మ ప్రేమతో రంగనాథునిపై చిలకరించింది. భక్తితో తనను అలంకరించిన సుమాలను తన మెడనుండి తీసి అనురాగపూర్వకంగా రంగనాథునికి అలంకరించింది. అమ్మ మామూలుగా ఏ బిడ్డ యింటికి వెళ్లినప్పుడైనా ప్రేమగా ఎట్లా అభివ్యక్తం చేస్తుందో ఆ దేవాలయంలోనూ అట్లాగే చేసింది. ఆ సమయంలో అమ్మ ప్రవర్తనలో ఏ మాత్రమూ అసహజంగానీ, అసాధారణతగానీ స్ఫురించలేదు. అమ్మ దృష్టిలో నరుడూ, నారాయణుడూ సమమే. జడమూ, చైతన్యము అని రెండు లేవు.."

అమ్మ దేవాలయాలను దర్శించింది. మసీదులను, చర్చిలను కూడా చూసింది. విగ్రహాలు ఉన్నచోట, లేనిచోట కూడా దైవభక్తి ఉన్నది. సృష్టికర్తకు మ్రొక్కు కోవడం ఉన్నది. అమ్మను ఆయా ప్రార్థన స్థలాలకు ఆకర్షించింది అదేనేమో.

అమ్మ ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ప్రార్థనా మందిరాల నిర్మాణాన్ని ప్రోత్సహించింది. ప్రార్థనలను, పూజలను, ఆరాధనలను, అర్చనలను సమర్థించింది. అమ్మ కొబ్బరికాయలు కొట్టారు. ఎక్కడ ? అన్నపూర్ణాలయం వద్ద కొట్టారు. తన ఆలయం వద్ద కూడా ఒకసారి కాదు, ఎన్నోసార్లు, ఎన్నో కొట్టారు. దైవాన్ని ఆరాధించమని అమ్మ సందేశమనిపిస్తుంది. విగ్రహం మీద పూలు విసరటం పూజకాదు. అందులో చూసుకొంటున్న దైవానికి పూలు సమర్పించుకోవటం పూజ.

1950–60 దశాబ్ది పూర్వార్థంలో అమ్మ నివాసం జిల్లెళ్ళమూడిలో ఒక పూరిల్లు. అప్పటికే అమ్మను చూడటానికి చాలామంది జనం వస్తుండేవారు. అమ్మ స్వయంగా వంటచేస్తూ పెడుతూండేది. అమ్మ ఉండే పూరింటికి దగ్గరలోనే ఒక పాక ఉండేది. వచ్చేవాళ్ళకు అది నివాసం. అందులో చిల్లరమల్లర దేవుళ్ల చిత్రపటాలు చాలా ఉండేవి. అవన్నీ అమ్మ సేకరించినవి కావు. ఇంట్లో ఎప్పటినుంచో ఉన్నవి కొన్ని. ఎవరెవరో తెచ్చి పెట్టిన పటాలు మరికొన్ని.

క్రమంగా వాటి సంఖ్యపెరుగుతూవచ్చింది. ఎంతగా పెరుగుతూ వచ్చిందంటే ఒక వరుస చాలక రెండో వరుస, అది కూడా చాలక మూడో వరుస.. అలా గోడలకు అమరుస్తూ పోవలసి వచ్చింది. ఈ లోగా అమ్మ దగ్గరే శాశ్వతంగా ఉండిపోవాలని వచ్చేవాళ్లు కూడా ఎక్కువైనారు. ఇలా సంఖ్య పెరగ్గా పెరగ్గా కొందరు అన్నయ్యలు, అక్కయ్యలు కలసి ఆలోచించి "సాక్షాత్తు అమ్మ మనమధ్య ఉన్నపుడు ఇంకా వేరే చిత్రపటాలుఎందుకు? అనుకొని వేరే పటాలన్నీ తీసివేశారు. అమ్మ దేనినీ వద్దనలేదు. ఎవరినీ కాదనలేదు.

వచ్చేపోయేవారందరికీ తిండి, వసతి మాటేమిటి? మొదట్లో అమ్మే అందరికీ వండి పెడుతుండేది. నాన్నగారు తమకు ఉన్నంతలో పెట్టుపోతలకు అభ్యంతరం చెప్పలేదు. 1950-60 మధ్య అమ్మ నివాసం వద్దనే "అందరిల్లు" అవతరించింది. నాన్నగారి మీద బరువు పెరగడం న్యాయం కాదనుకొని ఇంటికి గుప్పెడు గింజల వంతున సేకరించి "అన్నపూర్ణాలయం" ప్రారంభించారు. అది అమ్మ ప్రేరణతో, స్ఫూర్తితో జరిగిన ఏర్పాటు. అన్నపూర్ణాలయం అంటే అమ్మ కోసంవచ్చే బిడ్డలకు భోజనం కోసం ఏర్పాటైన ప్రదేశం. ఇంచుమించు అప్పుడే అన్నపూర్ణాలయంతో పాటు మరొక ఆలయ నిర్మాణం కూడా మొదలైంది.

మరొక ఆలయం అంటే ? అది ఏమి ఆలయం ? అందులో ఏ దేవుని విగ్రహం పెడతారు ? నిర్మాణం ప్రారంభమైన తొలిరోజుల్లో ఈ రచయిత కుతూహలం కొద్దీ అమ్మను అడిగినప్రశ్నలివి. అమ్మ ఎప్పుడూ ఈ ప్రశ్నలకుసూటిగా సమాధానం చెప్పలేదు. కొందరు తమకు తెలుసు నన్నట్లుగా రామాలయమని అన్నారు. కొందరు రాజరాజేశ్వరీ ఆలయం కావచ్చేమోనని సందేహంగా చెప్పారు. అమ్మను అప్పట్లో చాలామంది రాజరాజేశ్వరి అవతారంగా భావిస్తుండేవారు. కాలం గడుస్తున్న కొలది అమ్మ ఆంతర్యం జిల్లెళ్ళమూడి లోని వారికి అక్కడి వస్తూ పోతూ ఉండే వారికి అవగతం కాసాగింది. నాన్నగారు ఆలయం ప్రవేశం చేసి, అర్ధభాగం చోటును ఆక్రమించినప్పుడు అది ఏమి ఆలయమో అందరికీ తెలిసిపోయింది.

చిన్నప్పుడు దేవాలయాలకు వెళ్ళి కూడా పూజలు చేయని చేయించని అమ్మ పూజలకు వ్యతిరేకం కాదు. తనకు ఎవరైనా పాదపూజలు చేస్తామంటే వద్దనలేదు. పూలు వేస్తే కాదనలేదు. తమలపాకులతో అర్చన చేస్తే ఎందుకు

అనలేదు. అసలు అమ్మ ఏ పూజ వద్దన్నది కనుక ! ఒక మహానుభావుడు దురదగుండ ఆకు తెచ్చి అమ్మ పాదాలకు పూజ చేశాడు. అతడెవరో అమ్మకు ఎరుక. ఎవరెవరో వచ్చి అమ్మకు ఎదురుగా కూర్చుని పాదపూజ చేసి వెళుతుంటే ఇతరులు తమ తొందరలో తాము ఉండి అమ్మపాదాలపై ఎవరు ఏమి చేస్తున్నారో అంతగా పట్టించుకొనేవారు కాదు. దురదగొండి ఆకు తన ప్రతాపాన్ని చూపించింది. అమ్మ పాదాలు ఎర్రగా కందిపోయి, దద్దుర్లు లేచాయి. అయినా అమ్మ మాట్లాడలేదు. అమ్మ పాదాలను ఆ స్థితిలో చూచినవాళ్లు గగ్గోలు పెట్టారు. అలాంటి ఘోరం చేసింది ఎవరంటే అమ్మ సమాధానం చెప్పలేదు. "తల్లికి తప్పే కనిపించదు" అన్న అమ్మ ఎవరిని నిందిస్తుంది? ఎవర్నైనా ఎవ్వరైనా నిందించడాన్ని కూడా అమ్మ భరించలేదు. తన బాధని తాను అనుభవిస్తూ ఇతరుల బాధలను కూడా వీలైనంత వరకు భరించటం అమ్మకు అలవాటు. సోదరీ సోదరులు క్షమిస్తే మరొక మాటను కూడా ఇక్కడ చెప్పవలసి వుంది. అమ్మ "బడితెపూజ"ను కూడా నోరెత్తకుండా భరించింది. అలా చేసినవారి ఆనందానికి అమ్మ విఘాతం కలుగనివ్వలేదు. "ఆశ్చర్యకర వాత్సల్య" అనడానికి ఇంతకంటే మరొక నిదర్శనం ఎందుకు ! ఇంతకూ బడితెపూజ చేసిన మహానుభావులెవరని ఆలోచించకండి. అది అనవసరం. ఇక్కడ అమ్మ వాత్సల్యం ప్రధానంగాని, అవతలి వారి క్రౌర్యం కాదు. వారెవరైనా నిమిత్తా మాత్రులు.

అమ్మకు ఎందరో అన్నయ్యలు, అక్కయ్యలు సహస్రనామాలు పఠిస్తూ, పత్రాలతో ఇంకా ఎన్నో ద్రవ్యాలతో పూజ చేయడం చూశాం. అలా పూజలు జరుగుతున్నప్పుడు అమ్మ గంటల తరబడి నిశ్చలంగా ఉండిపోయేది. ఒక్కొక్కసారి నవ్వుతూ అందరిని పలకరిస్తున్నట్లు చూస్తుండేది. నిశ్చలస్థితిలో అమ్మ చేతుల కదలికను గమనించిన కొందరు ఆ కదలికలలో "ముద్ర"లను చూశారు. ఎప్పుడైనా ఒకసారి అమ్మ అలా పూజలు జరుగుతున్నప్పుడు తన పాదాలపై పడిన పూలను తీసి తుంచి తిరిగి తన పాదాలపై వేస్తుండేది. సహస్రనామాలపఠన సమయంలో నెమ్మదిగా వినపడీ, వినపడనట్లు గొంతు కలిపిన సందర్భాలు ఉన్నాయి. ఇది తనను తాను పూజించుకోవడం అవుతుందా ? ఆత్మపూజా?

తెలుగునాట నేడెందరికో పారాయణ గ్రంథమైన "శ్రీసాయి లీలామృతము" రచయిత శ్రీ ఎక్కిరాల భరద్వాజ అమ్మ తనపాదాలపై తాను పూలు వేసుకోడం

గురించి ఒకానొక వ్యాసంలో ఇలా చక్కని వ్యాఖ్యానం చేశారు. ("మాతృశ్రీ", 1965 ఆగష్టు నెల సంచిక).

"బిడ్డల రూపంలోని అమ్మ జిల్లెళ్ళమూడిలో చిన్న కుటీరంలో మంచం మీద కూర్చున్న తనకు పువ్వులూ, పళ్లూ రూపంలో వున్న తనతో తనకే పూజ చేసుకొంటూ వుంటే ఎలా వుంటుందో ఆమెకు అని నాకాలోచన వస్తుంటుంది. 'ఆత్మకు ప్రతిబింబమే జగత్తు' అన్నారు అమ్మ. అంటే ఎదుట వుంటే సర్వసృష్టిలోనూ తనను చూచుకోగలగడమే. అమ్మ దీన్ని ఒకసారి బింబ ప్రతిబింబ న్యాయమని చెప్పినట్లు గుర్తు.

అంతా తానే అయితే తనకు తానే పూజ చేసుకోవడం ఏమిటి? అన్న ఆలోచన రాగానే వెంటనే యీ విషయం గుర్తుకు వచ్చింది.

విశ్వమంతా తన రూపమని అర్జునునికి విశ్వరూప సందర్శనం ద్వారా తెలియజేసిన భగవంతుడు, పరిమితమైన కృష్ణనిరూపంలో అర్జునునితో సంభాషించలేదా? అంతేకాదు.

"వృష్ణీనాం వాసుదేవోఽస్మి పాండవానాం ధనంజయః" అంటే, యాదవుల్లో వాసుదేవుడను నేను, పాండవుల్లో అర్జునుడను నేను అని శ్రీకృష్ణుడు అర్జునునితో చెబుతాడు!

అందుకే అమ్మ ఎప్పుడైనా తన పాదాలకు తానే పూజ చేసుకొంటుంటే, నేను చూస్తే –

'అహం క్రతురహం యజ్ఞ, స్స్వధాహ మహమౌషధమ్ ।
మన్త్రోహ మహమేవాజ్య మహమగ్ని రహం హుతమ్"

క్రతువు నేను, యజ్ఞం నేను, పితృదేవతలకు అర్పించే అన్నం నేను, ఔషధాన్ని నేను, మంత్రం నేను, హవిస్సును నేను, అగ్ని నేను, అగ్నిలో హుతమయ్యే హవిస్సునూ నేనే.

"రాజయోగాధ్యాయంలో కృష్ణుడు చెప్పిన మాటలను చేతలలో (అమ్మ) వ్యాఖ్యానిస్తోందా అనిపిస్తుంది."

సుప్రసిద్ధ విద్యావేత్త, శాస్త్రవేత్త, గ్రంథకర్త డాక్టర్ శ్రీ పాదగోపాలకృష్ణమూర్తి గారు అమ్మ బోధనలను జీర్ణించుకొన్న అగ్రజుడు మనకు. అమ్మ పూజలు చేయించుకోవడం గురించి ఆయన చేసిన వ్యాఖ్యను ఇక్కడ మనం జ్ఞాపకం

చేసుకోవడం సముచితంగా ఉంటుంది.

"మన అమ్మ పూజ చేయించుకొంటున్నట్లు కనిపిస్తోంది. కనుక ఆమె చేయించుకొంటున్నారనుకొంటున్నాం. నిజానికి పూజలు చేసేవారు చేసుకొంటున్నారు. అమ్మవారి యిష్టప్రకారం వారిని పూజలు చేసుకోనిస్తున్నారు. గుళ్లోని విగ్రహం పూజ చేయించుకొంటున్నాదా ? అలాగే అమ్మ. చీరెలూ,రవికెలూ ఇచ్చినవారికి ఆ చీరెలు, రవికెలూ ప్రసాదంగా ఇచ్చేస్తారు. పళ్లూ, కుంకుమ అందరికీ పంచేస్తారు.

"పూజచేసే వారు నమ్మిన దేవుడికి, దేవతకు పూజ చేసుకొన్నారనే తప్ప తనకు – అనగా బ్రహ్మాండం అనసూయమ్మగారికి – పూజ చేశారన్న జ్ఞాపకమూ, స్ఫురణా అమ్మకు లేవు. ఆమె ఎప్పుడన్నప్పటికీ 'పూజ చేసుకొనండి' అనే గాని పూజ చెయ్యండి' అనరు....."

శ్రీపాద అన్నగారు వ్యాఖ్యానించినట్లు అమ్మలో తమ ఇష్టదైవాన్ని చూచుకొన్నవారు ఇప్పుడు అమ్మ మన మధ్య భౌతికంగా లేరు గనుక అమ్మ విగ్రహంలో అమ్మని చూచుకోవలసి వస్తున్నది. అమ్మతో పాటు విగ్రహంలో కొందరు తమ ఇష్టదైవాన్ని కూడా చూస్తారేమో. అమ్మ వేరూ, తమ ఇష్టదైవం వేరూ అన్న భావన కొంతకాలం వరకే. క్రమంగా "వేరు" భావన తొలగవచ్చు. అందుకే "చూస్తారేమో" అనవలసి వచ్చింది.

అమ్మ అనేకసార్లు "నేనూ మీలాంటిదాన్నే" అనో, "మీరు కానిది నేనేమీ కాదు" అనో అనడం విన్నాం. అమ్మ తాను దైవమని పలికిన సందర్భాలు కూడా లేకపోలేదు. అలాంటి ఒక సందర్భం అమ్మ తన బిడ్డలతో అప్పుడప్పుడు చిన్న ఆటలు ఆడటం కద్దు. అలా ఒకసారి 'వైకుంఠపాళి' ఆడినప్పుడు అమ్మ మొదటి పందెం వేశారు. అప్పుడొక సోదరి "అమ్మదేవుడి పందెం వెయ్యాలి అన్నది. వెంటనే అమ్మ "దేవుడి పందెం ఏమున్నదీ, దేవుడే పందెం వేస్తుంటే ...." అన్నది.

అలా అన్నప్పుడు ఎవరైనా "అమ్మా నువ్వు, దైవత్వాన్ని ఒప్పుకొన్నట్టే గదా" అని అంటే ? అమ్మ బహుశ వెంటనే "మీరు మాత్రం కారా?" అని సమాధానమిచ్చి ఉండేవారు ! "నేను మీలో దైవత్వాన్ని చూస్తాను. మీరు నాలో మానవత్వాన్ని చూస్తారు" అని అమ్మ అనడం మనకు తెలిసినదే.

అమ్మ ఎవరి మనస్సుకు నచ్చిన పద్ధతిలో వారు ప్రార్థనో, అర్చనో, పూజో చేసుకోవచ్చునని చెపుతుండేవారు. "ఇలాంటివి నాకు ఇష్టం ఉండదు" అని అప్పట్లో (1960) నేను అమ్మతో అన్నప్పుడు "అవేమీ వద్దులే నాన్నా! నా దగ్గరొచ్చి కూర్చో. అన్నం పెట్టుకొంటా" అనడం గుర్తు. నాస్తికుడైన జొన్నలగడ్డ రామలింగయ్యగారికి అమ్మ ఆయనకు ఇష్టమైన నూకలఅన్నం వండించి పెట్టడం జ్ఞాపకం వస్తున్నది. ఏతావాతా చెప్పవచ్చిన దేమిటంటే ఎవరి పద్ధతిని వారు నిరభ్యంతరంగా కొనసాగించుకోవటానికి అమ్మ అవకాశం కల్పించింది. ఇది మతాలకూ వర్తిస్తుంది. అమ్మను అర్చించుకొన్న వారిలో హిందువులతో పాటు ముస్లింలు, క్రైస్తవులూ కూడా ఉన్నారు. జిల్లెళ్ళమూడిలోని 'అందరిల్లు" క్రిస్మస్ పండుగను కూడా ఘనంగా జరుపుతుంది. కొత్తగా పెళ్ళి చేసుకొన్న ముస్లిం జంటలు అమ్మ ఆశీర్వచనం కోసం వస్తుండేవారు. ఆశీస్సులు అందుకొని తృప్తిగా వెడుతుండేవారు.

కొందరు అమ్మని సంస్కృతంలో ప్రార్థిస్తే, మరికొందరు తెలుగులో కీర్తిస్తారు. ఇంగ్లీషులోనూ ప్రార్థనలు జరిగాయి. కొందరు ప్రశాంతంగా కూర్చుని అక్కడ ధ్యానం చేయడం ఉంది. అందుకే అమ్మ తపోవనం ఆలోచన చేశారు. మరి కొందరు ఆలయంలో అర్చన చేసుకోవడానికి ఇష్టపడతారు. కొందరికి భజనలు, గానం చేయడం ఇష్టం. అభిషేకాలు కొందరికి ఇష్టం. హైమాలయంలో పూజలకు, అభిషేకాలకు ఏర్పాట్లు ఉన్నాయి. అమ్మ ఆలయ ప్రవేశం చేసినతరువాత అక్కడ నిత్య పూజాదికాలు జరుగుతున్నాయి.

అమ్మ పుట్టిన మన్నవ గ్రామంలో ఇటీవలే (1995) అమ్మ ఆలయం ఏర్పడింది. ఇంకా అక్కడక్కడ ఆలయ నిర్మాణాలు జరుగుతున్నాయి. కొన్ని పూర్తయి ఉండవచ్చు.

కనీసం ఇరవై సంవత్సరాల క్రిందట అమ్మ నాతో "నాన్నా మన్నవలో నాకు ఆలయం కడతారట!" అంటే, అది నేను అమ్మ సరదాగా అన్నమాట అనుకొన్నా. ఇప్పుడది నిజంగానే జరిగింది. అమ్మే అన్నట్లు ఆమెది "తోలు నోరు కాదు గదా తాలు మాట రావడానికి!'

విగ్రహారాధన ఒక ఆధ్యాత్మిక సాధన మార్గం. అది నచ్చని వారు, తమదైన మార్గంలో సాధన చేసుకోవచ్చు. విగ్రహాన్ని పూజించేవారు. తాము రాతికి

పూజ చేస్తున్నామనుకోరు. శివాలయంలో ఆరాధన చేయడం అంతర్గర్భితమై ఉన్న ఆధ్యాత్మిక అన్వేషణకు చిహ్నమన్నారు గాంధీజీ. తన ఆధ్యాత్మిక తృష్ణను సంతుష్టిపరచుకోవడం కోసం మనిషి దేవాలయంలో ఆరాధన నిమగ్నుడవుతాడని బాపూజీ భావన.

విగ్రహారాధనం సాధకులకు దైవంపట్ల భక్తిని శ్రద్ధను పెంపొందిస్తుంది. విశ్వాసాన్ని గట్టి పరుస్తుంది. సత్ఫలితాలు కలుగుతూనే ఉంటాయి. కామితార్థాలు నెరవేరకపోతే కోట్లాది మంది విగ్రహాలను ఆరాధించరు గదా! ఆభరణాలూ, అలంకరణలూ విగ్రహాన్ని ఆకర్షవంతంగా చేస్తాయి. దృష్టిని ఆకట్టుకొంటాయి. కాని, విశ్వాసం విగ్రహాలను మహిమాన్వితం చేస్తుంది. అమ్మ విగ్రహాలూ అందుకు భిన్నమైనవి కావు. అమ్మ దేవాలయాలు ఎక్కడెక్కడ ఎన్నెన్ని వెలుస్తాయో ఊహించలేము. ఎక్కడ వెలసినప్పటికీ అవి అమ్మను నమ్మినవాళ్లలో అత్యధిక సంఖ్యాకులకు ఆరాధన స్థలాలు అవుతాయి. పుణ్యక్షేత్రాలుగా విలసిల్లుతాయి.

మనకేం కావాలో అమ్మకే తెలుసు

అనంతమైన శక్తి అమ్మ. అపురూపమైన వ్యక్తి అమ్మ. అమ్మ సృష్టినంతనూ తానుగా, తన బిడ్డగా దర్శించింది. "అందరూ మహానుభావులే. అందరూ అవతారమూర్తులే. తనకూ సృష్టికీ భేదం లేదని తెలుసుకోవడానికే సాధన. సృష్టి మారదు. మన దృష్టి మారాలి. జ్ఞానం అంటే ఈ సృష్టిని గురించి మన భావం మారడమే."

"తోచిందేదో చెయ్యి, తోపింపచేసేది వాడేగా", 'చేతలు మన చేతుల్లో లేవు", "తోచింది చెయ్యగలం కాని చెప్పింది చెయ్యలేం" మొదలైన అమ్మ మాటల్లో "ప్రేరణే దైవం" అనే భావం స్థిరంగా కన్పిస్తుంది. "నడిచే కాళ్ళు కన్పిస్తున్నాయి కాని, నడిపించే శక్తి కనిపించదు. చేసే ప్రతి పనీ దైవం చేయిస్తున్నాడనుకోవడం సుఖానికి మార్గం". ఇలా జీవితంలో ప్రతి సందర్భంలో మనకెంతో ఊరటను కల్గిస్తూ మనశ్శాంతిని ప్రసాదించే చిత్ గంగా ప్రవాహం అమ్మ మాటలు. ఉపనిషత్తుల సారాన్ని తేటగా, సూటిగా, తియ్యగా అదించడం అమ్మ ప్రత్యేకత.

సంసారంలో ఉంటూ అద్వైతాన్ని ఎలా సాధన చెయ్యాలి అని అమ్మను అడిగితే "కూతురును, కోడలిని ఒకేలా చూచుకో" అన్నది. సూదిలో ఎక్కించిన దారం రెండు దారాల్లా కనిపిస్తుంది. నిజానికి అది ఒకటే దారం. అలాగే ఈ సృష్టి కూడా. దీనిలో ద్వైతం కన్పిస్తుంది కాని, అంతా అద్వైతమే. బొమ్మా బొరుసు రెండుకలిస్తేనే నాణెం అంటాం. అరటిపండు చేత్తో పట్టుకుని "ఇది అద్వైతం నాన్నా. తొక్క సగం ఒలిచి ఇది విశిష్టాద్వైతం నాన్నా, తొక్క ఒక చేత్తో, లోపలి గుజ్జు ఒక చేత్తో పట్టుకుని ఇది ద్వైతం నాన్నా" అని త్రిమతాలను ఎంత తేలికగా బోధించిందో. జీవుడూ బ్రహ్మే అంటుంది అద్వైతం. జీవుడు చిదచిత్ విశిష్టుడు అంటుంది, విశిష్టాద్వైతం. జీవుడు వేరు, ఆత్మవేరు అంటుంది, ద్వైతం. ఈ మూడు మతాలు చూచేవారి మనస్సును బట్టి వేరే కాని ఏకత్వాన్ని దర్శించిన వారికి ఒకటే. భేదం వాదానికి పనికి వస్తుంది కాని వాస్తవం కాదు.

భాగవతంలో ప్రహ్లాదుడు వస్తు దృష్టి లేకుండా వాస్తవ దృష్టితో ఉండటం వల్లనే "పానీయంబులు త్రావుచున్, కుడుచుచున్, భాషించుచున్ ... సంతత శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సంధానుండై మరచెన్ సురారిసుతు డే తద్విశ్వమున్ భూవరా!" అంటాడు శుకమహర్షి.

అమ్మ భక్తుడికీ, జ్ఞానికీ భేదాన్ని ఎంత సూటిగా చెప్పిందో ! భగవంతుడు తప్ప ఏదీలేదు అనే వాడు భక్తుడు. తాను తప్ప ఇతరం లేదనే వాడు జ్ఞాని".

అమ్మ శాస్త్రాలను చదవలేదు. అసలు బడికే పోలేదు. గురువులు లేరు. ఏది చెప్పినా అనుభవం నుంచే చెప్పింది. "అనుభవం శాస్త్రాన్ని ఇస్తుంది కాని, శాస్త్రం అనుభవాన్ని ఇవ్వదు. వేదాంతం చదివితే వేదాంత భాష వస్తుంది. కాని ఆ అనుభవం రాదు" అంటుంది అమ్మ. ఏమీ చదవని అమ్మ చెప్పిన మాటలు, భావాలు ఉపనిషత్తులలోని జ్ఞానానికి అద్దం పడుతున్నాయి. "నాయమాత్మా ప్రవచనేన లభ్యః" (ఆత్మ జ్ఞానం ప్రవచనం వల్లరాదు)". యమేవైష వృణుతే తేన లభ్యః" (ఆత్మ ఎవ్వరిని వరిస్తుందో వానికే లభ్యం అవుతుంది.) ఆత్మజ్ఞానానికి ఇదే రాచబాట అనే గ్యారంటీ లేదు. తోచిన రీతిలో దైవం తోపింపజేసిన జపమో, ధ్యానమో, సంకీర్తనో చేస్తూ పోతే, ప్రేరణ రూపంలో దానంతట అది సిద్ధించవలసిందే. 'అందరికీ సుగతే' అని అమ్మ హామీ.

అమ్మకు స్వపర భేదం లేదు. జడ చేతన భేదం లేదు. కులమత భేదమే కాదు గుణభేదం కూడా లేదు. ఇంత మంచి అమ్మ, ఇంత గొప్ప అమ్మ అందరికీ అమ్మ. ఎందరికో ఆరాధ్యదైవం. కష్టాల్లో, భయాల్లో అమ్మ స్మరణ తారకమంత్రం. అమ్మ మాటలు కర్తవ్య బోధకాలు, శాంతి సంవర్ధకాలు.

అమ్మ లోకం మీద వర్షించిన వాత్సల్యం అంతులేనిది, అమ్మ అడ్డులేనిది. అమ్మ పసిపిల్లల్ని, పండు ముసలివాళ్ళను పరమప్రేమతో లాలించి పాలించింది. సర్వులనూ, సర్వాన్నీ సమ్మతించే అమ్మ ప్రేమ "నభూతో నభవిష్యతి".

అమ్మ మాటలు మంత్రాలు. వాటిని స్మరిస్తూ, ఆచరిస్తూ జీవితం గడపగలిగతే అది ఎంత అదృష్టయోగమో.

అమ్మ మాటలు అమ్మ స్మరణనూ, అమ్మ సన్నిధి సౌఖ్యాన్నీ కల్గిస్తాయని ఆశిస్తున్నాను. అమ్మ సన్నిధిని మించిన పెన్నిధి లేదు. అమ్మ దర్శన, స్పర్శన ఆలనాపాలనాదుల వల్ల ఇదివరలో సోదరీ సోదరులనుభవించిన సుఖశాంతులు – ఇప్పుడు అమ్మ స్మరణం వల్ల, అమ్మ మాటల మననం వల్ల పొందగలం. ఆ మాటల మహిమ అంతటిది. "నేను ఎప్పుడూ మీ వెన్నంటి ఉన్నాను" అన్న అమ్మ హామీ ఉండనే ఉన్నది. మనకు ఎప్పుడు, ఏమి ఎలా ఇవ్వాలో అమ్మకు తెలిసినట్లు ఇతరులకే కాదు, మనకూ తెలియదు. ఆ నమ్మకమే మనకు శ్రీరామరక్ష.

అక్షరాలా లౌకికవాదం

మన దేశంలో మతం, కులం అనే అంశాలు రాజకీయరంగంలో ప్రముఖపాత్రవహిస్తూ దేశాభివృద్ధి క్రమాన్ని ప్రభావితం చేస్తున్న వైనం ప్రతి ఒక్కరికీ తెలిసిందే. చాలా రాజకీయపక్షాలు కొన్ని ప్రత్యక్షంగా, మరికొన్ని పరోక్షంగా ఈ వైఖరిని ప్రోత్సహిస్తున్నాయి. తత్ఫలితంగా కలిగే మంచి, చెడులకు అవి బాధ్యతను వహించాలి.

భారత రాజ్యాంగ ప్రవేశిక ఇలా ప్రారంభమౌతోంది: "భారతదేశ ప్రజలమైన మేము భారతదేశాన్ని సర్వసత్తాక, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్రరాజ్యంగా నిర్మించు కోవటానికి....."

1976లో రాజ్యాంగ సవరణ ద్వారా 'సామ్యవాద', 'లౌకిక' అనే పదాలు

ప్రవేశికలో చోటు చేసుకున్నాయి. ప్రవేశిక వివరించే అనేక అంశాల్లో 'సాంఘిక సమానత్వం' ఒకటి.

ఆ విధంగా దేశప్రజల మనోగత ఉన్నత భావాల్ని, ఆశయాల్ని మన రాజ్యాంగ రచయితలు ఆలోచన చేయటానకి ఎంతో ముందుగానే జిల్లెళ్ళమూడిలో అమ్మ తనదైన రీతిలో వాటిని ఆచరణలో పెట్టడం ఆరంభించింది. ఆ మార్గంలో ఎన్నో అడ్డంకులు ఎదురైనా విజయాన్ని సాధించింది.

సామాన్యుని దృష్టిలో 'సాంఘిక సమానత్వం' అంటే అందరికీ సమాన హోదాను కల్గించడం. అందరికీ అన్నం పెట్టడం అమ్మ తొలి ప్రాధాన్యతాంశం. అయితే మలిప్రాధాన్యతాంశం ప్రతివ్యక్తి యొక్క ఔన్నత్యాన్ని, ఆత్మగౌరవాన్ని పరిరక్షించడం.

స్వపరభేదం లేక అందరినీ ప్రేమ, ఆప్యాయతలతో ఆదరించడం, బాల్యం నుంచీ అమ్మ స్వభావం. కారణం అందరూ తన బిడ్డలే అనే మహోన్నత మాతృత్వ భావన. సాంఘికపరంగా కానవచ్చే కుల మత వర్ణ వర్గ వివక్షత అమ్మకు లేదు. ఎందరో ప్రముఖులు అమ్మను దర్శించుకునేవారు. ఆ సమయంలో అమ్మ వారి బంట్రోతులను, డ్రైవర్లను కూడా పిలిపించి వారి సరసన కూర్చుండ బెట్టేది; అందరికి గుడ్డలు పెట్టి ఆనందించేది. సమానంగా అందరిపై వాత్సల్య గంగను వర్షించేది. ఒకసారి తమిళనాడు నుంచి, రోడ్డు వేయడం, మురుగు కాల్వత్రవ్వడం నిమిత్తం పనివాళ్ళు వచ్చారు. వాళ్ళకి వంటినిండా కప్పుకోవడానికి గుడ్డలు కూడా లేవు. అమ్మను గూర్చి విని చూడటానికి వచ్చారు. ఆ క్షణంలో అమ్మ దగ్గర వున్న నన్ను పిలిచి తన బట్టల బీరువాలోంచి గుడ్డలు తీసుకురమ్మన్నది. అక్కడ కొన్ని విలువైన పట్టుబట్టలు మాత్రమే ఉన్నాయి. ఆ మాటే అమ్మకు నివేదించాను. వెంటనే స్వయంగా అమ్మ వెళ్ళి కొన్ని పట్టు చీరెల మూటను తెచ్చి వారికి పంచింది. ఆ అదృష్టవంతులు ఆనందంతో ఆశ్చర్యంతో నిశ్చేష్టులైనారు. వాళ్ళ మనస్సు, తనువు పులకరించాయి. అమ్మ మనస్సు పరవశించింది. 'ఖరీదైన ఆ గుడ్డల్ని వాళ్ళు అమ్ముకుంటారు కానీ కట్టుకోరు' అని కొందరు అంటే సూటిగా సూటుగా అమ్మ "అయితే ఏం?" అని ప్రశ్నించింది. అమ్మ దృష్టిలో ఖరీదైన

చీరెలూ మామూలు చీరెలూ అనే భేదం లేనట్లే పేదవారూ, గొప్పవారూ అనే భేదమూ లేదు.

మనుషలనూ వస్తువులనూ అమ్మ మతాలకు అతీతంగా చూచింది. అది ఒకరి వద్ద ఒక చోట నేర్చుకున్నది కాదు - సహజాతం; బాల్యం నుంచీ వున్నది. వేదాంతము, నిగమాగమసారం ఈ భారతభూమిలో లౌకికవాదాన్ని ప్రబోధించింది. అది ఎవరినీ ఒక నిర్దిష్టమైన నమ్మకాన్ని కలిగి ఉండమని కానీ, ఒకేరకమైన ఆరాధనా మార్గాన్ని ఎంచుకోవాలని కానీ, వారి వారి విశ్వాసాల్ని మార్చుకోమనీ కానీ కోరదు; ప్రేరేపించదు. వ్రతాలూ, పూజలూ, అభిషేకాలూ, కీర్తనలు, ఉపాసనలూ, ఉపవాసాలు, ధ్యానం, యోగం, తపస్సు, యజ్ఞయాగాదులూ... ఇలా భగవంతుని ఆరాధించడానికి అనేకానేక మార్గాలను ఐచ్ఛికంగా ఎంచుకోవడానికి అనుమతిస్తుంది. అమ్మ ఎన్నడూ ఎవరినీ వారివారి మతపరమైన ఆచారాలూ, పద్ధతులూ, విశ్వాసాల గురించి విచారించలేదు, జోక్యం చేసుకోలేదు.

"సర్వసమ్మతమైనదే నా మతం" అని తెల్పింది; బాల్యంలోనే గుడులు, చర్చీలు, మసీదులను సైతం సందర్శించింది. ఒకసారి తాను 'నమాజ్' చేశానని తెల్పింది. మనమంతా తారకమంత్రంగా భావించే 'జయహోమాతా శ్రీ అనసూయా రాజరాజేశ్వరి శ్రీ పరాత్మరి' నామానికి ఒక ముస్లిం సోదరుడు రూపకల్పన చేశాడు. 'రహి' అనే మరొక ముస్లిం సోదరుని అమ్మ ఎంతో ఆదరణ, ఆప్యాయతలతో లాలించింది. ఆతని గురించి మనకి అంతగా తెలియదు. తొలిరోజుల్లో జిల్లెళ్ళమూడి వచ్చే పోయే సోదరులు చెపుతారు. రహి ఎంతగా అమ్మను ఆరాధించాడంటే ఆ గ్రామంలో అమ్మకోసం, అమ్మ కుటుంబం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోదాత్తచరితుడని అంటారు.

క్రిస్మస్ పండుగని, డిసెంబరు 31తేదీ రాత్రి 12 గంటలకు నూతన సంవత్సర ఆహ్వాన వేడుకలను అమ్మ సంక్రాంతి, దసరా పండుగల తరహాలో క్రమం తప్పక ఉత్సాహంగా జరిపేది.

వాత్సల్య యాత్రలో భాగంగా 1970లో అమ్మ హైద్రాబాద్ విచ్చేసినపుడు క్రైస్తవ మతసంస్థలు యాజమాన్యంచే నిర్వహించబడే ఆస్పత్రులు,

వృద్ధాశ్రమాలకు వెళ్ళింది. అక్కడి రోగులు, ఆశ్రమవాసులు, వైద్యులు, సిస్టర్స్, సిబ్బంది అంతా ఆర్ద్రహృదయాలతో అమ్మను ఆహ్వానించారు. అమ్మ దర్శనంతో వారి ముఖాలు విస్ఫారిత సహస్రదళ కమలాలు కావడం అమ్మను అనుసరించిన మా అనుభవం. జిల్లెళ్ళమూడి సౌభ్రాతృత్వాన్ని పుడికి పుచ్చుకొని అమ్మను ఆరాధించే క్రైస్తవ సోదరీసోదరులు ఎందరో మన దేశంలోనూ, కొందరు విదేశాల్లోనూ ఉన్నారు.

'సామాజిక న్యాయం' అనే మాట మనకి రాజకీయరంగంలో ఎక్కువగా వినిపిస్తుంది. దాని సారం ఏమంటే అందరికీ అధికార యంత్రాంగంలో సమానావకాశాలు ఉండాలి అని. జిల్లెళ్ళమూడిలో అమ్మ స్థాపించిన అందరింట్లో, అధికారం, పరిపాలన, రాజకీయం అనే మాటలకు తావే లేదు. అమ్మ శరీరంతో ఉన్న రోజుల్లో అమ్మ సన్నిధిలో ఉండటమే ఆవరణలోని అందరి ఏకైక లక్ష్యం, ఆకర్షణ. అట్టి అవకాశాన్ని అమ్మ బడుగువర్గాల వారికి విస్తృతంగా కల్పించింది. అట్టి వారిలో మంత్రాయి, సుబ్బయ్య, హరిదాసు, కృష్ణవేణమ్మ, నంబులు, గజేంద్రమ్మ కొందరు. వారంతా తమ జీవితాల్ని అమ్మ సేవలో త్యాగం చేసినవారే. అంతేకాదు. వారంతా అమ్మకు అత్యంత సన్నిహితులంటే ఆశ్చర్యం కాదు. వారి అనుభవాల్ని అధ్యయనం చేస్తే లౌకిక తత్వసాధనలో అమ్మ అధిగమించిన సుడిగుండాలు, అగ్నిపరీక్షలు సువిదితమౌతాయి సనాతన ఆచార వ్యవహారాల పట్ల అమ్మ శిష్టాచార దూర ప్రవర్తనా వైఖరి అమ్మ బంధువులలో కొందరికి కటువుగా ఉండేది. కానీ వారందరికీ అమ్మ నెలకొల్పిన విశ్వకుటుంబక నవీన వాతావరణానికి సర్దుబాటు చేసుకోక తప్పలేదు.

"శుక్లశోణితాలకేదికులమో అదే నా కులం" అనీ; గుణభేదమే లేని నాకు కులభేదమేమిటి ?" అనీ అమ్మ తన సర్వసమానదృష్టిని విశదీకరించింది. అది అపూర్వమైనది. కులమతాల్ని విస్మరించి, విసర్జించి వందల వేలమంది రోజూ జిల్లెళ్ళమూడిలో బారులు తీరి సహపంక్తి భోజనం చేయడం ఒక సర్వసాధారణ విషయం. 1973లో అమ్మ స్వర్ణోత్సవాల సందర్భంగా ఒక లక్షమందికి ఒకే సమయంలో, ఒకే పంక్తిన, ఒకే షామియానాల కప్పు క్రింద అమ్మ అన్నం పెట్టింది; ఆనందించింది. శిష్టాచార పరాయణులైన

విప్రులు, ధనికులు, అనేక కులాల, మతాల వారు ఎందరో ఆ సందర్భంగా ఏకోదర బాంధవ్యాన్ని రుచిచూచారు; మాతృప్రేమ రసామృతాన్ని పొందారు.

ఆ విధంగా అమ్మ మనకు అందించే మహత్తర సందేశం 'విశ్వమానవ సౌభ్రాతృత్వభావన'; అంటే మన అన్నయ్యలు, అక్కయ్యలు జాతిపేరున, కులంపేరున వివక్షను విసర్జించడం కారణం మనం అంతా ఆ తల్లి పిల్లలం. జిల్లెళ్ళమూడిలో 'కులం', 'మతం' అనేవి అసంబద్ధమైన అంశాలు;

ఆచరణలో లౌకికత్వం అదే
క్రియారూప సమసమాజం అదే
సామాజిక న్యాయసాధన అదే - అక్షరాలా.

నేను 'అమ్మ'ను

జిల్లెళ్ళమూడి అమ్మ ఎవరు ? ఒక అలౌకిక శక్తి సంపన్నా ? ప్రవక్తా ? అవతారమూర్తా ? రాజరాజేశ్వరియా ? లేక శ్రీ మన్నవ సీతాపతి రంగమ్మగార్ల కడుపున పుట్టి, జిల్లెళ్ళమూడి కరణం గారైన శ్రీ బ్రహ్మాండం నాగేశ్వరరావుగారిని వివాహం చేసుకున్న ఒక సాధారణ స్త్రీయా ?

అర్థ శతాబ్దికాలంగా జిల్లెళ్ళమూడి వెడుతున్న నాకు వినిపించే ప్రశ్నలు ఇవి. ఇందులో కొన్ని ప్రశ్నల్ని నేనూ వేసుకున్నాను. ఈ సామాన్య రచయిత నుండి విదేశీ రచయితలైన అమెరికా దేశవాసి రిచర్డ్‌షిఫ్‌మన్ వరకు; ఒక సామాన్య జిల్లెళ్ళమూడి గ్రామ నివాసి నుండి డాక్టర్ శ్రీపాదగోపాలకృష్ణమూర్తి గారు వంటి మేధావుల వరకు, మన్నవ గ్రామ పరిసరాలలోని అవధూత శ్రీ రఘువరదాసుగారి నుండి కుర్తాళం పీఠాధిపతులు సిద్ధపురుషులు శ్రీ మౌనస్వామి వారి వరకు... అందరూ తమ సహజరీతిలో ఈ ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ప్రయత్నించారు. వారి దృక్పథాలు విభిన్నమైనవి, పరస్పర విరుద్ధములైనవి కూడా. అయినా వారందరి అభిప్రాయాలు కలిసే చోటు ఒకటి ఉంది. ఆమె 'అందరి అమ్మ' అనీ, మూర్తీభవించిన ప్రేమ అనీ అంటే ముక్తకంఠంతో అంతా అవునంటారు. ఆమెను దేవతా స్వరూపాలుగా వర్ణించడంలోనూ అన్వయించడంలోనూ అభిప్రాయభేదాలు ఉండవచ్చు ఉన్నాయి.

ఆధ్యాత్మిక సాధనల ద్వారా అతీంద్రియ జ్ఞానంగాని, శక్తులు గాని తనకు ప్రాప్తించాయని అమ్మ ఎన్నడూ చాటుకోలేదు. శివసాయిబాబా, ఒక రమణమహర్షి వంటి అమ్మను ఒక అతిమానుషశక్తి సంపన్నగా నిర్వచించలేము. భక్తులు అమ్మలో కొన్ని దివ్యశక్తులను దర్శించారు. కానీ ఎవరూ నిర్ద్వంద్వంగా అమ్మని మానవాతీతమహిమోపేతగా చెప్పలేదు. ఆమె దివ్యశక్తి సంపన్నా? అనే ప్రశ్నకి భక్తులందరికి ఆమోదయోగ్యంగా సమాధానం దొరకలేదు. అమ్మ స్వయంగా, "అలాంటివేమీ నాకు తెలియదు" అని చెప్పింది. కనుక ఆమెను 'అతిమానుషశక్తి సంపన్న' అనటం సరియైనది కాదు.

1960 లో 'గుంటూరు వాణి' వారపత్రిక ప్రారంభ సంచిక లో 'బుద్ధుడు, జీసస్, అమ్మ' - అనే నా వ్యాసం ప్రచురితమైంది. జీసస్ ఒక ప్రవక్త; కానీ బుద్ధుని కొందరు అవతారమూర్తిగా పేర్కొన్నారు. ప్రవక్తల పరంపరలో ఆఖరి ప్రవక్తను దర్శించాం కాబట్టి మరోప్రవక్త పుట్టాడని విషయాన్ని ఇతరమతాల్లో ఎక్కువమంది అంగీకరించరు. కనుక ఆమెను ఒక ప్రవక్తగా అభివర్ణించడం సాధ్యం కాదు. శ్రీ కృష్ణుడు 'అమ్మ'గా పుట్టాడని విశ్వసించే వారు కొందరున్నారు. గుంటూరు జిల్లా రేపల్లె సమీపంలోని సింగుపాలెంకు చెందిన శ్రీ యార్లగడ్డ రాఘవయ్యగారు 'అమ్మ కృష్ణపరమాత్మ రూపమే మరేదీ కాదు' అంటూ పూజిస్తూ ప్రస్తుతి చేస్తూంటే, అమ్మ ఆ గానామృతాన్ని గ్రోలింది; వారి దర్శనాన్ని అంగీకరించనూలేదు, తిరస్కరించనూలేదు. సహజంగా వారిని దగ్గరకు తీసుకొని ప్రేమామృతవృష్టిని కురిపించింది. అంతే.

పురాణసాహిత్యం అంతా అవతారాల గాథలను వినిపించింది. అవతారం అంటే అసహాయులను ఆదుకోవటానికి, దుష్టులను శిక్షించటానికి సర్వోన్నతమైన దైవం దిగిరావటమే. అట్టి అవతారాలు పది అనీ, కడపటిది కలియుగంలో అవతరించనున్న కల్కి అవతారం అనీ వైదిక వాఙ్మయం తెలియచేస్తున్నది. కానీ అమ్మ జీవితంలోని ఏ అంశమూ కల్కి వర్ణనకి అనుగుణంగా లేదు. అమ్మ తత్వం ప్రకారం ఒక వ్యక్తిని శిక్షించడం అనే ప్రసక్తే లేదు. ఏమంటే 'తల్లికి తప్పే కనపడదు' అని తన స్వభావాన్ని వివరించింది. కావున 'అమ్మ అవతారమూర్తి' అని అనటం సరైనది కాదు. చిరకాలంగా తాము ఆరాధిస్తున్న దేవతామూర్తులను కొందరు అమ్మలో దర్శించారు. తాను ఒక దేవత అవతారం అని అమ్మ ఎన్నడూ

చెప్పలేదు; అయితే వారి వారి ఇష్టదైవాలుగా తనను పూజిస్తూంటే అందుకు అభ్యంతరమూ చెప్పలేదు.

1923వ సంవత్సరంలో మన్నవ గ్రామంలో అమ్మ జన్మించటానికి కొన్ని నెలలు ముందు ఒక ప్రాచీన విష్ణ్వాలయం శ్రీ చెన్నకేశవస్వామి వారి ఆలయంలో రాజరాజేశ్వరీ యంత్రాన్ని ప్రతిష్ఠించారు. (కొన్ని అలౌకిక చిత్రాలు, జ్యామిత్రీయ ఆకారాలు, అక్షరాలు చెక్కబడిన ఒక తామ్ర ఫలకాన్ని సాధారణంగా యంత్రం అని అంటారు. దానికి అసాధారణ శక్తులు కలవని నమ్ముతారు.)

ఆ సంఘటన అనంతరం అచిరకాలంలో ఆ గ్రామంలో కొన్ని వారాల తేడాతో ముగ్గురు బాలికలు జన్మించారు. అందు ఇరువురికి 'బాలాత్రిపురసుందరి' అనీ, మూడవ బాలికికి 'అనసూయ' అనీ నామకరణం చేశారు. రాజరాజేశ్వరి, బాలాత్రిపురసుందరి అనే పేర్లు ఆదిశక్తి దివ్యరూపమైన లలితాదేవి సహస్రనామాలలోనివి. ఆ ముగ్గురూ రాజరాజేశ్వరీ అమ్మవారి ఆశీఃఫలం అని గ్రామస్థులు అనేకులు విశ్వసించారు. ఆ ముగ్గురూ బాల్యసేహితురాండ్రు. కానీ పుట్టుకనుంచీ అమ్మ సందర్భంలోనే అసాధారణ సంఘటనలు జరిగాయి. మిగిలిన ఇద్దరూ తమ కంటే అనసూయ విలక్షణమైన అమ్మాయి అని తెలుసుకున్నారు; కానీ పసితనం కారణంగా వారకి తమ స్నేహితురాలి అలౌకికలక్షణాల్ని అర్థం చేసుకునే జ్ఞానం, శక్తి లేకపోయాయి. ఆ ఇరువురు అనంతర కాలంలో సామాన్య గృహిణులుగా కాలం గడిపారు. ఆ ముగ్గురిలో చివరామె శ్రీమతి పెద్దిరాజు బాలాత్రిపురసుందరి ఈ రచయిత అత్తగారు; ఆమె 2009 ఫిబ్రవరిలో కన్నుమూశారు.

అమ్మ అసాధారణ శక్తుల్ని గురించి గ్రామస్తులు చాలామందికి తెలుసు, కానీ వాటిని అర్థం చేసుకోలేకపోయారు. అవి పురాణాల్లో వలె వీధి నాటకాల్లో ప్రదర్శించే భారత భాగవతాల్లోని అద్భుతాలుగా ఉండేవి కావు. అంటే గోవర్ధనోద్ధరణం, నరకాసుర సంహారం. వంటి మాహాత్మ్యాలు కావు. ఆసక్తికరమైన విషయం ఏమంటే అమ్మ తన మూడేళ్ళప్రాయంలోనే 'ఆలయంలో ప్రతిష్ఠించబడిన యంత్రం రాజ్యలక్ష్మి యంత్రం కాదు, రాజరాజేశ్వరీ యంత్రం' అని స్పష్టం చేసింది. పసితనంలో తెలిసీ తెలియక అన్నమాటలుగా గ్రామస్థులు

అమ్మ మాటల్ని త్రోసి పుచ్చారు; అది రాజ్యలక్ష్మీ యంత్రమే అనే నిశ్చితాభిప్రాయంతోనే ఉన్నారు. 30 సంవత్సరాల తరువాత ఒకానొక కార్యక్రమాన్ని పురస్కరించుకొని యంత్రంమీది గుర్తులు, బీజాక్షరాల్ని చూపించి, లోగడ బాల్యంలో తాను చెప్పినట్లుగా వాస్తవంగా అది 'రాజరాజేశ్వరీ యంత్రమే' నని అమ్మ ఋజువు చేయడంతో గ్రామస్థులు ఆశ్చర్య చకితులయ్యారు. సుప్రసిద్ధ సిద్ధపురుషులు తమిళనాడులోని కుర్తాళం పీఠ వ్యవస్థాపక పీఠాధిపతులే ఆ యంత్రాన్ని ప్రతిష్ఠించారు. అమ్మకు ఏలా తెలిసింది? ఏమో ! కానీ అమ్మ తాను రాజరాజేశ్వరీ అవతారం అని ఎన్నడూ చెప్పలేదు; రాజరాజేశ్వరిగా తనను కొలిచే వారిని తాను రాజరాజేశ్వరిని కాను అని అభ్యంతరమూ చెప్పలేదు. వారి వారి ఇష్టదైవాలుగా భావించి అమ్మను ఆరాధించేవారెవరినీ అమ్మవారించనూ లేదు. కాబట్టి రూఢిగా 'ఆమె రాజరాజేశ్వరి' అని అనటానికి ఏ ప్రమాణం లేదు.

తాను మన్నవ సీతాపతి, రంగమ్మ దంపతుల కుమార్తెననీ, బ్రహ్మాండం నాగేశ్వరరావుగారి భార్యననీ అమ్మ మరల మరల నొక్కి వక్కాణించింది. తర్వాతకాలంలో ఒకామె వచ్చి అమ్మను అనుకసరిస్తూ సర్వశక్తుల్నీ అమ్మ తన శరీరంలోకి శక్తిపాతం చేసిందని, కనుక అమ్మ మహిమాన్వితశక్తులన్నీ తనను చేరుకున్నాయని ప్రచారం చేసేది. ఆమెను దృష్టిలో పెట్టుకొని అమ్మ, "ఆమె నావలె ఇపుడు బ్రహ్మాండం నాగేశ్వరరావుగారి భార్య కూడానా ? అని నవ్వుతూ అనేది. ఆ ప్రశ్నతో బహుశా "అమ్మ"ని అని అంటున్న ఆమె నిరుత్తర అయి ఉంటుంది.

వాస్తవానికి అమ్మ ఒక గృహిణిగా జీవించింది. అంతేకాదు. అందరికీ తల్లినని ఆచరణాత్మకంగా ప్రబోధించింది. పురాణగాధల్లో గానీ, నవనీకాలంలో గానీ అందరినీ తన సంతానంగా చాటి అక్షరాలా ప్రేమించిన వాత్సల్యయమూర్తి అమ్మ తప్ప మరెవరూ లేరు. కావున ఇతఃపూర్వం చెప్పుకున్న ఏ నిర్వచనానికి, వర్ణనకి అమ్మ సరిపోలదు. అంటే అమ్మ ఒక మానవతీతమైన శక్తికాదు, ప్రవక్త కాదు, రూపుదాల్చిన రాజరాజేశ్వరి కాదు, అవతారం కాదు. కానీ ఇందులో ఏదీ కానపుడు – పొత్తిళ్ళలో పసిపాపగా ఉన్న ప్రాయం నుంచీ తన పార్థివ శరీరాన్న పరత్యిజించేవరకూ వందలవేల భక్తులు ఆమెలో దైవత్వ భావంతో

అన్నినాళ్ళూ అనుభవించిదేమిటి ? కొందరు సోదరులు అమ్మను అసాధారణ మానవ లక్షణాలు గల మహోన్నతవ్యక్తిగా సంభావన చేస్తే అమ్మ, "నేను మీలో దైవత్వం చూస్తాను. మీరు నాలో మానవత్వం చూస్తారు" అని వ్యాఖ్యానించింది. దైవత్వం అంటే ఏమిటి? నేను అమ్మను గురించి వ్రాసిన మొదటి వ్యాసంలో యాదృచ్ఛికంగా ఆమె వాక్యాల్ని 'దేవతా వాక్కు' అని అభివర్ణించాను. షది చదివి నవ్వుతూ అమ్మ "నాన్నా! ఈ రకంగా పోల్చడానికి నువ్వు ఏ దేవతనైనా చూశావా?" అని అడిగింది.

జిల్లెళ్ళమూడి భక్తులమైన మనందరం అమ్మను ఒకే రకంగా దర్శిస్తున్నామా? లేదు; అందరం ఒకే విధంగా ప్రార్థిస్తున్నామా ? లేదు; అందరి ప్రార్థనలూ ఒకటేనా? కాదు; ఇంత వైవిధ్యం వైరుధ్యం ఉన్నప్పటికీ ఆ మూర్తిని అందరం "అమ్మా!" అనే పిలుస్తాం. ఆ దివ్య మాతృమూర్తి ప్రేమానురాగాల్ని సమానంగా అనుభవించాం అందరం.

ఏ ప్రేరణ వలన మనందరం జిల్లెళ్ళమూడి వెడుతున్నాం ? ఆమె కానీ, ఆమె తరఫున ఎవరైనా కానీ మీకు లేఖ వ్రాశారా ? లేక ఆమె ఎవరిద్వారానైనా కబురు పంపారా ? లేదే ! ఆ ప్రశ్న నాకు నేనే వేసుకున్నాను. అమ్మ వైపు నన్ను ఆకర్షించినదేమిటి ? అనే నా ప్రశ్నకు నేటివరకూ కూడా సహేతుకమైన వివరణ ఇవ్వలేకున్నాను. సరిగా ఇక్కడే 'విశ్వాసము' అనే క్షేత్రంలోకి అడుగుపెట్టాను. న ఇష్టానుసారం గానే ఆమె వద్దకు వెళ్ళానా? లేక ఏదోరకమైన ఆసక్తి నన్ను ఆమె వద్దకు నడిపించిందా ? మొదటిసారిగా జిల్లెళ్ళమూడి వెళ్ళినపుడు కవులు, రచయితలు, మహామేధావుల సమూహంలో ఉన్నాను. అందులో ప్రతి ఒక్కరి జిజ్ఞాస ఒకటే కాదు. నా ఇచ్ఛానుసారం గానే తొలియాత్ర సంభవించిందని ఆ సమయంలో కూడా నేను సమాధాన పడలేదు. అనేకానేక సందర్భాల సామూహిక ప్రభావమే నన్ను నడిపింది అని నాలో నేను తర్కించుకుంటున్నాను; అయినా దానిపైనా అదుపాజ్ఞలు లేవు. ఆస్తికునికీ నాస్తికునికీ జిజ్ఞాసే సామాన్య లక్షణం. కనుకనే ఆమె అతీంద్రియశక్తులు, అతిమానుష ప్రజ్ఞ గురించి పట్టించుకున్నాను; నా అంతట నేను కాని అక్కడి వారు చెప్పే గాథల నుంచి కానీ వాస్తవాన్ని తెలుసుకోవాలనుకున్నాను; ఆమె ప్రతిచర్య, ప్రతి కదలికను గమనిస్తున్నాను. ఆమె ప్రగాఢమానవత్వ ప్రకంపనలకి,

మానవాతీత చర్యలను చూచి చలించిపోయాను. మనలో ఏ ఒక్కరి వలె ఆమె ఆహారం తీసుకోదు; కానీ ప్రతి ఒక్కరు తృప్తిగా భోజనం చేసేట్లు చూసేది, చేసేది.

నివేదనగా తనకు తెచ్చిన పదార్థరుచిని చూసేది. అంతే. శరీరానికి సరిపడు శక్తిని కెలోరీల పరంగా చూస్తే అది ఆహారం కానే కాదు. మంచినీళ్ళు, రోజూ 1, 2 సార్లు కాఫీ త్రాగేది. తలనొప్పి, జ్వరం, వళ్ళునెప్పులు వంటి అస్వస్థత కోసం హోమియోమాత్రలు, అలోపతి మందుబిళ్ళలు అడిగేది. ఉన్నంతకాలం, అన్నికాలాల్లోనూ, జ్వరం, వంటినొప్పులు వంటి అస్వస్థత కోసం హోమియోమాత్రలు, అలోపతి మందుబిళ్ళలు అడిగేది. ఉన్నంతకాలం, అన్నికాలాల్లోనూ, జ్వరం తవ్రంగా ఉన్న రోజుల్లో కూడా, ప్రతిరోజూ అనేకసార్లు స్నానం చేసేది. స్నానం చేయటం ద్వారా ఆమె శక్తిని పొందేదా ? ఏమో ! కాని అలా అని ఋజువుచేయటానిక దారి ఏదీ లేదు. భారతదేశ నాస్తికోద్యమ మహానాయకులు శ్రీ గోరా గారిని కలుసుకుని అమ్మను గురించి మాట్లాడే అవకాశం ఒకసారి నాకు కల్గింది. ఆహారం తీసుకోకుండా మనిషి జీవించగలిగే స్థితి గురించి మాట్లాడాను. అది మెలాంకోలియా అనే మానసిక రుగ్మత కావచ్చునని గోరా అన్నారు.

కానీ చిత్తభ్రమ, నైరాశ్యము, తీవ్రవ్యాకులత వంటి ఆవ్యాధి లక్షణాలు అమ్మలో లేనే లేవు. పైగా అనేక సంసార కష్టనష్టాలతో క్రుంగి పోయి తీవ్ర మానసిక రుగ్మతతో ఆమె వద్దకు వచ్చిన అనేకులు పూర్ణ స్వస్థత చెంది, కడిగిన ముత్యాల్లా, తృప్తి సంతోషం వారి కళ్ళలో వెల్లి విరుస్తుండగా మరలి వెళ్ళేవారు.

ఒకసారి హేతువాది మానవతావాది అయిన శ్రీ జొన్నలగడ్డ రామలింగయ్య గారు జిల్లెళ్ళమూడి వచ్చారు. మానవాతీత శక్తుల పట్ల వారికి నమ్మకం లేదు. వారికి నూకలతో అన్నం వండించి పెట్టింది అమ్మ. ఆ పదార్థం అంటే తనకు ఇష్టమని, అమ్మకు ఎలా తెల్లిసందోనని వారు ఆశ్చర్యపోయారు. అనేకసార్లు జిల్లెళ్ళమూడి వచ్చిపోతూ ఉన్నావారి నిశ్చితాభిప్రాయాలు చెక్కుచెదరక అలాగే ఉన్నాయి. కానీ అమ్మతో సంభాషణలు, అమ్మ మధుర మాతృప్రేమ వారిని ఎంతో ముగ్ధుడ్ని చేశాయి.

తన ఆరోగ్య పరిస్థితి వలన అందరివలె తాను ఆహారం తీసుకోలేకపోతున్నాని అమ్మ అనేది; అందుకు అది ఒక కారణం కావచ్చు. కానీ ఆమె నిద్రపోతుందా ? కొందరు సోదరుల సరసన నేను కూడా అమ్మ మంచం ప్రక్కనే, ఒక్కొక్కసారి మంచం క్రింద దూరి నిద్రించేవాడిని. అమ్మ గురుక పెడుతుంది, కానీ నిద్రపోదు అనేది నా అనుభవం. ఆమెనిద్రపోతున్నట్లు అనిపిస్తుంది, కానీ ఆ సమయంలో ఆ పరిసరాల్లో జరిగే వన్నీ ఆమె మనస్సును చేరుతాయి. ఆ సమయంలో మేము గుసగుసలాడుతూ చేసిన సంభాషణల్ని తర్వాత గుర్తు చేసిన సందర్భాలు అనేకం. అది ఎలా సాధ్యం ?? ఆ సందర్భంగా శాస్త్రం ఇచ్చే వివరణ నాకుతెలియదు. తాను మెలకువగా ఉన్నపుడు అవయవాలు ఎంత చురుకుగా ఉంటాయో, నిద్దపోయే సమయంలోనూ అలాగే ఉంటాయనేది నా పరిశీలన.

ఏకాంతంగా తనతో సంభాషణలు చేయటనికి అమ్మ నాకు ఎన్నో అవకాశాలు ఇచ్చింది. ఏకాంతం అంటే ఆ సమయంలో భౌతికంగా మూడవ వ్యక్తి లేకపోవడం. ఎందుకంటే ఒక్కొక్కసారి అమ్మ ఎంత సన్నగా మాట్లడేదంటే, తాను నాతో మాట్లాడుతున్నదా లేక మరెవరితోనైనా అని ఆశ్చర్యపోయేవాడిని. అమ్మతో నా సంభాషణలు సుదీర్ఘమైనవి; అవి గంటలు కాదు, రోజులు సాగేవి. విభిన్న కోణాల్లోంచి ప్రశ్నించేవాడిని; ఒక్కొసారి చిరాకు ప్రశ్నల్ని కూడా సంధించేవాడిని. నా అదృష్టవశాత్తూ ఆ రోజుల్లో అమ్మ వద్దకు వచ్చే సందర్శకుల సంఖ్య తక్కువే. ఒకసారి అర్ధరాత్రి వేళ గాఢనిద్రలో ఉన్న అమ్మను తట్టి తీపి 'అమ్మా ! దయచేసి చెప్పు. నువ్వు ఎవరివి ?' అని అడిగాను. వెంటనే అమ్మ, "నాన్నా ! నేను అమ్మను" అని సమాధానం ఇచ్చింది. ఆమె మన అందరికీ అమ్మ ఎలా అవుతుంది ? అనే ప్రశ్న అసలు ఎన్నడూ తలెత్తదు; అది నిశ్చయంగా మన పట్ల అమ్మ భావన. మనలో ప్రతి ఒక్కరికి తరతమ భేదాలతో సాటి మనుషుల పట్ల ప్రేమానురాగాలు ఉంటాయి. అందులో ఆశ్చర్యం ఏమీ లేదు. అమ్మలో ఆస్థితి పరాకాష్ఠను అందుకున్నది.

లోగడ చెప్పుకున్న 'నిరాహార', 'నిర్నిద్ర' లక్షణాలే కాకుండా మనల్ని ఆశ్చర్య ఛకితుల్ని చేసేది అమ్మ అసాధారణ జ్ఞాపకశక్తి, అవ్యక్తమైన మన ఆలోచనల జ్ఞానం. ఇది వేలకొలది భక్తుల అనుభవం కూడా. 'అమ్మా ! నీకువెట్లా

తెలుస్తాయి ఇవన్నీ ?" అని ప్రశ్నిస్తే "నాకు తెలియదు. నాకు అలా అనిపించింది. అలా అన్నాను," అని సమాధాన పరిచేది. తనకు మానవాతీత లక్షణాలున్నాయని ఏనాడు ధృవీకరించలేదు. సరికదా అసంఖ్యాక బాధాపరితప్త హృదయాలు తమ ఆవేదనలని అమ్మకి నివేదన చేసినపుడు "విని, నాన్నా ! నేనూ అలాగే బాధపడ్డాను. ఒక సామాన్యగృహిణిని. నీ సమస్యల్నిఎలా పరిష్కరించగలను?" అనేది నిర్లిప్తంగా. అయినా ఆమె మాటల్లోని అసహాయయతను పట్టించుకోకుండా బిడ్డలు అవిరళంగా అమ్మకు తమ గోడును విన్నవించుకునే వారు; కాపాడమని ప్రార్థించేవారు. ఎంతో సహనంతో వారి అభ్యర్థనల్ని ఆలకించి సానుభూతిలో స్పందించేది. ఒక పసిబిడ్డకి అన్నప్రాశన చేయమంటే మురిసిపోయేది; ఎవరికైనా కాలిలో ముల్లు గుచ్చుకుంటే తన కంట్లో గుచ్చుకున్నట్లు విలవిలలాడేది. 'అమ్మా ! ఎన్నాళ్ళనుంచో నీ దర్శనం చేసుకోవాలనుకున్నాను. ఇవాల్టికి లభించింది' అని ఒకరంటే, "నువ్వు అనుకోవటం కాదు, నేను అనుకోవాలి," అని అన్నది అమ్మ. ఆ సందర్భంలో అమ్మ అన్న మాటలు జీవకోటి సమస్త చర్యలకు, పంచభూతాల కదలికలకూ కూడా వర్తిస్తుంది. సృష్టిలోని ప్రతి అణువు మీద అమ్మకి అప్రతిహతమైన శక్తి ఉన్నదా అనిపిస్తుంది, ఆమె మాటలు వింటున్నప్పుడు.

మనకు మనం చేసుకొనే సంకల్పాలు స్వతంత్రమైనవిగా తోచే వాస్తవానికి అస్వతంత్రాలనీ, అవి దైవ సంకల్పానికి ఆధీనమై ఉంటాయని, లేక దైవసంకల్పమే వ్యక్తి సంకల్పాన్ని నిర్దేశిస్తుందని ఏతా వాతా మనకి బోధపడుతుంది. 'దైవం' అనే పదానికి బదులు సమిష్టిచేతన అనే మాటను ఉపయోగిద్దామా ? ఆ రోజుల్లో కార్ల్‌యంగ్ ఋతిపాదించిన (Collective Unconsciousness) సమిష్టి చేతన గురించిన జ్ఞానం నాకు అప్పట్లో లేదు. కావున అమ్మతో ఆ విషయ ప్రస్తావన చేయలేదు. అయితే సందర్భాను సారంగా ముఖాముఖి సంభాషణల్లో సైన్సుపరంగా మహా విస్ఫోటన (Big bang) సిద్ధాంతం, ఐయిన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం మొదలైన ప్రస్తావనను చేశాను. గొప్ప గొప్ప శాస్త్రజ్ఞులు గ్రంథాల్లో సుదీర్ఘంగా తర్కించిన శాస్త్రీయ భావనల్ని అమ్మ అలతి అలతి మామూలు తెలుగు మాటలలో సునాయాసంగా వివరించేది. డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారి వలె అమ్మతో నా సంభాషణలను నేను

భద్రపరచుకోలేదు దురదృష్టం. అమ్మతో సంభాషణలకు గల చారిత్రక విలువని ఆ సమయంలో నేను గుర్తించలేకపోయానని ఒప్పుకుంటాను. బహుశః అది కూడా అమ్మ సంకల్పమేమో!

సారాంశమేమంటే వ్యక్తి సంకల్పం అస్వతంత్రమైనది కనుక విధాత నిర్ణయం ప్రకారమే ఏదైనా జరుగుతుంది. అమ్మ గర్భ సంజాత సోదరి హైమ కన్నుమూసేనాటికి వయస్సు 25 ఏళ్ళు మాత్రమే. చాలామంది ఏదో విధంగా అమ్మ తనకూతురి జీవితాన్ని కాపాడుతుంది అని అభిప్రాయపడ్డారు. వారి మనోగత అభిప్రాయాన్ని ఎరిగి "అన్నీ విధి నిర్ణయం ప్రకారమే జరుగుతాయి" అని అమ్మ చెప్పింది. హైమ స్వల్ప జీవిత వ్యవధి గురించి అమ్మకు స్పష్టంగా ముందే తెలుసు. సుమారు 18 ఏళ్ళ వయస్సులో హైమ వివాహం గురించి ఒక సందర్భంలో అమ్మతో ప్రస్తావించాను. అమ్మ ఆ విషయాన్ని దాటవేయలేదు, కానీ కొంతకాలం తర్వాత ఆలోచిద్దాం అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చింది. (ఇవే మాటలు కాకపోవచ్చు) అందుకు కారణం తనకు మాత్రమే తెలుసు. హైమకు మంచి సంబంధం కోసం ఏ రకమైన ప్రయత్నమూ చేయలేదు. నిర్ణయాన్ని తప్పించుకోవటం అసాధ్యం అని తెలుస్తోంది. 'నిర్ణయం', మరియు 'విధి' భావనలను ఎరిగిన కొందరు తాత్వికులు వాటిని అమ్మ భావనలకి అన్వయించాలనుకుంటారు. కానీ అవి అమ్మ భావనలకి ఖచ్చితంగా సమానం కావు. భారతీయ తత్వాంతర్గతమైన అసిద్ధాంతాలు అమ్మ భావాలకి దగ్గరగా ఉంటాయి కానీ అక్షరాలా అవే కావు.

'దేవుడు' అనే అంశం మీద మనుష్యులు తమలో తాము వాదించుకొంటున్నారు, కలహించుకుంటున్నారు, యుద్ధాలు చేస్తున్నారు. రెండవ సహస్రాబ్ది చివరిపాదంలో శాస్త్రసాంకేతిక రంగాల్లో గణనీయంగా ప్రగతి సాధ్యమైంది. దాని వలన ఎందరో జనులు లబ్ధిపొందారు. శాస్త్ర సాంకేతిక రంగాల సత్ఫలితాల్ని పొందటంలో అంతా ఒకటే; ఏ షభిప్రాయ భేదాలూ లేవు. కానీ మతం తన ఆధిపత్యాన్ని మానవాళి ఆలోచన మీద చెలాయిస్తూనే వచ్చింది. నూతన సహస్రాబ్ధి ఆరంభంలో మత విశ్వాసాల మూలంగా ప్రపంచం అగాధంలో కూరుకుపోయింది; ముక్కలు చెక్కలై పోయింది.

నిజంగా 'ప్రార్థన' సాయం చేస్తుందా ? ప్రార్థనల వలన ఏదైనా నెరవేరితే ఏ ఒక్కరికి బాధలుండేవి కావు. అమ్మ చెప్పినట్లు ప్రతీదీ ముందుగానే నిర్ణయించబడితే మందిరాలకు పోయి దేవుణ్ణి ప్రార్థించటం ఎందుకు ? ఎవరైనా జిల్లెళ్ళమూడి వెళ్ళి అక్కడ ఆలయాల్లో అమ్మనైనా, హైమనైనా పూజించటం ఎందుకు ? ఇవన్నీ ఆలోచనకు అందని ప్రశ్నలు. ఆలయాలకు, చర్చిలకు, మసీదులకు, మందిరాలకు ప్రజలు వెడుతున్నారు; ఎందుకంటే అది ఉపయోగకరమైనదీ, ప్రతిఫలాన్ని ఇచ్చేది అని. వారి ప్రార్థనలన్నీ ఫలించకపోవచ్చు. మన ప్రార్థనల్లో వేనిని ఆమోదించాలో దైవానికి మాత్రమే తెలుసు; జిల్లెళ్ళమూడిలోని అమ్మ దేవాలయాల విషయంలో కూడా అది సత్యమే. దైవం అగ్రాహ్యమైనది; అలాగే అమ్మ కూడా. సకల సృష్టిలోనూ దైవాన్ని చూడమనే అమ్మ సలహా అందరికీ ఆమోదయోగ్యమైనదీ ఈ షణ్మాత్రము వైరుధ్యం లేనిది. మన చేతల్ని, అనుభవాల్ని నిర్దేశించేది తానేనని అమ్మ చెప్పింది. అమ్మ ఇచ్చిన హామీని అది మరొకసారి ధ్వనిస్తుంది.

ఏ తల్లి అయిన తన బిడ్డల్ని సంరక్షిస్తుంది. అది కావాలనీ, ఇది కావాలని పిల్లలు పేచీ పెడతారు; కానీ తల్లి వారికి ఏదో మంచిదో అదే ఇస్తుంది; కారణం వాళ్ళకు ఏది మంచిదో కాదో తనకే తెలుసు కనుక. తాను అందరికీ తల్లినని అమ్మ షన్నది. అంటే తాను మనందరినీ సంరక్షిస్తానని హామీనిచ్చేనట్లే. మనకేది మంచిదో తనకి ఖచ్చితంగా తెలుసు. మన ఊహకు అందని సమస్యల్ని గురించి మనకి అర్థం కానివిషయాల గురించి మదనపడి తలలు పగులగొట్టుకొనే కంటే, మన షనుభవాల దృష్ట్యా సహేతుకంగా 'అమ్మ మనల్నందరినీ పరిరక్షిస్తుంది, ఏది జరిగితే అది అమ్మ దయ' అని భావిద్దాము.

తత్వశాస్త్ర వేదాంత క్షేత్రాలలో అత్యంత సులభగ్రాహ్యాభావన 'మాతా శివు బంధం'. ఇక్కడ తల్లి అంటే దైవం; శిశువు అంటే భక్తుడు. "రక్తమంతా ఈశ్వర తత్వమే" అని అన్నది అమ్మ. ఎప్పుడైతే ఈ భావన మనకి అర్థం అవుతుందో, అపుడు అమ్మ అవతారమా ? ప్రవక్తా ? అతీంద్రియ శక్తిసంపన్నా? అనే ప్రశ్నలు అసంబద్ధమౌతాయి. శాశ్వతమైన భగవత్తత్వాన్ని గురించి ఇంత సులభమైన పరిష్కారాన్ని ప్రపంచంలో ఇతఃపూర్వం నెలకొన్న ఏ తత్వశాస్త్రం మనకి బోధిస్తోంది !

మానవీయ దృక్పథం, విజ్ఞాన విలసనం, నిష్పాక్షికత, ఉదాత్త సంస్కారము, ప్రజ్ఞాప్రాభవం గల జంటిల్‌మెన్ జర్నలిస్టు.

ప్రెస్ అకాడమీ పూర్వాధ్యక్షుడు. మితభాషి, హితభాషి, సౌమ్యభాషి శాంతిపురస్కార గ్రహీత.

తెలుగు పత్రికారంగంలో ఐదు దశాబ్దాల అనుభవం. హేతువాది. వేదాన్ని నమ్ముతారు. ధ్యానయోగి. ఆధ్యాత్మిక పదకోశాన్ని వ్రాసిన ప్రతిభా సంపన్నుడు. జర్నలిజాన్ని గూర్చి ఎన్నో విలువైన గ్రంథాలు వ్రాసారు.

జిల్లెళ్ళమూడి అమ్మ యొక్క మహోన్నత మానవీయ లక్షణాలకు వాత్సల్యానికి, ఆకర్షితులై, ఆరాధకులైనారు. అనుభవ వేదాంత నిధులు మాతృశ్రీ సూక్తి సుధలు అని వారి విశ్వాసం. విశ్వకుటుంబ నిర్మాణానికి అమ్మచేసే ప్రశాంత విప్లవ మహోద్యమంలో భాగస్వామియైనారు.

శ్రీ విశ్వజననీ పరిషత్ పూర్వాధ్యక్షులు, ప్రస్తుత పెద్దదిక్కు.
విశ్వజననీ మాసపత్రిక గౌరవసంపాదకులు
శ్రీ పొత్తూరి వేంకటేశ్వరరావుగారు.

అమ్మను గూర్చి వివిధ సందర్భాలలో వారి
అంతరంగం నినదించిన ఆలాపనలే

'అంతా ఆమె దయే'

అన్న వారి ఈ గ్రంథం .

శ్రీ విశ్వజననీపరిషత్

జిల్లెళ్ళమూడి



డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వరరావు